



సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14+12 వెల: ₹ 5.00

సంపుటి: 12 సంచిక: 275

గురువారం 26-12-2019

SIMULTANEOUSLY PRINTED AT NALGONDA | KARIMNAGAR | MUMBAI | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAHMUNDRY | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


## నేడే సూర్యగ్రహణం

- 3 గంటల 12 నిమిషాల సేపు కొనసాగుతుంది.
- ఉచ్ఛస్థితికి ఉదయం 9:27కి చేరుకుంటుంది.
- గ్రహణాన్ని నేరుగా చూడొద్దంటున్న శాస్త్రవేత్తలు

- వివరాలు 5లో






బుధవారం హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ మైదానంలో నిర్వహించిన సార్వజనీన సమ్మేళనానికి భారీగా హాజరైన స్వయం సేవకులను ఉద్దేశించి ప్రసంగిస్తున్న ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్



# అందరిలో కలుస్తాం..

## అందరి కోసం పనిచేస్తాం: ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్

- ఆదర్శ హిందూ సమాజాన్ని స్థాపించటమే లక్ష్యం
- విమర్శలు, నిందలను లెక్క చేయం
- మా మనసులో ఉండేది ప్రేమ భావమే
- సమాజం కోసం పనిచేస్తూ భరతమాతను ఆరాధించేవారంతా హిందువులే.. దేశాన్ని విశ్వ గురువు స్థానంలో నిలుపుతామని స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్

'పేరు కోసం పాకులాడం, స్వార్థం కనిపించదు. ధన్యవాదాలను కూడా ఆశించం. ఈ దేశాన్ని విశ్వగురువు స్థానంలో నిలపటమే లక్ష్యం. మనసు నిండా ప్రేమ భావం నింపుకొని అందరిలో కలుస్తాం.. అందరినీ కలుపుకొంటాం.. దేశాన్ని ఉన్నతంగా నిలిపే దీక్షలో సమాజంతో మమేకమై ముందుకు నడుస్తాం. అందరి కోసం పనిచేస్తాం.. ఇదే సంఘ్ ఉద్దేశం. ఈ ప్రయాణంలో మాపై ఎన్ని నిందలు వచ్చినా.. ఎన్ని విమర్శలు ఎగసిపడ్డా లెక్క చేయం. అప్పుడప్పుడూ వాటికి స్పందిస్తూ మేం కొన్ని మాటలు అనొచ్చు.. కానీ మనసులో మాత్రం ప్రేమ భావమే ఉంటుంది. అందులో భరతమాతే కన్పిస్తుంది'అని రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ చీఫ్, సర్ సంఘ చాలక్ మోహన్ భాగవత్ అన్నారు. సమస్త హిందూ సమాజాన్ని బాగు చేసే లక్ష్యంతో సంఘ్ ముందుకు సాగుతోందని, ఇందులో ఎన్ని అవరోధాలు ఎదురైనా లెక్కచేయకుండా కాగడాను తలకిందులు చేసినా, అందులోని మంట ఊర్ధ్వముఖంగా ఉన్నట్లే ముందుకు సాగుతామని పేర్కొన్నారు. హైదరాబాద్‌లోని ఇబ్రహీంపట్నంలో మూడు రోజులపాటు జరిగే విజయ సంకల్ప శిబిరంలో భాగంగా రెండో రోజైన బుధవారం సరూర్‌నగర్ మైదానంలో

మిగతా 3వ పేజీలో ▶

# ఆర్టీసీలో ఇక 60 ఏళ్లు

- ఉద్యోగుల రిటైర్మెంట్ వయసు 58 నుంచి 60 ఏళ్లకు పెంపు
- ప్రభుత్వ సరుకు రవాణా ఆర్టీసీ ద్వారానే..
- సరుకు రవాణా విభాగాన్ని పటిష్ట పరచాలి
- ఆర్టీసీ గాడిన పడితే ఉద్యోగులకు బోనస్
- 202 మంది ఉద్యోగులతో వెల్ఫేర్ బోర్డు
- బోర్డు సమావేశాల్లో ఉద్యోగుల సమస్యల పరిష్కారం
- ఆర్టీసీపై సమీక్షలో సీఎం కేసీఆర్ నిర్ణయాలు

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) ఉద్యోగులకు శుభవార్త. ఆర్టీసీ ఉద్యోగుల పదవీ విరమణ వయసును 58 ఏళ్ల నుంచి 60 ఏళ్లకు పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించిన ఉత్తర్వులపై ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు బుధవారం సంతకం చేశారు. ఆర్టీసీలో పనిచేసే ప్రతీ ఉద్యోగికీ పదవీ విరమణ వయసు పెంపు నిర్ణయం వర్తిస్తుంది. ఇటీవల ఆర్టీసీ కార్మికులతో జరిగిన సమావేశంలో పదవీ విరమణ వయసును పెంచుతామని ఇచ్చిన హామీ మేరకు ఈ నిర్ణయం తీసుకున్నారు. బుధవారం ఆర్టీసీపై ముఖ్యమంత్రి ఉన్నత స్థాయి సమీక్ష నిర్వహించారు. ఆర్టీసీని లాభాల బాట పట్టించడం, సరుకు రవాణా విభాగాన్ని పటిష్టం చేయడం, కార్మికులకు ఇచ్చిన హామీల అమలు తదితర అంశాలపై ముఖ్యమంత్రి సమీక్షించారు. ఆర్టీసీలో కార్గో, పార్సిల్ సేవలను విస్తృత పరిచేందుకు అవసరమైన వ్యూహం సిద్ధం చేయాలని సీఎం కేసీఆర్ ఆదేశించారు. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించినట్లే, అన్ని చోట్లకూ సరుకు రవాణా చేయాలన్నారు.

**ఎక్కడి నుంచి ఎక్కడికైనా సరుకు రవాణా..**

'ఆర్టీసీ బస్సులు ప్రతీరోజు రాష్ట్రంలోని అన్ని నగరాలు, పట్టణాలు, గ్రామాలను చుట్టి వస్తున్నాయి. లక్షలాది మందికి రవాణా సౌకర్యం కల్పిస్తున్నాయి. అదే మాదిరిగా ఎక్కడి నుంచి

మిగతా 2వ పేజీలో ▶



బుధవారం లక్నోలో ఆవిష్కరించిన వాజ్‌పేయి 25 అడుగుల భారీ విగ్రహానికి పుష్పాంజలి ఘటిస్తున్న ప్రధాని మోదీ

# వారు బాధ్యత గుర్తించాలి

"ఆందోళనకారులు తమ హక్కులు, బాధ్యతలు గుర్తెరిగి ప్రవర్తించాలి. ఆందోళనల్లో గాయపడ్డ, పోలీసులు, సామాన్యులు ఏం తప్పు చేశారు? ఆర్టికల్ 370 రద్దుతో ఓ పాత జబ్బు శాంతియుతంగా నయమైపోయింది. రామజన్మభూమి సమస్య కూడా శాంతియుతంగానే పరిష్కారమైంది.

– ప్రధాని మోదీ

- వివరాలు 5లో

# ఫార్మాసిటీకి 'నిమ్జ్' హోదా

ఫార్మా రంగం విస్తరణ, నూతన పెట్టుబడులు ఆకర్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన 'హైదరాబాద్ ఫార్మాసిటీ'కి జాతీయ పెట్టుబడులు, ప్రోత్సాహక మండలి (నిమ్జ్) హోదా ప్రతిపాదనకు కేంద్రం తుది ఆమోదం తెలిపింది. దీంతో ఫార్మాసిటీలో బాహ్య, అంతర్గత మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్రం నుంచి సాయం అందుతుందని రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేస్తోంది.

- 2లో









ఇదంజగత్



... టాటా బైబై!



బుధవారం ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌తో సమావేశమైన ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీ

# ఎన్పీఆర్ ఆపండి

## అసద్ నేతృత్వంలో కేసీఆర్‌ను కలసిన ముస్లింల ఐక్య కార్యాచరణ సమితి

- రెండు రోజుల్లో నిర్ణయం తీసుకుంటామని సీఎం హామీ
- రాష్ట్రంలో 29% జనాభా వద్దే పుట్టిన తేదీ ధ్రువపత్రాలు
- 27న నిజామాబాద్‌లో అఖిలపక్ష పార్టీలతో బహిరంగ సభ
- సీఎంతో భేటీ వివరాలను వెల్లడించిన అసదుద్దీన్ ఒవైసీ


సాక్షి, హైదరాబాద్

'కేరళ తరహాలో రాష్ట్రంలో సైతం నేషనల్ పాపులేషన్ రిజిస్టర్ (ఎన్పీఆర్) పనులను నిలుపుదల చేయాలని సీఎం కె.చంద్రశేఖర్‌రావుకు విజ్ఞప్తి చేశాం. ఎన్పీఆర్, నేషనల్ రిజిస్ట్రర్ ఆఫ్ ఇండియన్ సిటిజన్స్ (ఎన్ఆర్‌ఐసీ)కి ఏమాత్రం సంబంధం లేదని, కేంద్ర హోం మంత్రి అమిత్‌షా దేశాన్ని తప్పుదోవపట్టిస్తున్నారని సీఎంకు వివరించాం. ఎన్ఆర్‌ఐసీకి ఎన్పీఆర్ తొలి అడుగు అని పేర్కొంటున్న కేంద్ర హోం శాఖకు సంబంధించిన వివిధ పత్రాలను రుజువులుగా ఆయనకు అందజేశాం. నిర్ణయం తీసుకోవడానికి కేసీఆర్ రెండు రోజుల సమయం కోరారు. సీఎం సానుకూల నిర్ణయం తీసుకుంటారని భరోసా ఉంది'అని ఎంఐఎం అధినేత, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ పేర్కొన్నారు. ముస్లింల ఐక్య కార్యాచరణ సమితి ప్రతినిధి బృందంతో కలసి బుధవారం ఆయన ప్రగతిభవన్‌లో ముఖ్యమంత్రి కేసీఆర్‌ను కలిశారు. రాష్ట్రంలో ఎన్పీఆర్ పనులను నిలుపుదల చేయాలని వినతిపత్రం అందజేశారు. అనంతరం అసద్ మాట్లాడుతూ.. మూడు గంటలకు పైగా సీఎంతో సమావేశం సాగిందన్నారు. ఆర్టికల్ 131 ఆధారంగా కేంద్ర ప్రభుత్వ నిర్ణయాలను రాష్ట్ర ప్రభుత్వం సుప్రీం కోర్టులో సవాలు చేయవచ్చని సలహా ఇచ్చామన్నారు. 'ఈ అంశంపై ఒకే రకమైన ఆలోచన ధోరణి కలిగిన పార్టీలతో కేసీఆర్ మాట్లాడతారన్నారు. అవసరమైతే అందరినీ ఆహ్వానించి బహిరంగ సభ కూడా నిర్వహిస్తారు. ఇది కేవలం ముస్లింల సమస్య కాదు.. యావత్ దేశానిది, రాజ్యాంగానిది అని సీఎం పదేపదే అన్నారు. మతాల పేరుతో

మిగతా 2వ పేజీలో ▶




- వివరాలు 4లో

# ఫార్మాసిటీకి 'నిమ్జ్' హోదా

- కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ ఆమోదం
- 2016లోనే కేంద్రం సూత్రప్రాయ అంగీకారం
- తాజాగా తుది ఆమోదం తెలిపిన కేంద్రం
- రూ.3,418 కోట్ల గ్రాంటు ఇవ్వాలని కోరిన రాష్ట్రం

**సాక్షి, హైదరాబాద్:** ఫార్మా రంగం విస్తరణ, నూతన పెట్టుబడులు ఆకర్షించేందుకు రాష్ట్ర ప్రభుత్వం తలపెట్టిన 'హైదరాబాద్ ఫార్మాసిటీ'కి జాతీయ పెట్టుబడులు, ప్రోత్సాహక మండలి (నిమ్జ్) హోదా ప్రతిపాదనకు కేంద్ర ప్రభుత్వం తుది ఆమోదం తెలిపింది. 2015లో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఫార్మాసిటీకి నిమ్జ్ హోదా ఇచ్చేందుకు కేంద్ర పరిశ్రమల శాఖ పరిధిలోని పరిశ్రమల ప్రోత్సాహక విధాన విభాగం (డిప్) 2016 జనవరి 22న సూత్రప్రాయ ఆమోదం తెలిపింది. ఆ తర్వాత ఫార్మాసిటీకి సంబంధించిన టెక్నో ఎకనామిక్ ఫీజిబిలిటీ రిపోర్టు (సాంకేతిక ఆర్థిక సాధ్యాసాధ్యాల నివేదిక)తో పాటు అభివృద్ధి ప్రణాళిక నివేదికను రాష్ట్ర ప్రభుత్వం సమర్పించింది. ఈ నివేదికలను కూలంకషంగా పరిశీలించిన కేంద్ర పరిశ్రమల శాఖ ఫార్మాసిటీకి నిమ్జ్ హోదా కల్పించాలనే రాష్ట్ర ప్రభుత్వ ప్రతిపాదనకు ఈ నెల 10న తుది ఆమోదం తెలపడంతో పాటు, రాష్ట్రానికి సమాచారం అందించింది. నిమ్జ్ హోదాకు పూర్తి స్థాయిలో ఆమోదం లభించిన నేపథ్యంలో ఫార్మాసిటీలో బాహ్య, అంతర్గత మౌలిక సదుపాయాల కల్పనకు కేంద్రం నుంచి గ్రాంటు రూపంలో సాయం అందుతుందని రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేస్తోంది.

### నిధుల వేటలో రాష్ట్ర ప్రభుత్వం

ఫార్మాసిటీ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.16,395 కోట్లు కాగా, నిమ్జ్ హోదా ద్వారా మౌలిక సదుపాయాల కల్పనకు కనీసం రూ.6 వేల కోట్లు వస్తాయని రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేస్తోంది. ఫార్మాసిటీలో బాహ్య, అంతర్గత మౌలిక, సాంకేతిక సదుపాయాల కల్పనకు రూ.6 వేల కోట్లు ఇవ్వాలని 'డిప్'కు రాష్ట్ర ప్రభుత్వం గతంలో ప్రతిపాదనలు సమర్పించింది. తొలి విడతలో రూ.1,500 కోట్లు ఇచ్చేందుకు కేంద్రం సుముఖత వ్యక్తం చేసినా నిధులు విడుదల కాలేదు. దీంతో రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ ఈ ఏడాది అక్టోబర్ 19న ఫార్మాసిటీ అభివృద్ధికి నిధులు ఇవ్వాలంటూ మరోమారు ప్రతిపాదనలు సమర్పించారు. ఫార్మా సిటీ తొలి దశ అభివృద్ధిలో భాగంగా రోడ్లు, నీటి సరఫరా తదితర బాహ్య సదుపాయాల కోసం రూ.1,318 కోట్లు, అంతర్గత సదుపాయాల కోసం రూ.2,100 కోట్లు, మొత్తంగా రూ.3,418 కోట్లు ఇవ్వాలని కేంద్రాన్ని కోరారు. కేంద్రం చేపట్టిన 'మేకిన్ ఇండియా'లో భాగంగా ప్రపంచ శ్రేణి ఫార్మాసిటీనిఅభివృద్ధి చేసేందుకు సహకరించాలని కోరారు. చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి కూడా ఈ అంశాన్ని ఇటీవల లోక్‌సభలో ప్రస్తావించారు.

### 5.6 లక్షల మందికి ఉపాధి

రంగారెడ్డి జిల్లా ముచ్చర్లలో 19,333 ఎకరాల్లో ఏర్పాటు చేసే హైదరాబాద్ ఫార్మాసిటీ ద్వారా 5.6 లక్షల మందికి ప్రత్యక్ష, పరోక్ష ఉపాధి లభిస్తుందని రాష్ట్ర ప్రభుత్వం అంచనా వేసింది. మౌలిక సదుపాయాలు కల్పిస్తే రూ.64 వేల కోట్ల పెట్టుబడులకు అవకాశం ఉందని భావిస్తోంది. ఈ నేపథ్యంలో మౌలిక సదుపాయాల కల్పనను త్వరితగతిన పూర్తి చేసేందుకు టీఎస్ఐఐసీ ఆధ్వర్యంలో 'హైదరాబాద్ ఫార్మాసిటీ లిమిటెడ్'పేరిట స్పెషల్ పర్పస్ వెహికల్ (ఎస్పీవీ) కూడా ఏర్పాటు చేశారు. ఫార్మాసిటీలో అంతర్గత మౌలిక సౌకర్యాల కల్పనకు అవసరమైన నిధుల కోసం ఆసియా ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకుకు ప్రతిపాదనలు సమర్పించింది. ఫార్మాసిటీని ప్రధాన రహదారులతో అనుసంధానిస్తూ సుమారు రూ.400 కోట్లతో రహదారుల విస్తరణ, విద్యుత్ లైన్ల ఏర్పాటు వంటి పనులు కూడా ఎస్పీవీ చేపట్టింది.

# కేంద్ర నిధులు... తెలంగాణకే ముందు!

- వివిధ పథకాల కింద రెండో విడతలో రూ.452.62 కోట్లిచ్చిన కేంద్రం
- ఇప్పటివరకు రూ.834.62 కోట్లు వచ్చాయన్న విద్యాశాఖ
- ఇక రావాల్సిందల్లా రెండో విడత రాష్ట్ర వాటా రూ.301.75 కోట్లే

**సాక్షి, హైదరాబాద్:** సమగ్ర శిక్షా అభియాన్ (ఎస్ఎస్ఏ), రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్ (ఆర్ఎంఎస్ఏ), టీచర్ ఎడ్యుకేషన్ కింద తెలంగాణకే ముందుగా కేంద్ర నిధులు వచ్చాయి. కేంద్ర ప్రభుత్వం మొదటి విడతలో ఇచ్చిన రూ. 382 కోట్లకు సకాలంలో రాష్ట్ర విద్యాశాఖ యుటిలైజేషన్ సర్టిఫికెట్లు (యూసీ) ఇవ్వడంతో ఈసారి మిగతా రాష్ట్రాల కంటే ముందుగా తెలంగాణకే రెండో విడత నిధులు ఇచ్చింది. రెండో విడత కింద రూ. 452.62 కోట్లు విడుదల చేసింది. ఈ మేరకు ప్రాజెక్టు అప్రూవల్ బోర్డు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వం రెండో విడతలో తమ వాటా నిధులు రూ. 301.75 కోట్లు విడుదల చేయాల్సి ఉంది. విద్యాశాఖలో మధ్యాహ్న భోజనం, విద్యాభివృద్ధి కార్యక్రమాలు, పాఠశాలల భవన నిర్మాణాలు తదితర కార్యక్రమాలకు (కేంద్ర ప్రాయోజిత పథకాలు) కేంద్ర ప్రభుత్వం 60 శాతం నిధులను ఇస్తుండగా, రాష్ట్ర ప్రభుత్వం 40 శాతం నిధులను వెచ్చించాల్సి ఉంది. గతంలో మొదటి విడత నిధుల విడుదలలో రాష్ట్ర ప్రభుత్వం జాప్యం చేసేది. దీంతో విద్యాశాఖ కేంద్రానికి సకాలంలో యుటిలైజేషన్ సర్టిఫికెట్లు ఇచ్చే పరిస్థితి ఉండేది కాదు. రాష్ట్రానికి కేంద్రం నుంచి రావాల్సిన రెండో విడత నిధులు సకాలంలో వచ్చేవి కావు. అయితే ఈసారి రాష్ట్రం తమ మొదటి విడత వాటా నిధులను సకాలంలో విడుదల చేయడంతో కేంద్రం రెండో విడత నిధులను కూడా ఇచ్చింది. దీంతో సమగ్ర శిక్షా అభియాన్, రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్, టీచర్ ఎడ్యుకేషన్ కింద కేంద్రం నుంచి రాష్ట్రానికి ఇప్పటివరకు రూ. 834.62 కోట్లు వచ్చినట్లు విద్యాశాఖ వర్గాలు వెల్లడించాయి.

**రెండో విడతలో కేంద్రం ఇచ్చిన నిధులు..**

| | |
|---|---|
| సమగ్ర శిక్షా అభియాన్: | రూ. 301.13 కోట్లు |
| రాష్ట్రీయ మాధ్యమిక శిక్షా అభియాన్: | రూ. 148.71 కోట్లు |
| టీచర్ ఎడ్యుకేషన్: | రూ. 2.78 కోట్లు |
| మొత్తం: | 452.62 కోట్లు. |

# రిజర్వేషన్ల ఖరారుకు ముందే ఎన్నికలు జరపొద్దు

### ఎస్ఈసీకి బీసీ సంక్షేమ సంఘం వినతి

**సాక్షి, హైదరాబాద్:** మున్సిపల్ ఎన్నికల ప్రక్రియలో రిజర్వేషన్లు ఖరారవ్వక ముందే ఎన్నికల నోటిఫికేషన్ ఇవ్వొద్దని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈమేరకు బుధవారం ఆయన రాష్ట్ర ఎన్నికల కమిషన్ కార్యదర్శి ఎం.అశోక్‌కుమార్‌ను కలసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ.. బీసీలకు 34 శాతం రిజర్వేషన్ల అంశానికి సంబంధించి 7 నెలలుగా హైకోర్టులో పిటిషన్ పెండింగ్‌లో ఉందని, తీర్పు రాకముందే ఎన్నికలు నిర్వహించొద్దన్నారు. ఇప్పటికే పంచాయతీ, మండల పరిషత్, జిల్లా పరిషత్ ఎన్నికల్లో బీసీల ప్రాతినిధ్యం బాగా తగ్గిందన్నారు. ఖరారు చేసిన రిజర్వేషన్ల ప్రకారం ఎన్నికలు జరిపితే మున్సిపాలిటీల్లోనూ బీసీలకు అవకాశాలు తగ్గిపోతాయని ఆందోళన వ్యక్తం చేశారు.



బుధవారం ప్రగతి భవన్‌లో ఆర్టీసీపై సమీక్ష నిర్వహిస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో సీఎస్ ఎస్‌కే జోషి, మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ఆర్టీసీ ఇన్‌చార్జి ఎండీ సునీల్‌శర్మ తదితరులు

# ఆర్టీసీలో ఇక 60 ఏళ్లు

▶ మొదటి పేజీ తరువాయి

ఎక్కడికైనా, ఏ మారుమూల ప్రాంతానికైనా సరుకు రవాణా చేయాలి. ప్రభుత్వంలోని వివిధ శాఖల ద్వారా జరిగే సరుకు రవాణాను ఇకపై కచ్చితంగా 'ఆర్టీసీ కార్గో అండ్ పార్సిల్ సర్వీస్'ద్వారానే చేస్తాం. దీనికి సంబంధించి అన్ని శాఖలకు కచ్చితమైన ఆదేశాలు జారీ చేస్తాం. బతుకమ్మ చీరలు, విద్యా సంస్థలకు పుస్తకాలు, డిపోల నుంచి బ్రాందీ షాపులకు మద్యం, ఆస్పత్రులకు మందులు ఇలా ప్రభుత్వపరంగా జరిగే ప్రతీ సరుకు రవాణా ఇకపై ఆర్టీసీ ద్వారానే జరిగేటట్లు చూస్తాం. ప్రజలు తమ సరుకులను రవాణా చేయడానికి ఇప్పటిదాకా ప్రైవేటు ట్రాన్స్‌పోర్టును ఉపయోగిస్తున్నారు. ఇకపై ఆర్టీసీలోనే తమ సరుకును రవాణా చేసేలా ప్రోత్సహించాలి. నగరాలు, పట్టణాల నుంచి మారుమూల ప్రాంతాలకు సరుకు రవాణా చేయడానికి ఏర్పాట్లు చేయాలి. ఆర్టీసీ బస్సు పోని ఊరంటూ లేదు. ప్రతీ మారుమూలకూ పోతోంది. ఆర్టీసీ సురక్షితం అనే పేరుంది. కాబట్టి సరుకు రవాణా విభాగాన్ని పటిష్టపరిస్తే ప్రజలు తమ సరుకులను కచ్చితంగా ఆర్టీసీ ద్వారానే రవాణా చేస్తారు. కేవలం రాష్ట్ర పరిధిలోనే కాకుండా తెలంగాణ ప్రజలు ఎక్కువగా నివసించే ముంబై, భివండి, షోలాపూర్, నాగ్‌పూర్, జగ్దల్‌పూర్ తదితర ప్రాంతాలకూ సరుకు రవాణా చేయాలి. సరుకు ఎగుమతి, దిగుమతి కోసం హైదరాబాద్‌తో పాటు ఇతర నగరాల్లో చాలా చోట్ల స్టాక్ పాయింట్లు పెట్టాలి. సరుకు రవాణా ఎక్కువ చేయగలిగితే ప్రజలకు సౌకర్యవంతంగా ఉంటుంది, ఆర్టీసీకి లాభాలు వస్తాయి. ఆర్టీసీ లాభాల బాటన పయనిస్తే ఉద్యోగులకు బోనస్ కూడా ఇచ్చుకునే పరిస్థితి వస్తుంది. సరుకు రవాణా విషయంలో ఎలా వ్యవహరించాలనే విషయంలో ఉద్యోగులకు తగిన శిక్షణ ఇవ్వాలి. సరుకు రవాణాకు అనుగుణంగా బస్సులను సిద్ధం చేయాలి..'అని సీఎం వివరించారు.

**డిపోల వారీగా ఉన్నతాధికారుల సమావేశాలు..**

ఆర్టీసీ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి, ఎప్పటికప్పుడు ఎదురయ్యే పరిస్థితిని ఎదుర్కోవడానికి ఇప్పటికే ఇచ్చిన హామీ మేరకు ఎంప్లాయీ వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదేశించారు. బోర్డు కూర్పుకు సంబంధించి ఈ సమావేశంలో నిర్ణయం తీసుకున్నారు. ప్రతీ డిపో నుంచి, ప్రధాన కార్యాలయం నుంచి ఇద్దరు చొప్పున ఉద్యోగులు.. మొత్తం 202 మంది బోర్డులో సభ్యులుగా ఉంటారు. ఇందులో 94 మంది బీసీలు, 38 మంది ఎస్సీలు, 26 మంది ఎస్టీలు, 44 మంది ఓసీలుంటారు. మొత్తం సభ్యుల్లో మహిళా ఉద్యోగులు 73 మంది ఉంటారు. బోర్డు సమావేశం డిపో పరిధిలో వారానికోసారి, రీజియన్ పరిధిలో నెలకోసారి, కార్పొరేషన్ పరిధిలో మూడు నెలలకోసారి జరుగుతుంది. ఈ సమావేశాల్లో ఉద్యోగులకు ఎదురయ్యే సమస్యలు, ఇబ్బందులను పరిష్కరిస్తారు. ఆర్టీసీని కాపాడడానికి, లాభాల బాట పట్టించేందుకు, ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను వివరిస్తూ, ఉద్యోగులు కూడా తగిన స్ఫూర్తితో, చిత్తశుద్ధితో తమ బాధ్యతలు నిర్వర్తించేలా చూడాలని అధికారులకు ముఖ్యమంత్రి సూచించారు. రాబోయే పది రోజుల పాటు ఆర్టీసీ ఈడీలు, ఉన్నతాధికారులు డిపోల వారీగా సమావేశాలు నిర్వహించి, ఎక్కడికక్కడ తగిన వ్యూహం రూపొందించాలన్నారు. హైదరాబాద్‌లోని వివిధ డిపోల నుంచి నేరుగా చెన్నై, నాగ్‌పూర్, ముంబై తదితర ప్రాంతాలకు వెళ్లే బస్సు సర్వీసుల సంఖ్యను పెంచాలని సూచించారు. వివాహాలు, విహారయాత్రలకు ఆర్టీసీ బస్సులు ఇచ్చే విషయంలో సరళమైన విధానం అనుసరించాలని చెప్పారు. సమావేశంలో రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్‌కే జోషి, ఆర్టీసీ ఇన్‌చార్జి ఎండీ సునీల్ శర్మ పాల్గొన్నారు. కాగా ఆర్టీసీ అధికారుల ఆధ్వర్యంలో శామీర్‌పేట డిపోలో శుక్రవారం వన భోజనాలు నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి సీఎం కేసీఆర్‌తో పాటు పలువురు మంత్రులు హాజరవుతారని హకీంపేట డిపో మేనేజర్ భాస్కర్‌రెడ్డి బుధవారం తెలిపారు.



బుధవారం క్రిస్మస్ సందర్భంగా వైఎస్సార్ జిల్లా పులివెందుల సీఎస్ఐ చర్చిలో విజయమ్మతో కలసి కేక్ కట్ చేస్తున్న ఏపీ సీఎం వైఎస్ జగన్

# క్రిస్మస్ వేడుకల్లో ఏపీ ముఖ్యమంత్రి

- కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక ప్రార్థనలు
- సందేశం వినిపించిన వైఎస్ విజయమ్మ



సీఎం వైఎస్ జగన్‌ను ముద్దాడుతున్న ఆయన తల్లి వైఎస్ విజయమ్మ

పులివెందుల/సాక్షి, అమరావతి

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం ఉదయం కుటుంబ సభ్యులతో కలిసి వైఎస్సార్ జిల్లా పులివెందుల సీఎస్ఐ చర్చిలో నిర్వహించిన క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్నారు. పాస్టర్ బెనహర్‌బాబు ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు. అనంతరం క్రిస్మస్ ఆరాధనలో పాల్గొన్నారు. సీఎస్ఐ చర్చికి సంబంధించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. వైఎస్ విజయమ్మ క్రిస్మస్ సందేశాన్ని వినిపించారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, వైఎస్ విజయమ్మలతో పాటు ఇతర కుటుంబ సభ్యులు క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దివంగత వైఎస్ జార్జిరెడ్డి సతీమణి వైఎస్ భారతమ్మ, వైఎస్ జగన్ సతీమణి వైఎస్ భారతీరెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, జార్జిరెడ్డి కుమారులు అనిల్‌రెడ్డి, సునీల్‌రెడ్డి.. వైఎస్ ప్రకాష్‌రెడ్డి, వైఎస్ భాస్కర్‌రెడ్డి, వైఎస్ ప్రతాప్‌రెడ్డి, వైఎస్ మనోహర్‌రెడ్డి, వైఎస్ జోసఫ్‌రెడ్డి, వైఎస్ మధురెడ్డి, డాక్టర్ ఈసీ గంగిరెడ్డి, ఎన్.శివప్రకాష్‌రెడ్డి, మంత్రులు ఆదిమూలపు సురేష్, అవంతి శ్రీనివాస్, అంజాద్ బాషా, ఆళ్ల నాని, కడప, రాజంపేట పార్లమెంటరీ అధ్యక్షులు సురేష్‌బాబు, అమరనాథరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# 4,100 మందికి లబ్ధి

### పదవీ విరమణ పెంపుతో ఆర్టీసీపై రూ.450 కోట్ల అదనపు భారం

**సాక్షి, హైదరాబాద్:** ఆర్టీసీలో పదవీ విరమణ వయసు 60 ఏళ్లకు పెంచటం వల్ల 4,100 మందికి లబ్ధి జరగనుంది. దీని ప్రభావంతో ఆర్టీసీపై జీతాల రూపంలో దాదాపు రూ.450 కోట్ల అదనపు భారం పడుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నెలలో రిటైర్ కావాల్సిన వారికి వచ్చే రెండేళ్ల పాటు గరిష్టస్థాయి వేతనం చెల్లించాల్సి రావడంతో కార్పొరేషన్‌పై భారీ భారాన్నే మోపనుంది. ప్రస్తుతం ఆర్టీసీ ఆర్థిక పరిస్థితి ఏమాత్రం అనుకూలంగా లేదు. పైగా పదవీ విరమణ చేసే వారికి చెల్లించాల్సిన బెనిఫిట్స్ మొత్తం దాదాపు రూ.900 కోట్ల వరకు ఉంటుంది. అంతమొత్తం భరించే పరిస్థితి లేనందున, దానికంటే ఈ వేతనం అదనపు మొత్తాన్ని భరించటమే కొంతమేర అనుకూలంగా ఉంటుందని పేర్కొంటున్నారు. ఇటీవల బస్సు చార్జీలు పెంచినందున రోజువారీ ఆదాయంలో దాదాపు రూ.1.8 కోట్ల పెరుగుదల కనిపిస్తోంది. ఫలితంగా ఆర్థిక పరిస్థితి మెరుగై, రెండేళ్ల తర్వాత రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించటం పెద్ద ఇబ్బంది కాకపోవచ్చని చెబుతున్నారు. ఇప్పటికే పదవీ విరమణ పొందిన వారికి చెల్లించాల్సిన మొత్తంలో దాదాపు రూ.100 కోట్ల వరకు బకాయి ఉండటం విశేషం.

**రెండేళ్ల వరకు నియామకాలుండవ్**

పదవీ విరమణ వయసు పెంపుతో వచ్చే రెండేళ్లలో రిటైర్‌మెంట్స్ ఉండవు. మరోవైపు 1,334 అద్దె బస్సులు రావటంతో డ్రైవర్ల అవసరం తగ్గనుంది. ఫలితంగా వచ్చే కొన్నేళ్ల వరకు కొత్త నియామకాల అవసరమే ఉండదు. దీంతో ఆర్టీసీలో వృద్ధుల సంఖ్య పెరిగి యువకుల సంఖ్య పడిపోనుంది. ఇది దుష్ఫలితాలు చూపుతుందన్న భావన వ్యక్తమవుతోంది. రెండేళ్ల వయసు పొడగింపు వల్ల గరిష్ట వేతనం పొందేవారి సంఖ్య పెరుగుతుంది. వారు రిటైర్ అయితే.. వారికిచ్చే వేతనంతో అంతకు మూడు రెట్ల మంది కొత్తవారిని నియమించుకునే అవకాశం ఉందన్న విషయాన్ని కొందరు అధికారులు గుర్తు చేస్తున్నారు.

# సమ్మె కాలానికి వేతనాలిస్తాం

**ఆర్టీసీ ఉద్యోగులకు సీఎం కేసీఆర్ హామీ**

**సాక్షి, హైదరాబాద్:** ఆర్టీసీ సమ్మెలో పాల్గొన్న ఉద్యోగులందరికీ ఆ కాలానికి సంబంధించిన వేతనాలు ప్రభుత్వమే చెల్లిస్తుందని సీఎం కేసీఆర్ ప్రకటించారు. అక్టోబర్ 5న మొదలైన సమ్మె ఏకధాటిగా 52 రోజులపాటు కొనసాగింది. ఈ నేపథ్యంలో సమ్మె కాలానికి సంబంధించిన వేతనాలను కూడా చెల్లించనున్నట్టు గతంలో ఆర్టీసీ ఉద్యోగులతో నిర్వహించిన ఆత్మీయ సమావేశంలో సీఎం హామీ ఇచ్చారు. ఆ మేరకు ప్రభుత్వం ఆ మొత్తాన్ని చెల్లించేందుకు కట్టుబడి ఉందని బుధవారం నిర్వహించిన సమీక్షలో ఆయన స్పష్టంచేసినట్టు తెలిసింది. ఆ భారం ఆర్టీసీపై వేయకుండా ప్రభుత్వమే ఆ మొత్తాన్ని విడుదల చేస్తుందని సీఎం చెప్పినట్టు సమాచారం. దీంతో సమ్మెలో పాల్గొన్న ఉద్యోగులందరికీ వేతన బకాయిలు విడుదలకు మార్గం సుగమమైంది. ఈ నేపథ్యంలో బుధవారం పలు డిపోల్లో ఆర్టీసీ ఉద్యోగులు సీఎం కేసీఆర్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు.

# ఎన్పీఆర్ ఆపండి

▶ మొదటి పేజీ తరువాయి

ఓ చట్టం (సీఏఏ) రావడం దేశంలో ఇదే తొలిసారి'అని అసద్ తెలిపారు. 'ఈ నెల 27న నిజామాబాద్‌లో తలపెట్టిన బహిరంగ సభకు అన్ని పార్టీల నాయకులను ఆహ్వానించాలని సీఎం సూచించారు. రాష్ట్ర మంత్రులను ఈ సభకు పంపిస్తామని చెప్పారు. కాంగ్రెస్, సీపీఐ, సీపీఎంలను సభకు ఆహ్వానిస్తాం. టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని స్వయంగా ఆహ్వానిస్తానని' ఎంఐఎం అధినేత తెలిపారు.

**సందేహాలు వ్యక్తం చేసే అధికారం...**

'రాష్ట్రంలో 29 శాతం జనాభాకే పుట్టిన తేదీ సర్టిఫికెట్లున్నాయి. ఎన్పీఆర్‌లో పుట్టిన తేదీ సర్టిఫికెట్ అడుగుతున్నారు. మిగిలిన వారు ఎక్కడి నుంచి తేవాలి?. ఎవరి పౌరసత్వంపై అయినా సందేహాలు వెల్లబుచ్చే అధికారాన్ని కింది స్థాయి అధికారులకు చట్టం కట్టబెట్టింది. ఎవరిదైనా పౌరసత్వానికి ఎవరైనా అభ్యంతరాలు తెలపవచ్చు. ఈ పరిస్థితుల్లో ఈ సందేహాలు, అభ్యంతరాలకు ప్రమాణాలు ఏమిటి? పౌరుడిని ఎవరు నిర్ణయిస్తారు?. తల్లిదండ్రులు ఎక్కడ పుట్టారో అడుగుతున్నారు. ఆధార్ అడుగుతున్నారు. దేశంలోని వంద కోట్ల ప్రజలు లైన్లలో నిలబడాల్సి వస్తుంది. అస్సాంలో 5.4 లక్షల బెంగాలీ హిందువులకు పౌరసత్వం ఇచ్చి 5 లక్షల బెంగాలీ ముస్లింలకు ఎందుకు ఇవ్వరు?. 1948 చట్టం ప్రకారమే జనగణన జరగాలి' అని స్పష్టం చేశారు.

**ఇవిగో ఆధారాలు...**

'ఎన్ఆర్‌సీకి ఎన్పీఆర్ తొలి అడుగు అని కేంద్ర హోంశాఖ వార్షిక నివేదిక 2018–19లోని చాప్టర్ 15(4) పేర్కొంది. ఇదే విషయాన్ని 2014 నవంబర్ 26న అప్పటి కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి కిరణ్ రిజిజు స్వయంగా పార్లమెంట్‌లో ప్రకటించారు. అదే రోజు ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) పత్రికా ప్రకటనలో దీనిని తెలియజేసింది. కేంద్ర హోంశాఖ వెబ్‌సైట్‌లోని సివిల్ రిజిస్ట్రేషన్ డివిజన్‌కు సంబంధించిన రెండో పేజీలో ఈ విషయం స్పష్టంగా రాసి ఉంది. ఇన్ని రుజువులున్నా ఎన్ఆర్‌సీ, ఎన్పీఆర్‌కి సంబంధం లేదని కేంద్ర హోంమంత్రి తప్పుదోవపట్టిస్తున్నారు' అని అసద్ వివరించారు. సీఎంను కలసిన వారిలో ఎంఐఎం నేత అక్బరుద్దీన్ ఒవైసీ, ఆర్థికవేత్త అమీరుల్లాఖాన్, సినీ నిర్మాత ఇలాహీ, ముస్లిం పర్సనల్ లా బోర్డు మహిళా విభాగం అధ్యక్షురాలు డాక్టర్ అస్మా తదితరులున్నారు.



ప్రగతి భవన్‌లో సీఎం కేసీఆర్‌తో భేటీ అయిన ముస్లింల ఐక్య కార్యాచరణ సమితి ప్రతినిధులు. చిత్రంలో ఒవైసీ, మహమూద్ అలీ

## క్లుప్తంగా...

### రానున్న మూడ్రోజులు పొడి వాతావరణం

**సాక్షి, హైదరాబాద్:** వచ్చే మూడ్రోజులు రాష్ట్రంలో పొడి వాతావరణం ఏర్పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. కోమోరిన్ ప్రాంతం నుంచి దక్షిణ తమిళనాడు వరకు ఉపరితల ద్రోణి కొనసాగుతోందని, మరోవైపు తూర్పు దిశ నుంచి గాలులు వీస్తున్నట్లు వాతావరణ కేంద్రం పేర్కొంది.

### సేవ్ నేషన్ ర్యాలీకి అనుమతివ్వండి

**డీజీపీ, సీపీలకు సీఎల్పీ నేత భట్టి లేఖ**

**సాక్షి, హైదరాబాద్:** భారత జాతీయ కాంగ్రెస్ సంస్థాపక దినోత్సవం సందర్భంగా శనివారం టీపీసీసీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో 'సేవ్ నేషన్–సేవ్ కాన్‌స్టిట్యూషన్'పేరిట నిర్వహించనున్న ర్యాలీకి అనుమతిని కోరుతూ డీజీపీ మహేందర్‌రెడ్డి, నగర కమిషనర్ అంజనీకుమార్‌లకు సీఎల్పీ నేత భట్టి విక్రమార్క లేఖ రాశారు. గాంధీ భవన్ నుంచి నాంపల్లి, నిజాం కళాశాల, బషీర్‌బాగ్ ఫ్లైఓవర్‌ల మీదుగా ట్యాంక్‌బండ్ వద్దనున్న డా.బీఆర్ అంబేడ్కర్ విగ్రహం వరకు ఈ ర్యాలీ సాగుతుందని భట్టి తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌తోపాటు పార్టీ సీనియర్ నేతలు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొంటున్నందున ఈ ర్యాలీకి అనుమతించాలని విజ్ఞప్తి చేశారు.

### నేడు సీపీఐ వ్యవస్థాపక వేడుకలు

**సాక్షి, హైదరాబాద్:** భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) 95వ వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా హిమాయత్ నగర్‌లోని ఏఐటీయూసీ కార్యాలయం సత్యనారాయణరెడ్డి భవన్ నుంచి పార్టీ కార్యాలయం మఖ్దూం భవన్ వరకు 95 ఎర్ర జెండాలతో ర్యాలీ తీయనున్నారు. కార్యక్రమంలో పార్టీ మాజీ ప్రధాన కార్యదర్శి సురవరం సుధాకర్‌రెడ్డి, జాతీయ కార్యదర్శి డా.కె.నారాయణ, రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి పాల్గొనున్నారు.

### నేడు రైతు సంఘం వర్క్‌షాప్

**సాక్షి, హైదరాబాద్:** రైతు సంఘం రాష్ట్ర వర్క్‌షాప్‌ను గురువారం నిర్వహించనున్నట్లు ఆ సంఘం తెలంగాణ అధ్యక్ష, కార్యదర్శులు పి.జంగారెడ్డి, టి.సాగర్ ఓ ప్రకటనలో తెలిపారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ వర్క్‌షాప్‌లో చర్చిస్తామని వారు పేర్కొన్నారు. ముఖ్యంగా నకిలీ విత్తనాలు, పాస్ పుస్తకాలు అందని రైతులు, కౌలు రైతులు, పంట నష్టపోతున్న రైతుల సమస్యలపై చర్చించి భవిష్యత్ కార్యాచరణ, ఉద్యమాలకు రూపకల్పన చేయనున్నట్లు చెప్పారు.

### నేడు ప్రభుత్వ విద్య విశ్వసనీయతపై సదస్సు

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర విద్యా సదస్సును గురువారం నిర్వహించనున్నట్లు పీఆర్‌టీయూ తెలంగాణ అధ్యక్షుడు అంజిరెడ్డి ఓ ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ విద్య–విశ్వసనీయతపై జరిగే ఈ సమావేశం.. హైదరాబాద్‌లోని ఇందిరా ప్రియదర్శిని ఆడిటోరియంలో ఉదయం 10 గంటలకు ప్రారంభమవుతుందని ఆయన పేర్కొన్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను పూర్తి చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి, హోంశాఖ మంత్రి మహమూద్ అలీ పాల్గొననున్నారని వివరించారు.

### 28న ఎస్‌ఎంసీలతో టెలీ కాన్ఫరెన్స్

**సాక్షి, హైదరాబాద్:** స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీలతో (ఎస్‌ఎంసీ) ఈ నెల 28న టీ–సాట్ ద్వారా టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు పాఠశాల విద్యా కమిషనర్ విజయ్ కుమార్ తెలిపారు. రాష్ట్రంలోని అన్ని స్కూల్ కాంప్లెక్స్‌ల పరిధిలోని ఎస్‌ఎంసీలు స్కూల్ కాంప్లెక్స్‌లకు చేరుకోవాలని సూచించారు. ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు ఈ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. కొత్తగా ఎన్నికైన ఎస్‌ఎంసీ కమిటీ చైర్మన్లు, సభ్యులకు ఉండే అధికారాలు, విధులను టెలీ కాన్ఫరెన్స్ ద్వారా వివరించనున్నారు.

### బీజేపీ కార్యాలయంలో వాజ్‌పేయి జయంతి

**సాక్షి, హైదరాబాద్:** భారతరత్న, మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి జయంతి కార్యక్రమాన్ని బుధవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ నేతలు వాజ్‌పేయి చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పించారు. సుపరిపాలన దినోత్సవం సందర్భంగా కార్యకర్తలు, నాయకులు దేశం కోసం జాతీయవాదంతో ముందుకు వెళతామని ప్రతిజ్ఞ చేశారు. అనంతరం రక్తదాన శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో బీజేపీ మహిళా మోర్చ అధ్యక్షురాలు ఆకుల విజయ, మాజీ ఎమ్మెల్సీ పొంగులేటి సుధాకర్‌రెడ్డి, మాజీ మంత్రి అమర్‌సింగ్, బీజేపీ నేతలు ఛాయాదేవి, అరుణజ్యోతి, సుధాకర్‌శర్మ తదితరులు పాల్గొన్నారు.



హైదరాబాద్‌లో జరిగిన సార్వజనిక సమ్మేళనంలో వేదికపై ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ మోహన్ భాగవత్, మోహన్‌రెడ్డి తదితరులు



# అందరిలో కలుస్తాం..

▶ మొదటి పేజీ తరువాయి

నిర్వహించిన సార్వజనీన సమ్మేళనంలో ఆయన స్వయం సేవకులను ఉద్దేశించి ప్రసంగించారు. ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాలను స్పృశిస్తూ సంఘ్ మూల సూత్రాన్ని వివరిస్తూ వారికి దిశానిర్దేశం చేశారు. దేశభక్తి, సంస్కృతి, సంప్రదాయాల పరిరక్షణ, వ్యక్తిగత క్రమశిక్షణ, నైతిక విలువలు, విద్య, శాఖల విస్తరణే లక్ష్యంగా పాతికేళ్ల తర్వాత ఆర్‌ఎస్‌ఎస్ ఈ సభ నిర్వహించింది. ఈ సభకు పద్మశ్రీ బీవీఆర్ మోహన్‌రెడ్డి, వివిధ శాఖల ముఖ్య ప్రచారక్‌లు దక్షిణామూర్తి, రామకృష్ణారావు, సుందరయ్య, పానగిరి సుబ్బారెడ్డి, కృష్ణప్రసాద్, మంగేశ్, సుహాసన్‌రావు, తిప్పే స్వామిజీ, సుధీర్‌జీ, శ్యామ్‌ప్రసాద్, సీఆర్ ముకుంద్‌జీలు హాజరయ్యారు.

**మనసు నిండా భరతమాతే..**

తన కంటే సమాజమే ముఖ్యమని, దాన్ని ప్రగతి పథంలో ఉండాలని కోరుకునే వారి అవసరం ఇప్పుడు ఉందని మోహన్ భాగవత్ పేర్కొన్నారు. స్వాభిమానంతో సంఘటితంగా ప్రపంచానికి ఆదర్శంగా ఉండే హిందూ సమాజాన్ని నిర్మించటమే సంఘ్ ధ్యేయమని స్పష్టం చేశారు. ఈ పయనంలో సత్ఫలితం సాధించినప్పుడే ఆర్‌ఎస్‌ఎస్ విజయం సాధించినట్టని చెప్పారు. 'ఈ భూమి నాది.. దాని శ్రేయస్సే నా శ్రేయస్సు అన్న భావనతో.. ఎలాంటి భేదభావం లేకుండా సమస్త ప్రజలు నావాళ్లు అన్న అభిప్రాయంతో.. భరతమాతనే ఆరాధ్య దైవంగా భావించే వారు హిందువులు'అని తేల్చిచెప్పారు. చిన్నారులు, యువత, మహిళలు, పురుషులు ఎవరినైనా ఆదర్శంగా తీర్చిదిద్దటమే తమ ముందున్న కర్తవ్యమని పేర్కొన్నారు. నిత్యం ఓ గంట పాటు సంఘ్ కార్యకలాపాల్లో ఉండటమే కాకుండా వ్యక్తిగత జీవితాన్ని సమాజం కోసం అర్పిస్తూ స్వయం సేవకులు ముందుకు సాగుతున్నారని కితాబిచ్చారు. దేవీదేవతల పూజలు పక్కన పెట్టి కేవలం భరతమాత ఆరాధనతో మాతృభూమి కోసం పనిచేస్తేనే మన దేశం విశ్వగురువు స్థానంలో నిలుస్తుందన్న వివేకానంద మాటలను తు.చ. తప్పకుండా పాటించేందుకు, ఆ మార్గంలో తాము పయనిస్తున్నామని స్పష్టం చేశారు. హిందూ, ముస్లింలు కీచులాడుకుని నాశనమవుతారని దేశం విడిచి వెళ్లేటప్పుడు ఆంగ్లేయులు భావించారని, కానీ అలా ఎన్నటికీ జరగదని, ఎన్ని భేదాభిప్రాయాలున్నా ఏకత్వం వైపు సాగే ఉపాయాన్ని కనిపెడతారని ఆ ఉపాయం పేరే హిందుత్వమని రవీంద్రనాథ్ ఠాగూర్ అన్న మాటలను గుర్తుచేశారు. భారత్‌ను గొప్ప దేశంగా తీర్చిదిద్దటం ఏ రాజకీయ శక్తి వల్లో.. మరే శక్తి వల్లో సాధ్యం కాదని పేర్కొన్నారు. సమాజాన్ని ఏకత వైపు నడిపించేలా చేసినప్పుడే సాధ్యమని అభిప్రాయపడ్డారు.

**ఆ శక్తులకు చోటులేదు**

సమాజంలో తామే సర్వం అనుకుంటూ ఇతరులను హింసిస్తూ, అప్పుడప్పుడూ తాము కష్టపడుతూ, తోటివారిని కష్టపెడుతూ సాధించే రాక్షస విజయాలు అవసరం లేదని పేర్కొన్నారు. అన్నీ తమకే కావాలంటూ ఇతరులను కష్టపెడుతూ తమ విజయం కోసం విధ్వంసాలకు తెగించే వారి ధన విజయాలూ తమకొద్దని, ఈ రెండు శక్తులకు హిందూధర్మంలో చోటు లేదని పేర్కొన్నారు. తమ కోసం కాకుండా ఇతరుల సౌఖ్యం కోసం పనిచేసే వారు సాధించే ధర్మ విజయాలు తమకు ముఖ్యమని, అలాంటి విజయాల కోసమే ఆర్‌ఎస్‌ఎస్ కష్టపడుతోందని స్పష్టం చేశారు. మనసులో తమోరజ గుణాల ప్రభావం ఉన్నా, ధర్మ భావంతో వాటిని జయిస్తున్నట్లు వెల్లడించారు. సమాజానికి ఈ లక్షణం చాలా అవసరమన్నారు.

**తల్లిదండ్రులు ఆదర్శంగా ఉండాలి: బీవీఆర్ మోహన్‌రెడ్డి**

విద్యతో పాటు నైతిక విలువలు, క్రమశిక్షణ, దేశభక్తి, సంస్కృతి, సంప్రదాయాలతో పాటు నిజాయితీ, క్షమాగుణం ఇలా అన్ని తన తల్లి వద్దే నేర్చుకున్నానని ప్రముఖ వ్యాపారవేత్త బీవీఆర్ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. విలువలు మాత్రమే మనిషిని విజయపథం వైపు నడిపిస్తాయని చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లలకు ఆదర్శంగా నిలవాలని, ఏది మంచో, ఏది చెడో తెలపాలని సూచించారు. మన ప్రవర్తనే మనల్ని ఉన్నతంగా తీర్చిదిద్దుతుందని వివరించారు. ప్రతి విద్యార్థి నిత్యం ఏదో ఒకటి చదవాలని, పరిస్థితిని బట్టి, అర్థం చేసుకుని, అందుకనుగుణంగా నడుచుకుంటేనే విజయం సిద్ధిస్తుందని చెప్పారు. ఆర్‌ఎస్‌ఎస్ ప్రపంచంలోనే పెద్ద ఎన్జీవో అని, సంస్కృతి సంప్రదాయాలను పరిరక్షించడంతో పాటు దేశ ప్రజల ఐక్యతను పెంపొందిస్తోందని పేర్కొన్నారు.

**రాజకీయాల ప్రస్తావనే లేకుండా..**

ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ వేల మంది సంఘ్ కార్యకర్తలను ఉద్దేశించి బహిరంగ సభలో మాట్లాడుతున్నారంటే ఏవో రాజకీయపరమైన ఘాటు విమర్శలు వస్తాయన్న ఊహాగానాలు ఉన్నాయి. జాతీయ జనాభా జాబితా, జాతీయ పౌరుల జాబితా లాంటి అంశాల చుట్టూ రాజకీయాలు నడుస్తున్న ప్రస్తుత తరుణంలో మోహన్ భాగవత్ మాట్లాడుతున్నారంటే దేశవ్యాప్తంగా రాజకీయ పార్టీలు ప్రత్యేక శ్రద్ధగా గమనించటం సహజం. కానీ వేలమందితో ఉన్న సభా వేదికమీదుగా దాదాపు అర గంట పాటు ప్రసంగించినా ఒక్కటంటే ఒక్క పదం కూడా రాజకీయ పార్టీలపై లేకపోవటం గమనార్హం. పరోక్షంగా కూడా ఏ పార్టీ వ్యవహారాన్ని ఎత్తిచూపకుండా కేవలం ఆర్‌ఎస్‌ఎస మూల సిద్ధాంతాలపైనే మాట్లాడటం విశేషం. సరిగ్గా ఆయన ప్రసంగ సమయానికే మత పెద్దల సమక్షంలో మజ్లిస్ అధినేత అసదుద్దీన్ ఒవైసీ.. ముఖ్యమంత్రి కేసీఆర్‌తో మంతనాలు జరిపారు. బహిరంగ సభలో పాల్గొన్న వారిలో ఈ అంశం ప్రస్తావన కూడా వినిపించింది. కానీ మోహన్ భాగవత్ మాత్రం ఆర్‌ఎస్‌ఎస్ సిద్ధాంతాలు తప్ప మరో అంశం జోలికే వెళ్లలేదు. ఆర్‌ఎస్‌ఎస్ పైన వచ్చే విమర్శలను కూడా రేఖా మాత్రంగా కూడా ప్రస్తావించకపోవడం విశేషం.

# కదం కదం కదుపుతూ..!

**స్వయం సేవకుల భారీ కవాతు.. ● 7,705 మంది కార్యకర్తల ప్రదర్శనలు**

**సాక్షి, హైదరాబాద్/మీర్‌పేట:** తెలుపు.. ఖాకీ రంగు దుస్తులు.. చేతిలో లాఠీలతో స్వయం సేవకులు భారీ కవాతు నిర్వహించారు. ఆర్‌ఎస్‌ఎస్, బీజేపీ, కిసాన్ సంఘ్, ఏబీవీలకు చెందిన 7705 మంది స్వయం సేవకులు హస్తినాపూర్, వనస్థలిపురం, సరూర్‌నగర్, ఇబ్రహీంపట్నం ప్రధాన రహదారులపై కవాతు నిర్వహిస్తూ సాయంత్రం 4 గంటలకు ఎల్బీనగర్ చేరుకున్నారు. అటు నుంచి 5 గంటలకు సభాస్థలికి చేరుకున్నారు. ఈ సభకు తెలంగాణ జిల్లాల నుంచి స్వయం సేవకులతో పాటు పార్టీ కార్యకర్తలు భారీగా హాజరుకావడంతో సభాస్థలి కిక్కిరిసిపోయింది. స్వయం సేవకులు ప్రదర్శించిన దండవ్యాయామం, వీరవజ్రాసనం, ఉపనిష్ఠ వ్యాయామాలు సభలో హైలెట్‌గా నిలిచాయి. వేదికకు ఇరువైపులా ఏర్పాటు చేసిన స్వామి వివేకానంద, ఝాన్సీలక్ష్మీభాయ్, బీఆర్ అంబేద్కర్‌ల భారీ కటౌట్‌లు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి.

**సంఘ్‌సేవకులతో మోహన్..**

**ఇబ్రహీంపట్నం రూరల్:** సమాజం సంఘటితానికి సంఘ్ కార్యకర్తలు పనిచేయాలని ఆర్‌ఎస్‌ఎస్ సర్ సంఘ్‌చాలక్ మోహన్ భాగవత్ స్వయం సేవకులకు సూచించారు. ఆదిభట్ల మున్సిపాలిటీ పరిధిలోని మంగళ్‌పల్లి భారత్ ఇంజనీరింగ్ కాలేజీలో మంగళవారం ప్రారంభమైన ఆర్‌ఎస్‌ఎస్ శిక్షణ శిబిరం బుధవారం మధ్యాహ్నం వరకు జరిగింది. మంగళవారం రాత్రి శిబిరానికి చేరుకున్న ఆర్‌ఎస్‌ఎస్ చీఫ్ భారత్ కాలేజీలోనే బస చేశారు. ఉదయం 4 గంటలకు సాధారణ కార్యకర్తలతో పాటే కరసేవ చేశారు. ఉదయం 8 గంటల నుంచి 9.30 గంటల వరకు శిబిరంలో 2 వేల మంది కార్యకర్తలతో సమావేశమయ్యారు. 10 గంటల నుంచి 11.30 గంటల వరకు యాదాద్రి శిబిరంలో మరో 2 వేల మంది సంఘ్ సేవకులతో మాట్లాడారు. అనంతరం మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో సాధారణ కార్యకర్తలతో భాగ్యలక్ష్మినగర్ శిబిరంలో భోజనం చేశారు. సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలోని సభకు మంగళ్‌పల్లి శిబిరం నుంచి 196 బస్సుల్లో కార్యకర్తలు తరలిపోయారు. భారత్ కళాశాల నుంచి మోహన్ భాగవత్ 2.45 గంటలకు బయల్దేరారు. బుల్లెట్ ప్రూఫ్ వాహనాలు, బ్లాక్ క్యాట్ కమాండోలతో పటిష్టమైన బందోబస్తు మధ్య సరూర్‌నగర్ స్టేడియానికి వెళ్లారు.



సమ్మేళనంలో పాల్గొన్న విజయరామారావు, పెద్దిరెడ్డి, మురళీధర్‌రావు, లక్ష్మణ్, చింతల రామచంద్రారెడ్డి తదితరులు



సమ్మేళనంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, రాంమాధవ్, డీకే అరుణ తదితరులు

# ఇద్దరికి మించి సంతానమున్నా..

**మున్సిపల్ ఎన్నికల్లో పోటీకి అర్హులే ● పురపోరు నేపథ్యంలో స్పష్టతనిచ్చిన ఎస్ఈసీ**

**సాక్షి, హైదరాబాద్:** వచ్చేనెలలో జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో ఇద్దరికి మించి సంతానమున్న వారు వార్డులు/డివిజన్లలో పోటీచేసేందుకు అర్హులే. ఈ మేరకు కొత్త పురచట్టంలోనూ అవసరమైన మేర మార్పులు చేశారు. ఈ చట్టాన్ని ఇదివరకే శాసన సభ/ శాసనమండలి ఆమోదించింది. తాజాగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ కూడా స్పష్టతనిచ్చింది. ఇద్దరికి మించి పిల్లలుంటే మున్సిపల్ ఎన్నికల్లో పోటీకి అనర్హులనే నిబంధనను ఎత్తేయడంతో అభ్యర్థుల పోటీ విషయంలో ఈసారి కొత్త చట్టానికి అనుగుణంగా పలు మార్పులు చోటుచేసుకోనున్నాయి.

**చెవిటి, మూగ వారికి పోటీకి అవకాశం...**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల నిర్వహణ, నిబంధనలు, ఏర్పాట్లకు సంబంధించి కొత్త మున్సిపల్ చట్టంలోని వివిధ సెక్షన్లు, కాలమ్‌ల వారీగా సరిచూసుకోవాలని ఎన్నికల విధులు నిర్వహించే అధికారులకు ఎస్ఈసీ సూచించింది. మున్సిపాలిటీల చట్టం, మున్సిపల్ కార్పొరేషన్ చట్టం, జీహెచ్‌ఎంసీ చట్టంలోని వివిధ అంశాలకు సంబంధించి పోటీచేసే అభ్యర్థులు, రిటర్నింగ్ అధికారులు, ప్రిసైడింగ్ ఆఫీసర్లకు చట్టబద్ధమైన అంశాలపై స్పష్టతనిస్తూ మెటీరియల్‌ను రూపొందించింది. చెవిటి, మూగ లేదా కుష్టువ్యాధితో బాధపడుతుంటే అటువంటి వారు గతంలో పోటీకి అనర్హులుగా ఉండగా కొత్తచట్టంలో ఆ నిబంధనను తొలగించారు. అదేవిధంగా అవినీతి పద్ధతులు లేదా ఎన్నికల అక్రమాల కారణంగా (9ఏ చాప్టర్ ప్రకారం) శిక్షపడిన వారికి గతంలో పోటీకి అర్హత లేకపోగా, కొత్తచట్టంలో దానిని తొలగించారు. ఈ విషయాన్ని మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్, ఎన్నికల అధికారులు, జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు (జీహెచ్‌ఎంసీ మినహా), అన్ని మున్సిపాలిటీలు, కార్పొరేషన్ల కమిషనర్లు, కార్పొరేషన్ల ఆర్‌వోలు, పీవోలకు ఇదివరకే ఒక నోటిఫికేషన్ ద్వారా ఎస్ఈసీ తెలియజేసింది.

**విద్యాసంస్థల మైదానాలు ఉపయోగించొద్దు...**

మున్సిపల్ ఎన్నికల్లో పోటీచేసే రాజకీయ పార్టీలు, అభ్యర్థులు తమ ఎన్నికల ప్రచారం, ర్యాలీల నిర్వహణకు ఇకపై విద్యాసంస్థలు (ప్రభుత్వ, ఎయిడెడ్, ప్రైవేట్ ఏవైనా), వాటి మైదానాలు ఉపయోగించే వీలు లేదు. ఎన్నికల ప్రవర్తనా నియమావళిని ఉల్లంఘించి ప్రచార సమయంలో ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాల గోడలపై పోస్టర్లు అంటించడం, ప్రకటనలు రాయడం, ఇతర చర్యలతో వికారంగా మారుస్తున్న నేపథ్యంలో ఈ ఆస్తుల యజమానులకు కలుగుతున్న నష్టం, ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని ఎస్ఈసీ కొన్ని అంశాల్లో మార్పులకు శ్రీకారం చుట్టింది. 'ప్రివెన్షన్ ఆఫ్ డిస్ ఫిగర్మెంట్ ఆఫ్ ఓపెన్‌ప్లేసెస్, ప్రొహిబిషన్ ఆఫ్ అబ్సీన్, అబ్జెక్షనబుల్ పోస్టర్స్, అడ్వర్టయిజ్‌మెంట్ యాక్ట్, 1997 (యాక్ట్ 28 ఆఫ్ 1997)ను గతంలోనే ఉమ్మడి రాష్ట్రంలోని శాసనసభ ఆమోదించింది. దీని ప్రకారం ప్రభుత్వ, ప్రైవేట్ స్థలాన్ని పాడుచేస్తే దానిని నేరంగా పరిగణించడంతో పాటు మూడునెలల కారాగార శిక్ష లేదా రూ. వెయ్యికి తగ్గకుండా జరిమానా విధించవచ్చు. లేదా ఈ జరిమానాను రూ.2వేలకు పెంచడంతో పాటు రెండుశిక్షలు వి.దించవచ్చు. ఈచట్టంలోని సెక్షన్ల ప్రకారం అభ్యంతరకరమైన ప్రచార ప్రకటనలను తొలగించే అధికారం పోలీసులకు కల్పించారు. కాగా గోడలమీద పోస్టర్లు, కాగితాలు అంటించడంలేదా మరోరూపంలోనైనా పాడుచేయడం, కటౌట్లు, హోర్డింగ్‌లు, బ్యానర్లు, జెండాలు, మొదలైనవాటిని ప్రభుత్వ స్థలాల్లో (ప్రజల ఆస్తులతోసహా) అనుమతించరు.

# వీసీ పోస్టులకు మరోసారి దరఖాస్తులు!

- దరఖాస్తు చేసుకున్న వారిలో 42 మందికి లేని అర్హతలు
- మళ్లీ దరఖాస్తుల స్వీకరణకు చర్యలు
- పాతవాటితోపాటు పరిగణనలోకి కొత్త దరఖాస్తులు

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్రంలోని యూనివర్సిటీల వైస్ చాన్సలర్(వీసీ) పోస్టుల భర్తీకి మరోసారి దరఖాస్తులను స్వీకరించే అవకాశం ఉంది. దీనికి సంబంధించిన కార్యాచరణపై ప్రభుత్వం దృష్టి సారించినట్లు తెలిసింది. రాష్ట్రంలోని 9 వర్సిటీల వీసీ పోస్టుల భర్తీకి ప్రభుత్వం గత సెప్టెంబర్‌లో దరఖాస్తులను ఆహ్వానించగా.. 984 దరఖాస్తులు వచ్చాయి. 273 మంది ప్రొఫెసర్లు ఈ దరఖాస్తులను అందజేశారు. వారిలో కొందరు ఒక్కొక్కరు మూడ్నాలుగు వర్సిటీల వీసీ పోస్టుల కోసం దరఖాస్తు చేసుకోవడంతో దరఖాస్తుల సంఖ్య పెరిగింది. అయితే అప్పుడు దరఖాస్తు చేసుకున్న వారిలో 42 మందికి నిర్ణీత అర్హతలు లేవని తెలిసింది. వీసీ పోస్టుకు దరఖాస్తు చేసుకోవాలంటే ప్రొఫెసర్‌గా పదేళ్లు పనిచేసి ఉండాలన్న ప్రధాన నిబంధన ఉంది. ఈ నిబంధన ప్రకారం 42 మంది అనర్హులు అవుతున్నట్లు తేలింది. వారిలో కొంత మందికి పదేళ్లకు 10 రోజులు తక్కువగా ఉండటం, మరికొంత మందికి నెల రోజులు తక్కువగా ఉండటం, ఇంకొంతమందికి 2 నెలలు తక్కువగా ఉన్నట్లు తెలిసింది. ఆ దరఖాస్తులను సెప్టెంబర్‌లో నోటిఫికేషన్ జారీ చేసి స్వీకరించినందున అప్పటికి వారికి ఆ అర్హతలు లేవు. అయితే ఇప్పుడు 3 నెలలు గడిచింది. ఇప్పుడు దరఖాస్తులను స్వీకరిస్తే వారికి అర్హత వస్తుంది. ఈ నేపథ్యంలో వారి కోసం మరోసారి దరఖాస్తులు స్వీకరించాలని ఉన్నత విద్యాశాఖ కసరత్తు చేస్తున్నట్లు తెలిసింది. ఇప్పటికే తీసుకున్న దరఖాస్తులతోపాటు కొత్తగా తీసుకునే దరఖాస్తులు అన్నింటిని పరిగణనలోకి తీసుకొని ముందుకు సాగాలన్న ఆలోచనకు వచ్చినట్లు తెలిసింది.

**సర్చ్ కమిటీల సమావేశాలు వాయిదా?**

గతంలోనే దరఖాస్తులను స్వీకరించినందున ప్రభుత్వం సర్చ్ కమిటీలను కూడా నియమించింది. అయితే కమిటీలు సమావేశమై ఒక్కో వర్సిటీ వీసీ పోస్టుకు ముగ్గురి పేర్లను ప్రతిపాదించాల్సి ఉంది. గత నెలలోనే సర్చ్ కమిటీల సమావేశాలు ఉంటాయని భావించినా జరగలేదు. మరోవైపు సర్చ్ కమిటీల్లో వర్సిటీ నామినీగా నియమించిన వారి నియామకం చెల్లదని, వర్సిటీల పూర్తిస్థాయి ఎగ్జిక్యూటీవ్ కౌన్సిళ్లు (ఈసీ) లేకుండా నామినీల నియామకం కుదరదన్న వాదనలు ఉన్నాయి. అందువల్లే సర్చ్ కమిటీల సమావేశాలు ఆలస్యమవుతున్నాయని, యూనివర్సిటీలకు పూర్తిస్థాయి ఈసీలు నియమించాకే వర్సిటీల నామినీలను తీసుకోవాలని ఉన్నత విద్యాశాఖ భావిస్తున్నట్లు తెలిసింది. మరోవైపు మొదట స్వీకరించిన దరఖాస్తుల ప్రకారం 42 మంది అనర్హులు అవుతున్నందున, వారికి అవకాశం కల్పించేందుకు మళ్లీ పాత నోటిఫికేషన్‌కు కొనసాగింపు నోటిఫికేషన్ ఇచ్చి దరఖాస్తులను స్వీకరించాలని భావిస్తున్నట్లు తెలిసింది. దీంతో అప్పటివరకు సర్చ్ కమిటీల సమావేశాలు వాయిదా తప్పేలా లేదు.

**'అంబేడ్కర్ వర్సిటీ వీసీ'కి భారీ డిమాండ్..**

నిధులు ఎక్కువగా ఉండి, పని, వివాదాలు తక్కువగా ఉండే బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ వీసీ పోస్టుకు భారీ డిమాండ్ ఉంది. ఇతర యూనివర్సిటీల వీసీ పోస్టు కంటే అంబేడ్కర్ వర్సిటీ వీసీ పోస్టు కోసం అత్యధికంగా 142 మంది దరఖాస్తు చేసుకున్నారు. అన్నింటికంటే తక్కువ దరఖాస్తులు తెలుగు వర్సిటీ వీసీ పోస్టుకు వచ్చాయి. వీసీ పోస్టు కోసం దరఖాస్తు చేసుకున్న వారిలో కొంతమంది ఎన్ఐటీ ప్రొఫెసర్లు ఉండగా, 54 మంది అయితే తమకు ఏ యూనివర్సిటీ పోస్టు అయినా ఫర్వాలేదని పేర్కొంటూ దరఖాస్తు చేసుకున్నారు.

**వర్సిటీల వారీగా దరఖాస్తులు..**

| యూనివర్సిటీ | దరఖాస్తుల సంఖ్య |
|---|---|
| ఉస్మానియా | 114 |
| కాకతీయ | 110 |
| తెలంగాణ | 114 |
| శాతవాహన | 125 |
| పాలమూరు | 122 |
| మహాత్మాగాంధీ | 124 |
| జేఎన్టీయూ | 56 |
| తెలుగు వర్సిటీ | 23 |
| అంబేడ్కర్ వర్సిటీ | 142 |
| ఏదైనా ఓకే | 54 |
| మొత్తం | 984 |

## గుడ్ గవర్నెన్స్ ఇండెక్స్‌లో 11వ స్థానంలో తెలంగాణ

**సాక్షి, న్యూఢిల్లీ:** కేంద్ర ప్రభుత్వం ఆవిష్కరించిన గుడ్ గవర్నెన్స్ ఇండెక్స్‌లో పెద్ద రాష్ట్రాల కేటగిరీలో ఆంధ్రప్రదేశ్ అయిదో స్థానంలో నిలవగా.. తెలంగాణ 11వ స్థానంలో నిలిచింది. ఈ ఇండెక్స్‌ను బుధవారం ఢిల్లీలో కేంద్ర సిబ్బంది, ప్రజా నివేదనల శాఖ మంత్రి డాక్టర్ జితేంద్రసింగ్ విడుదల చేశారు. వ్యవసాయం–అనుబంధ రంగాలు, వాణిజ్యం–పరిశ్రమలు, మానవ వనరుల అభివృద్ధి, ప్రజారోగ్యం, మౌలిక వసతులు, ఎకనామిక్ గవర్నెన్స్, సాంఘిక సంక్షేమం–అభివృద్ధి, జ్యుడీషియల్ మరియు ప్రజా భద్రత, పర్యావరణం, పౌర సేవల లక్షిత పాలన తదితర 10 రంగాలకు సంబంధించి పనితీరును మదింపు చేసి ఈ ర్యాంకులు కేటాయించారు. 18 పెద్ద రాష్ట్రాలు, 11 ఈశాన్య, పర్వత ప్రాంత రాష్ట్రాలు, 7 కేంద్ర పాలిత ప్రాంతాలు.. ఇలా మూడు కేటగిరీల్లో పనితీరును మదింపు చేశారు. అలాగే 10 రంగాలకు రంగాల వారీగా ర్యాంకులు ఇచ్చారు. చివరగా అన్ని రంగాలు కలిపి సమ్మిళిత ర్యాంకు కేటాయించారు. వాణిజ్యం, పరిశ్రమల రంగంలో ఏపీ రెండో స్థానంలో, తెలంగాణ మూడో స్థానంలో నిలిచింది. అలాగే సాంఘిక సంక్షేమం–అభివృద్ధి రంగంలో ఏపీ మూడో స్థానంలో నిలిచింది. ఇక పర్యావరణంలో మాత్రం తెలంగాణ 16, ఏపీ 17వ స్థానంలో నిలిచాయి.

## ఎకో డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌తో మేలు: సీఎస్

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణలో ఎకో డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఏర్పాటు ద్వారా రాష్ట్రంలోని అర్బన్, ఎకో పార్కులను మరింతగా అభివృద్ధి చేసే అవకాశాలున్నాయని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషి అభిప్రాయపడ్డారు. ఈ కార్పొరేషన్ ద్వారా కాసు బ్రహ్మానందరెడ్డి జాతీయ వనం స్థాయిలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎకో పార్కుల అభివృద్ధికి, మెరుగైన నిర్వహణకు అవకాశం ఉంటుందన్నారు. బుధవారం ఉదయం తన సతీమణి అనురాధా జోషితో కలసి కేబీఆర్ పార్కును సందర్శించిన ఆయన.. పార్కు నిర్వహణకు అటవీ శాఖ చేస్తున్న కృషిని ప్రశంసించారు. తాను కొన్ని దశాబ్దాలుగా ఈ పార్కుకు వస్తున్నానని, గతంలో ఈ ప్రాంతం ఒక బంజరు నేలగా ఉండేదని ఇప్పుడది అద్భుతమైన పచ్చదనంతో కళకళలాడుతోందన్నారు. వాచ్ టవర్ సమీపంలోని ప్లాంటింగ్ రాతి బండ మధ్య జువ్వి మొక్కను నాటి ఇక్కడ ఇది కూడా చక్కగా పెరుగుతుందన్నారు. పార్క్ విజిటర్ జోన్‌లో ఉన్న ఈఈసీ సెంటర్, ఓపెన్ క్లాస్ జిమ్, యోగా షెడ్, నేచర్ క్యాంపు వివరాలను సీఎస్ అడిగి తెలుసుకున్నారు. సీఎస్‌కు పీసీసీఎఫ్ ఆర్.శోభ, అడిషనల్ పీసీసీఎఫ్ చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా అటవీ అధికారి పి.వెంకటేశ్వర్లు, నీటి పారుదల శాఖ ఈఎన్‌సీ మురళీధర్ స్వాగతం పలికారు.


**IN THE HIGH COURT OF JUDICATURE AT MADRAS**
**(ORIGINAL JURISDICTION)**

**In the matter of Companies Act, 1956**
**And**
**In the matter of M/s Maxworth Orchards (India) Ltd**
**(in Provisional Liquidation)**

**Company Petition No. 57/1998**

**Company Application No. 171 to 174 of 2019**

**ప్రజలకు హెచ్చరిక ప్రకటన**

గౌరవనీయ ఉన్నత న్యాయస్థానం, మద్రాస్ యొక్క CP No. 57 ఆఫ్ 1998 లోని **CA No. 884 నుండి 886 ఆఫ్ 2008లో** 17–9–2010 తేదీ గల ఉత్తర్వు ప్రకారం పైన తెలిపిన పేరుగల కంపెనీ **మూసివేయాలని ఆదేశించింది** ఈ ఉన్నత న్యాయస్థానమునకు అఫీషియల్ లిక్విడేటర్‌ని **ప్రొవిజినల్** లిక్విడేటర్‌గా నియమించడం జరిగింది మరియు శ్రీ కె. అలగిరిస్వామి, మద్రాస్ ఉన్నత న్యాయస్థానం సీనియర్ అడ్వకేట్‌ను సదరు కంపెనీ కోసం అడ్మినిస్ట్రేటర్‌గా నియమించడం జరిగింది. C.A. No. 171 నుండి 174 ఆఫ్ 2019లోని 2–8–2019 తేది గల గౌరవ ఉన్నత న్యాయస్థానం ఉత్తర్వు నిబంధనల మేరకు చెప్పబడిన కంపెనీకి చెందిన దిగువ షెడ్యూలులో ఆస్తి లిక్విడేషన్ క్రింద ఉందని తెలియజేయడమైనది. పైన తెలిపిన దాని దృష్ట్యా దిగువ షెడ్యూల్ ఆస్తితో ఎటువంటి లావాదేవీలు చేయరాదని ప్రజలను ఇందుమూలంగా హెచ్చరించడమైనది.

**ఆస్తి షెడ్యూలు**


దేవరకొండ సబ్ రిజిస్ట్రార్ డిస్ట్రిక్ట్ మరియు నల్గొండ రిజిస్ట్రేషన్ జిల్లాలో గల నల్గొండ జిల్లా, మర్రిగూడ తాలూకా, దామర భీమనపల్లి గ్రామం వద్ద గల సర్వే నం. 531– ఎకరాలు 18.125 సెంట్లు (ఎకరాలు 18.05 గుంటలు), 532– ఎకరాలు 9.025 సెంట్లు (ఎకరాలు 9.01 గుంటలు), 533– ఎకరాలు 21.125 సెంట్లు (ఎకరాలు 21.05 గుంటలు), 534– ఎకరాలు 11.275 సెంట్లు (ఎకరాలు 11.11 గుంటలు), 536 –ఎకరాలు 13.00 సెంట్లు (ఎకరాలు 13.00 గుంటలు), 539–ఎకరాలు 12.45 సెంట్లు (ఎకరాలు 12.18 గుంటలు), 540 – ఎకరాలు 17.80 సెంట్లు (ఎకరాలు 17.32 గుంటలు), 541–ఎకరాలు 20.175 సెంట్లు (ఎకరాలు 20.07 గుంటలు), 542 – ఎకరాలు 5.525 సెంట్లు (ఎకరాలు 5.21 గుంటలు), 543–ఎకరాలు 11.25 సెంట్లు (ఎకరాలు 11.10 గుంటలు), 544–ఎకరాలు 15.95 సెంట్లు (ఎకరాలు 15.38 గుంటలు), 545–ఎకరాలు14.675 సెంట్లు (ఎకరాలు 14.27 గుంటలు), 546–ఎకరాలు 8.00 సెంట్లు (ఎకరాలు 8.00 గుంటలు), 547–ఎకరాలు 8.775 సెంట్లు (ఎకరాలు 8.31గుంటలు), 548 – ఎకరాలు 20.575 సెంట్లు (ఎకరాలు 20.23 గుంటలు), 549 – ఎకరాలు 19.575 సెంట్లు (ఎకరాలు 19.23 గుంటలు), 550–ఎకరాలు 13.725 సెంట్లు (ఎకరాలు 13.29 గుంటలు), 551– ఎకరాలు 6.725 సెంట్లు (ఎకరాలు 6.29 గుంటలు), 552–ఎకరాలు 16.05 సెంట్లు (ఎకరాలు 16.02 గుంటలు), 553 – ఎకరాలు 13.675 సెంట్లు (ఎకరాలు 13.27 గుంటలు), 554–ఎకరాలు 5.55 సెంట్లు (ఎకరాలు 5.22 గుంటలు), 555– ఎకరాలు 4.325 సెంట్లు (ఎకరాలు 4.13 గుంటలు), 556–ఎకరాలు 3.675 సెంట్లు (ఎకరాలు 3.27 గుంటలు), 557– ఎకరాలు 6.15 సెంట్లు (ఎకరాలు 6.06 గుంటలు), 558–ఎకరాలు 20.45 సెంట్లు (ఎకరాలు 20.18 గుంటలు), 559–ఎకరాలు 17.675 సెంట్లు (ఎకరాలు 17.27 గుంటలు), 560–ఎకరాలు 6.425 సెంట్లు (ఎకరాలు 6.17 గుంటలు), 561–ఎకరాలు 18.275 సెంట్లు (ఎకరాలు 18.11 గుంటలు), 562–ఎకరాలు 4.175 సెంట్లు (ఎకరాలు 4.07 గుంటలు), 563–ఎకరాలు 3.275 సెంట్లు (ఎకరాలు 3.11 గుంటలు), 564 –ఎకరాలు 5.20 సెంట్లు (ఎకరాలు 5.08 గుంటలు), 565 – ఎకరాలు 2.85 సెంట్లు (ఎకరాలు 2.34 గుంటలు) మరియు 566 – ఎకరాలు 3.275 సెంట్లు (ఎకరాలు 3.11 గుంటలు)లో ఎకరాలు 378.775 సెంట్ల విస్తీర్ణం గల వ్యవసాయ భూమి యావత్తు.

సం/–
**DR. K. THIRUMALAI MUTHU**
**అఫీషియల్ లిక్విడేటర్**
**ఉన్నత న్యాయస్థానం, మద్రాస్**

చెన్నై
**తేది: 19 డిసెంబరు, 2019**


# సీసీఐకి వద్దంట.. ప్రైవేటుకే పంట!

- ఉత్తర తెలంగాణలో పత్తి రైతుకు దక్కని మద్దతు ధర
- సీసీఐ సాకులతో 'ప్రైవేట్'కే తరలుతున్న పత్తి పంట
- అక్కడ దళారులు నిర్ణయించిందే ధర..
- క్వింటాకు రూ. 2 వేల వరకు నష్టపోతున్న రైతులు
- 17.45 లక్షల క్వింటాళ్లకు సీసీఐ కొన్నది 1,53,438 క్వింటాళ్లే



ఈ ఫొటోలోని రైతు పేరు జనార్దన్‌రెడ్డి. ఇతనిది వరంగల్ రూరల్ జిల్లా దుగ్గొండి మండలం నాచినపల్లి గ్రామం. ఎకరన్నర భూమిలో పత్తి పంట వేశాడు. ఈ సారి అధిక వర్షాల మూలంగా 10 క్వింటాళ్లే దిగుబడి వచ్చింది. మార్కెట్‌లో ధర సరిగా లేక సీసీఐ కేంద్రంలో అమ్మితే క్వింటాకు రూ.5,550 వస్తుందని ఆశపడి ట్రాలీ ఆటోలో దుగ్గొండి మండలం గిర్నిబావిలోని సీసీఐ కేంద్రానికి నాలుగు రోజుల క్రితం తీసుకెళ్లాడు. అక్కడి సీసీఐ అధికారులు కనీసం తేమ పరీక్ష కూడా చేయలేదు. 'మేం తీసుకోం.. నీ పత్తి బాగాలేదు.. ఇక్కడి నుంచి వెళ్లిపో'అంటూ గదమాయించారు. కాటన్ మిల్లు బయట కూడా ఉండొద్దని డ్రైవర్‌ను బెదిరించారు. కేంద్రానికి ఉదయం వెళ్లిన రైతు సాయంత్రం 4 గంటల వరకు అక్కడే పడిగాపులు కాశాడు. అయినా అక్కడి అధికారులు కనికరించలేదు. చివరికి చేసేది లేక ఆ రోజు సాయంత్రం వరంగల్ మార్కెట్‌కు తరలించి మరుసటి రోజు ప్రైవేటు వ్యాపారులకు క్వింటాకు రూ.4,500 చొప్పున అమ్ముకున్నాడు. సీసీఐ కేంద్రంలో కొనకపోవడం వల్ల జనార్దన్‌రెడ్డి రూ.10 వేలు నష్టపోయాడు.

ఇలా అనేక మంది రైతులు ప్రతిరోజు సీసీఐ కేంద్రాల వద్ద పడిగాపులు పడుతున్నారు. అక్కడి అధికారుల తీరును చూసి ఆవేదన చెందుతున్నారు. భారత పత్తి సంస్థ (సీసీఐ) ఈసారి కూడా రైతులను అసంతృప్తికి గురి చేస్తోంది. అకాల వర్షం.. దిగుబడి తగ్గిన రైతులను ఆపత్కాలంలో అండగా నిలవాల్సిన సీసీఐ మొక్కుబడి కొనుగోళ్లు చేస్తుంది. నిబంధనల పేరుతో కొనుగోళ్లకు దూరంగా ఉండటంపై రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. మార్కెటింగ్ శాఖ వరంగల్ రీజియన్ పరిధిలో ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో సీసీఐ మొక్కుబడి కొనుగోళ్లు చేసింది. దీంతో దళారులు, వ్యాపారులు మార్కెట్లకు వెళ్లిన రైతులకు ఇష్టారాజ్యంగా ధరలు చెల్లిస్తుండటంతో కనీస మద్దతు ధర అపహాస్యమవుతోంది. మంగళవారం నాటికి ఈ నాలుగు జిల్లాల్లో 20,12,250 క్వింటాళ్ల మేరకు మార్కెట్లు, జిన్నింగ్ మిల్లులకు తరలగా సీసీఐ కేవలం 1,53,438 క్వింటాళ్లను కనీస మద్దతు ధరపై కొనుగోలు చేసింది. దళారులు, వ్యాపారులు 15,91,509 క్వింటాళ్లను కొనుగోలు చేయగా, 2,67,250 క్వింటాళ్లను రైతులు విక్రయించేందుకు విముఖత చూపినట్లు అధికారుల రికార్డులు చెబుతున్నాయి. కాగా వ్యాపారులు మద్దతు ధరకు గరిష్టంగా రూ.1,000 నుంచి రూ.2,000 వరకు తక్కువగా చెల్లిస్తున్నారు. ప్రభుత్వం కనీస మద్దతు ధర రకాలను బట్టి క్వింటాకు రూ.5,550, రూ.5,450గా నిర్ణయించగా.. మార్కెట్‌లో పత్తి ధర రూ.3,300 నుంచి రూ.4,650 దాటడం లేదు. దీంతో సీసీఐ కొనుగోళ్లు చేయకపోవడం పట్ల రైతులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు.



**పత్తి రకం, నాణ్యతా ప్రమాణాలు, మద్దతు ధర వివరాలు**


| పత్తి రకం | మద్దతు ధర | నాణ్యతా ప్రమాణాలు | |
|---|---|---|---|
| | | పింజ పొడవు (మి.మీ.) | మైక్రోనీర్ విలువ |
| పొడవు పింజ | రూ.5,550 | 29.5–30.5 | 3.5–4.3 |
| పింజ | రూ.5,450 | 27.5–28.5 | 3.5–4.7 |

**మొత్తం పత్తి కొనుగోళ్లు:** 17,44,947 క్వింటాళ్లు
**(ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో...)**
**వ్యాపారులు కొనుగోలు చేసింది:** 15,91,509 క్వింటాళ్లు
**సీసీఐ కొనుగోలు చేసింది:** 1,53,438 క్వింటాళ్లు

### దిగుబడి అంచనా మేరకు కొనుగోలు కేంద్రాలు

ఉత్తర తెలంగాణలోని పాత నాలుగు జిల్లాల్లో ఖరీఫ్‌లో 18,67,731 హెక్టార్లలో వివిధ పంటలు వేస్తారని వ్యవసాయశాఖ అంచనా వేయగా 18,92,086 హెక్టార్లు సాగయ్యాయి. పత్తి సాధారణ విస్తీర్ణం 8,72,447 హెక్టార్లు అనుకుంటే 8,82,388 హెక్టార్లలో వేశారు. అయితే పత్తి సాగుకు పరిస్థితులు బాగా కలిసొస్తే హెక్టారుకు 37 నుంచి 50 క్వింటాళ్ల వరకు దిగుబడి వస్తుందని అంచనా. ఈ లెక్కన 3.24 కోట్ల నుంచి 4.41 కోట్ల క్వింటాళ్ల వరకు వస్తుందని మొదట అంచనా వేశారు. అయితే అకాల వర్షాలు, ప్రతికూల పరిస్థితుల నేపథ్యంలో హెక్టారుకు సగటున 22.50 క్వింటాళ్ల చొప్పున 1.98 కోట్ల క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుందని తేల్చారు. ఈ మేరకు రైతుల నుంచి పత్తి కొనుగోలు చేసేందుకు సీసీఐ వరంగల్‌లో 14, కరీంనగర్‌లో 12, ఖమ్మంలో 12, ఆదిలాబాద్‌లో 24 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసింది. అయితే ఈసారి మార్చి వరకు కూడా పత్తి మార్కెట్‌లకు వచ్చే అవకాశం ఉండగా.. ఈ కేంద్రాల్లో సీసీఐ కొనుగోళ్లు మొక్కుబడిగానే ఉన్నాయి. ఫలితంగా ప్రైవేట్ వ్యాపారుల హవా కొనసాగుతోంది. *–సాక్షి ప్రతినిధి, వరంగల్*

### వ్యాపారులకే అమ్మాను..



బస్తాల్లో తెచ్చినందున సీసీఐ కేంద్రంలో కొనరని ప్రైవేట్ వ్యాపారులకే అమ్ముకున్నాను. 10 క్వింటాళ్ల పత్తి తెచ్చాను. ఎంఎస్‌పీ ధర క్వింటాల్‌కు రూ.5,550గా ఉంది. కానీ రూ.4,900కే ప్రైవేట్ వ్యాపారులకు విక్రయించాను. ఇప్పటికైనా సీసీఐలో ఎంఎస్‌పీ మీద కొంటే బాగుంటుంది.
*–తిరుపతిరెడ్డి, పత్తిపాక, శాయంపేట మండలం, వరంగల్ రూరల్ జిల్లా*

### గిట్టుబాటు ధర దక్కేలా చర్యలు..



రాష్ట్రవ్యాప్తంగా పత్తి సాగు పెరిగింది. గతేడాది 18 లక్షల హెక్టార్లలో సాగు చేయగా ఈ ఏడాది 23 లక్షల హెక్టార్లలో సాగు చేశారు. సాగు విస్తీర్ణం ప్రకారం 44 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి దిగుబడి వస్తుందని అంచనా వేశాం. సీసీఐ కేంద్రాల్లో పత్తి కొనుగోళ్లు మొత్తం ఆన్‌లైన్‌లోనే చేస్తున్నాం. సీసీఐ కేంద్రాల్లో క్వింటాకు రూ.4,500 నుంచి రూ.5,550 వరకు ధరలతో కొనుగోలు చేస్తున్నారు. రైతులకు గిట్టుబాటు ధర దక్కేలా చర్యలు తీసుకుంటున్నాం.
*–మల్లేశం, జాయింట్ డైరెక్టర్ ఆఫ్ మార్కెటింగ్, వరంగల్ రీజియన్*

| ఉమ్మడి జిల్లా | సీసీఐ కొనుగోలు | ప్రైవేట్ వ్యాపారుల కొనుగోలు | మొత్తం కొనుగోళ్లు (క్వింటాళ్లలో) |
|---|---|---|---|
| వరంగల్ | 48,587 | 5,11,948 | 5,60,535 |
| కరీంనగర్ | 11,734 | 1,89,975 | 2,01,709 |
| ఆదిలాబాద్ | 83,188 | 3,92,010 | 4,75,198 |
| ఖమ్మం | 9,929 | 4,97,576 | 5,07,505 |
| మొత్తం | 1,53,438 | 15,91,509 | 17,44,947 |

| ఉమ్మడి జిల్లా | అన్ని పంటల సాగు అంచనా | సాగు విస్తీర్ణం | పత్తి అంచనా | పత్తి సాగు (హెక్టార్లలో) |
|---|---|---|---|---|
| వరంగల్ | 5,61,906 | 5,31,423 | 2,64,241 | 2,63,099 |
| కరీంనగర్ | 3,92,897 | 4,32,602 | 1,47,221 | 1,33,187 |
| ఆదిలాబాద్ | 5,57,779 | 6,24,142 | 3,18,391 | 3,51,430 |
| ఖమ్మం | 3,55,149 | 3,03,919 | 1,42,594 | 1,34,672 |
| మొత్తం | 18,67,731 | 18,92,086 | 8,72,447 | 8,82,388 |

# ప్రైవేటు కాంట్రాక్టర్లకు చెక్!

- తెలంగాణ ఫుడ్స్‌కు ప్రభుత్వ రంగ సంస్థలతో సరుకుల పంపిణీ
- తక్కువ ధరలు కోట్ చేసి టెండర్లు దక్కించుకున్న హాకా, ఆయిల్ ఫెడ్
- ఏళ్లుగా తిష్టవేసిన ప్రైవేటు సంస్థలకు వ్యూహాత్మకంగా చిత్తు..

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ ఫుడ్స్‌లో ప్రైవేటు కాంట్రాక్టర్లకు కళ్లెం పడింది. ఏళ్లుగా టెండర్లను దక్కించుకుంటూ ఇష్టారాజ్యంగా సరుకులు సరఫరా చేసిన ప్రైవేటు సంస్థల ఆగడాలకు అడ్డుకట్ట పడింది. ప్రభుత్వ నిబంధనల్లోని లొసుగులను అవకాశంగా మలచుకున్న కొన్ని ప్రైవేటు సంస్థలు గత కొన్నేళ్లుగా తెలంగాణ ఫుడ్స్‌కు ముడిసరుకుల సరఫరా బాధ్యతలను వ్యూహాత్మకంగా దక్కించుకుంటున్నాయి. ఈ క్రమంలో టెండర్లు దక్కించుకున్న సంస్థలు తెలంగాణ ఫుడ్స్‌కు ఇష్టానుసారంగా సరుకులు సరఫరా చేస్తు న్నాయి. సరుకుల నాణ్యతపై తీవ్ర ఆరోపణలు వస్తున్నప్పటికీ.. మరే కాంట్రాక్టరుకు సరఫరా బాధ్యతలు దక్కకుండా చాకచక్యంగా వ్యవహరించిన సంస్థలకు తాజాగా చెక్ పడింది. ప్రభుత్వ రంగ సంస్థలకు తెలంగాణ ఫుడ్స్‌కు చక్కెర, మొక్కజొన్న, శనగపప్పు, పామాయిల్ తదితర సరుకుల పంపిణీ కాంట్రాక్టులు దక్కాయి.

### సిండికేట్‌కు ఎదురుదెబ్బ..

తెలంగాణ ఫుడ్స్‌కు అవసరమైన సరుకుల పంపిణీ బాధ్యతలను టెండర్ల ద్వారా పిలుస్తున్నప్పటికీ గత కొన్నేళ్లుగా నాలుగైదు సంస్థలు మాత్రమే దక్కించుకుంటున్నాయి. ఈ సంస్థలన్నీ ఒక సిండికేటుగా ఏర్పడి ధరలను కోట్ చేసే క్రమంలో 5 పైసల నుంచి 20 పైసల వ్యత్యాసంతో ధరలు కోట్ చేస్తూ టెండర్లు వేస్తూ వచ్చాయి. దీంతో తక్కువ ధర (ఎల్1)కు అవకాశం కల్పించాల్సి రావడంతో సిండికేటులో ఉన్న సంస్థలకే పంపిణీ బాధ్యతలు దక్కాయి. ఈసారి అందుకు భిన్నంగా ప్రభుత్వ రంగ సంస్థలైన హాకా, ఆయిల్ ఫెడ్‌లు రంగంలోకి దిగాయి. ఇప్పటివరకు పంపిణీ చేసిన కాంట్రాక్టర్లు కోట్ చేసిన ధరలు, టెండర్ విధానాన్ని లోతుగా పరిశీలించిన అధికారులు... టీఎస్‌ఫుడ్స్‌కు అతి తక్కువ ధరకు పంపిణీ చేసేందుకు ఉపక్రమించాయి. ప్రభుత్వ రంగ సంస్థ కావడం.. పెద్దగా లాభాలను సైతం ఆశించకపోవడంతో తక్కువ ధరకు కోట్ చేస్తూ టెండర్లు సొంతం చేసుకున్నాయి. చక్కెర కిలో: రూ.37.80, మొక్కజొన్న కిలో: రూ.25.70, శనగలు కిలో: రూ.68.94 చొప్పున ధరలు కోట్ చేశాయి. దాదాపు ఐదు ప్రైవేటు సంస్థలు టెండర్లలో పాల్గొన్నప్పటికీ.. అతి తక్కువ ధరలను కోట్ చేసిన హాకా పంపిణీ బాధ్యతలను దక్కించుకుంది. అదేవిధంగా పామాయిల్ పంపిణీని ఆయిల్ ఫెడ్ దక్కించుకుంది.

### సరుకుల నాణ్యతపై నిఘా

అంగన్‌వాడీలకు పంపిణీ చేసే సరుకుల నాణ్యతపై రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ థర్డ్‌పార్టీ విచారణ చేపట్టాలని నిర్ణయించింది. ఈక్రమంలో అంగన్‌వాడీలకు సరఫరా చేస్తున్న పదార్థాలన్నీ టీఎస్ ఫుడ్స్ ద్వారానే పంపిణీ అవుతున్నాయి. ఈక్రమంలో టీఎస్ ఫుడ్స్‌కు అందుతున్న ముడిసరుకుపైనా నిఘా కట్టుదిట్టం చేస్తోంది. ఈమేరకు ఆ శాఖ ప్రత్యేకంగా థర్డ్ పార్టీ ఎంక్వైరీ చేపట్టనుంది. ఈ ప్రక్రియంతా గోప్యంగా నిర్వహించాలని నిర్ణయించిన ఆ శాఖ ఉన్నతాధికారులు.. ఇప్పటికే థర్డ్ పార్టీగా ఓ సంస్థను గుర్తించినట్లు తెలిసింది. ఇటీవల రాష్ట్ర మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ ఆ శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలోనూ థర్డ్ పార్టీ విచారణపై చర్చించినట్లు సమాచారం.

## నోటిఫికేషన్‌పై పునరాలోచించాలి: సీపీఐ

**సాక్షి, హైదరాబాద్:** మున్సిపల్ ఎన్నికల నోటిఫికేషన్ విషయంలో పునరాలోచించాలని రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు సీపీఐ కార్యదర్శి చాడ వెంకట్‌రెడ్డి విజ్ఞప్తి చేశారు. అఖిలపక్ష పార్టీలను సమావేశానికి పిలవకుండానే ఎన్నికల ప్రకటన ఆగమేఘాలపై ఇవ్వడం సమంజసంగా లేదని ఓ ప్రకటనలో ఆయన పేర్కొన్నారు. సీపీఐని స్థాపించి 95 ఏళ్లు అవుతున్న సందర్భంగా గురువారం ర్యాలీ నిర్వహిస్తున్నట్టు చాడ తెలియజేశారు.

## 'ఎంఐఎం ఆత్మను కాపాడుకునే ప్రయత్నం'

**సాక్షి, హైదరాబాద్:** ఎంఐఎం అధినేత అసదుద్దీన్ ఒవైసీది భారత్ ఆత్మను కాపాడే ప్రయత్నం కాదని, ఎంఐఎం పార్టీ ఆత్మను కాపాడుకునే ప్రయత్నమని బీజేపీ మీడియా కన్వీనర్ వి.సుధాకర్‌శర్మ ఓ ప్రకటనలో పేర్కొన్నారు.





**2 కోట్లమందికి పైగా**
భారతీయ పౌరులు అటల్ పెన్షన్ యోజన (APY) క్రింద నమోదు చేసుకున్నారు,
ఇది భారత ప్రభుత్వంచే హామీగల పెన్షన్ ఆఫర్ చేస్తోంది

18 మరియు 40 సంవత్సరాల మధ్య వయసుగల పౌరులందరూ సమీపంలోగల బ్యాంక్ శాఖ లేదా తపాలా కార్యాలయాన్ని దర్శించడం ద్వారా ప్రయోజనాలు వినియోగించుకునేందుకు నమోదు చేసుకోవచ్చును. పథకం వివరాల కోసం www.pfrda.org.in మరియు www.npstrust.org.inకు లాగిన్ అవ్వండి

**60 సంవత్సరాల వయసు వచ్చిన తరువాత 3 హామీగల ప్రయోజనాలు**

1 హామీ గల నెలవారీ పెన్షన్ (రూ. 1,000 నుండి రూ. 5,000) సబ్‌స్క్రైబర్లకు జీవితానికి)
2 సబ్‌స్క్రైబర్ మరణించిన తరువాత భార్య / భర్తకు అదే మొత్తం జీవితకాలం పెన్షన్
3 భార్య లేదా భర్త మరణానంతరం నామినీ రూ. 1.70 లక్షల నుండి రూ. 8.50 లక్షలు * పొందుతారు (*- ఇండికేటివ్ పెన్షన్ వెల్త్)

**అదనపు ప్రయోజనాలు**

- వృద్ధికాలంలో రాబడులు అధికంగా ఉంటే సబ్‌స్క్రైబర్లకు అధిక పెన్షన్
- అదే హామీగల పెన్షన్ ప్రయోజనాలు వినియోగించుకునేందుకు భార్య లేదా భర్త కూడా APYలో చేరవచ్చును.
- ఆటో డెబిట్ ద్వారా నెలవారీ, మూడునెలల వారీ లేదా అర్థ సంవత్సరం వారీ వంటి వీలైన చెల్లింపు పద్ధతులు.
- ఆదాయ పన్ను చట్టం, 1961లోని సెక్షన్ 80 CCD క్రింద APY క్రింద జరిపిన కంట్రిబ్యూషన్‌పైన ఆదాయ పన్ను ప్రయోజనాలు

మరింత సమాచారం కోసం కాల్‌చేయండి టోల్ ఫ్రీ నం. 1800-110-069

davp 15113/13/0004/1920


## హైదరాబాద్‌కు ఈజిప్టు ఉల్లి

- మొదటి విడతగా కేవలం 30 టన్నుల ఉల్లి దిగుమతి
- గ్రేటర్ పరిధిలోని రైతుబజార్లలో సబ్సిడీపై ఉల్లి విక్రయాలు
- ఒక్కొక్కరికి రెండుకిలోలు.. కిలో రూ. 40



**సాక్షి, హైదరాబాద్: సాక్షి, హైదరాబాద్:** ఆకాశాన్నంటిన ధరలతో ఉల్లి కన్నీళ్లు పెట్టిస్తుండటంతో హైద రాబాదీకి ఊరటనిచ్చేందుకు ఈజిప్టు ఉల్లి వచ్చేసింది. రోజులు గడుస్తున్నా ఉల్లి ధర తగ్గుముఖం పట్టకపోవడంతో ప్రభుత్వం ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టింది. ఈజిప్టు నుంచి బుధవారం నగరానికి ఉల్లి రావడంతో ధరలు కాస్త తగ్గుతాయని భావిస్తున్నారు. ఇటీవల ఉల్లి ధరలు విపరీతంగా పెరిగిపోవడంతో ధరల నియంత్రణకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా ఈజిప్టు నుంచి ఉల్లి దిగుమతులు చేపట్టింది. రాష్ట్ర మార్కెటింగ్ శాఖ వంద మెట్రిక్ టన్నులు పంపించాలని కేంద్రాన్ని కోరింది. మొదటి విడతగా బుధవారం 30 టన్నుల ఉల్లి బోయిన్‌పల్లికి చేరుకుందని మార్కెటింగ్ శాఖ సంచాలకులు లక్ష్మిబాయి తెలిపారు.

### ఈజిప్టు నుంచి ఉల్లి దిగుమతి

ఉల్లిగడ్డ ధరలు ఆకాశాన్నంటుతున్న నేపథ్యంలో ధరల నియంత్రణకు ప్రభుత్వం ఈజిప్టు నుంచి ఉల్లి దిగుమతి చేయాలని గత నెల నిర్ణయించింది. ఈ నెల మొదటి వారంలో రిటైల్ మార్కెట్‌లో 100 నుంచి 150 రూపాయలకు ఉల్లి అమ్మకాలు జరిగాయి. వారంలో ఉల్లి ధరలు 100 నుంచి 80 రూపాయలకు విక్రయిస్తున్నారు. ఈ నేపథ్యంలో మార్కెటింగ్‌శాఖ ఈజిప్టు నుంచి 500 మెట్రిక్‌టన్నుల ఉల్లిగడ్డను దిగుమతి చేసుకోవాలని నిర్ణయించి నేషనల్ కార్పొరేషన్ మార్కెట్ ఫెడరేషన్‌కు ఆర్డర్ కూడా ఇచ్చామని మార్కెటింగ్ శాఖ సంచాలకులు తెలిపారు. 100 మెట్రిక్‌టన్నుల ఉల్లి 15వ తేదీన నగరానికి రానున్నట్టు అధికారులు తెలిపారు. అయితే దిగుమతి అయిన ఉల్లిని ఉత్తరాధి రాష్ట్రాలకు ముందు ఎగుమతి చేశారు. బుధవారం కేవలం 30 టన్నుల ఉల్లి మాత్రమే దిగుమతి అయిందని అధికారులు చెప్పారు. ఆలస్యంగా ఉల్లి దిగుమతి అయినా కేవలం 30 టన్నుల్లే రావడంతో మార్కెటింగ్ అధికారులకు సరఫరా పెద్ద తలనొప్పిగా మారింది. ముందు కేవలం గ్రేటర్‌లోనే విక్రయించాలని ఉన్నత అధికారులు నిర్ణయించారు. రాష్ట్ర మార్కెటింగ్ శాఖ ఆధ్వర్యంలో గ్రేటర్ పరిధిలోని 11 రైతు బజార్లకు మొదటి విడుతగా ఈజిప్టు నుంచి తెప్పించిన ఉల్లి సబ్సిడీ పై కేజీ రూ. 40కి ఒక్కొక్కరికి 2 కేజీలు సరఫరా చేయాలని అధికారులు నిర్ణయించారు. సరఫరాకు సంబంధించి ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేశామని మార్కెటింగ్ శాఖ అధికారులు తెలిపారు.



ఏయే దేశాల్లో: భారత్, శ్రీలంక, యూఏఈ, ఒమన్, సౌదీ అరేబియా, ఖతర్, మలేసియా, ఇండోనేసియా, సింగపూర్ , తూర్పు రష్యా, ఆస్ట్రేలియా

# నేడే సూర్యగ్రహణం

- దక్షిణ భారతంలో అధికం
- నేరుగా చూడొద్దంటున్న శాస్త్రవేత్తలు

**న్యూఢిల్లీ:** ఈ ఏడాదికి గుడ్‌బై కొట్టేస్తూ 2020 కొత్త సంవత్సరానికి స్వాగత ఏర్పాట్లు చేసుకుంటున్న సమయంలో సూర్యగ్రహణం సంభవించడం అందరిలోనూ ఆసక్తిని రేపుతోంది. సూర్యుడికి, భూమికి మధ్య చంద్రుడు రావడం వల్ల సూర్యగ్రహణం వస్తుంది. గురువారం నాడు సంభవించే వార్షిక సూర్యగ్రహణం ఈ సారి భారత్‌లో చాలా ప్రాంతాల్లో కనిపించనుంది. దక్షిణ భారత దేశంలో ఈ సారి సూర్యగ్రహణం అధికంగా కనిపించనుంది. ముఖ్యంగా తమిళనాడు, కర్ణాటక, కేరళలో సూర్యగ్రహణం ప్రభావం ఎక్కువ. అయితే ఇది సంపూర్ణ సూర్య గ్రహణం కాదు. ఆకాశంలో సూర్యుడు ఒక ఉంగరంలా మారే అద్భుత దృశ్యం రింగ్ ఆఫ్ ఫైర్ ఆవిష్కృతం కానుంది. భూమికి చంద్రుడు చాలా దూరంగా ఉండడం వల్ల ఈ సారి పాక్షిక సూర్యగ్రహణం మాత్రమే ఏర్పడుతోంది.

**ఎప్పటి నుంచి ఎప్పటివరకు..**

- ఈ సారి సూర్యగ్రహణం భారత్‌లో 3 గంటల 12 నిమిషాల సేపు కొనసాగుతుంది.
- భారత కాలమాన ప్రకారం ఉదయం 8:04గంటలకు ప్రారంభమవుతుంది
- ఉచ్ఛస్థితికి ఉదయం 9:27కి చేరుకుంటుంది.
- ఉదయం 11:05గంటలకు ముగుస్తుంది.

**భారత్‌లో రింగ్ ఆఫ్ ఫైర్ కనిపించే ప్రాంతాలు**

- ఊటీ, మంగళూరు, కోయంబత్తూర్, శివగంగ, తిరుచిరాపల్లి, కసరాగాడ్


**భారత్‌లో పాక్షిక సూర్యగ్రహణం ఎక్కడెక్కడ?**

ఢిల్లీ, పుణె, జైపూర్, లక్నో, కాన్పూర్, నాగపూర్, ఇండోర్, కోల్‌కతా, చెన్నై, అహ్మదాబాద్, సూరత్, భోపాల్, విశాఖపట్నం, లూథియానా, ఆగ్రా

**నేరుగా చూడొద్దు**

- కంటితో నేరుగా సూర్యగ్రహణం చూడడం అత్యంత ప్రమాదం. సూర్యుడి నుంచి వచ్చే అతినీలలోహిత కిరణాల వల్ల కంటికి ఎంత మాత్రమూ మంచిది కాదు.
- సూర్యగ్రహణాన్ని నేరుగా చూడడం వల్ల కంటి రెటినాపై ప్రభావం చూపుతుంది.
- నల్ల కళ్లద్దాలు, మార్కెట్‌లో లభించే ఇతర సోలార్ ఫిల్టర్స్‌తో సూర్యగ్రహణం చూడకూడదు.
- కెమెరా, టెలిస్కోప్, బైనాక్యులర్స్ ఇతర పరికరాలతో చూడొద్దు.
- మార్కెట్‌లో ప్రత్యేకంగా సూర్యగ్రహణం చూడడానికి తయారు చేసే సోలార్ ఫిల్టర్స్ ద్వారా మాత్రమే చూడాలి.
- వెల్డర్స్ గ్లాస్ నెంబర్ 14 సూర్యగ్రహణం చూడడానికి అత్యుత్తమమైనది. ఇది కంటికి అత్యంత రక్షణ కల్పిస్తుందని మధ్యప్రదేశ్‌లో బిర్లా ప్లానిటోరియం శాస్త్రవేత్త దేబీప్రసాద్ దొరి చెప్పారు.

## క్లుప్తంగా...



### మోదీకి గుడి కట్టిన రైతు

**తిరుచిరాపల్లి:** ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన పథకాలకు ముగ్ధుడైన ఓ తమిళ రైతు మోదీకి గుడి కట్టాడు. తమిళనాడులోని తిరుచిరాపల్లికి 63 కిలోమీటర్ల దూరంలో ఉండే ఏరకుడి గ్రామంలో పి.శంకర్ అనే రైతు మోదీ గుడిని గత వారమే ప్రారంభించాడు. అక్కడ మోదీ ప్రతిమకు ప్రతిరోజూ హారతి ఇస్తున్నాడు. తను ప్రధాని మోదీ ప్రవేశపెట్టిన పథకాలతో లబ్ధి పొందానని, ఆయనంటే తనకెంతో అభిమానమని శంకర్ పేర్కొన్నాడు. గుడి నిర్మాణానికి లక్షా ఇరవై వేల రూపాయల ఖర్చు అయింది.

### త్వరలోనే వాట్సాప్ 'డార్క్‌మోడ్'



**శాన్‌ఫ్రాన్సిస్కో:** ఫేస్‌బుక్ యాజమాన్యంలో నడుస్తున్న వాట్సాప్ ఎప్పటి నుంచో ఊరిస్తున్న డార్క్‌మోడ్ ఫీచర్ విడుదలకు సిద్ధమైంది. కొందరు యూజర్లు ఇప్పటికే దానిని వాడారు కూడా. వాట్సాప్ డార్క్‌మోడ్ ఆండ్రాయిడ్ వెర్షన్ ఇప్పటికే సిద్ధమైందని, ఐఓఎస్ వెర్షన్ తుదిరూపు దిద్దుకుంటోందని బ్రిటన్‌కు చెందిన ఇండిపెండెంట్ వెబ్‌సైట్ తెలిపింది. డార్క్‌మోడ్ అంటే..సాధారణంగా ఇంటర్నెట్ సమాచారమంతా తెలుపు బ్యాక్‌గ్రౌండ్ నల్లని అక్షరాల్లో ఉంటుంది. దీనికి భిన్నంగా నలుపు బ్యాక్ గ్రౌండ్‌తో తెలుపు రంగులో అక్షరాలు కనిపిస్తాయి. దీనివల్ల కళ్లకు తక్కువ శ్రమ కలుగుతుందని, రాత్రి వేళల్లో యాప్‌ను ఉపయోగించే వారికి సౌకర్యంగా ఉంటుందని భావిస్తున్నారు.

### బెంగళూరులో డిటెన్షన్ సెంటర్

**బెంగళూరు:** దేశంలోకి అక్రమంగా ప్రవేశించే వలసదారుల కోసం కర్ణాటక ప్రభుత్వం మొట్టమొదటి నిర్బంధ కేంద్రం (డిటెన్షన్ సెంటర్)ను ప్రారంభించింది. పౌరసత్వ సవరణ చట్టంపై దేశవ్యాప్తంగా నిరసనలు వెల్లువెత్తుతుండగా కర్ణాటకలోకి బీజేపీ ప్రభుత్వం ఈ చర్య తీసుకోవడం గమనార్హం. అక్రమంగా దేశంలోకి ప్రవేశించిన వారిని, గడువు తీరిన తర్వాత కూడా దేశంలో తిష్టవేసిన వారిని ఇక్కడ ఉంచుతారు. బెంగళూరుకు సమీపంలోని సొందెకొప్ప గ్రామ సమీపంలో ఉన్న భవనంలో కొన్ని గదులు ఉన్నాయి.

### ఖోజీల కనుమరుగు!

**బలియన్‌వాలా(రాజస్తాన్):** ఎడారుల్లో మనుషుల పాదముద్రలు చూసి వారి జాడను పసిగట్టే ఖోజీలు కనుమరుగవుతున్నారు. రాజస్తాన్ ఎడారుల్లో ఇండో–పాక్ సరిహద్దుల్లో గస్తీ కాసే ఖోజీలు క్రమంగా తగ్గిపోతున్నారు. రాత్రిళ్ల అత్యంత భద్రతా ఏర్పాట్లు, సరిహద్దు వెంట కంచె ఏర్పాటు వంటి పటిష్టచర్యలు పెంచినకారణంగా ఖోజీల నియామకాన్ని తగ్గించినట్లు బీఎస్‌ఎఫ్ సీనియర్ అధికారి వెల్లడించారు. ఇసుకలో నడిచే మనిషి పాదముద్రల ఆధారంగా నడిచే విధానాన్ని అంచనా వేసి వారిని గుర్తించేందుకు ఖోజీలు ప్రత్యేకంగా శిక్షణ పొందుతారు. గతంలో సరిహద్దు భద్రతా దళంలో వందల మంది ఖోజీలు పాకిస్తాన్ వెంబడి ఉన్న 471 కిలోమీటర్ల సరిహద్దు ప్రాంతంలో గస్తీ కాసేవారు.

### పాక్ కాల్పుల్లో ఇద్దరు మృతి

**శ్రీనగర్:** కాల్పుల విరమణ ఒప్పందానికి ఎప్పుడూ తూట్లు పొడిచే దాయాది పాకిస్తాన్ మరోసారి సరిహద్దు వద్ద భారత ఆర్మీపై దాడి చేసింది. ఈ ఘటనలో ఓ సైనికుడు, ఒక మహిళ మృతి చెందారని రక్షణ వర్గాలు తెలిపాయి. హాజీపూర్ ప్రాంతంలో ఉదయం 11.30 గంటలకు కాల్పులకు తెగబడిన పాక్.. రామ్‌పూర్ సెక్టార్‌లోనూ భారత ఆర్మీపై విరుచుకు పడింది. రామ్‌పూర్‌లో జరిగిన దాడిలో జూనియర్ కమిషన్డ్ ఆఫీసర్ (జేసీవో) మరణించారని తెలుస్తోంది. సరిహద్దు వెంట ఉన్న మరికొన్ని గ్రామాల పైకి సైతం పాకిస్తాన్ మోర్టార్ దాడులతో తెగబడింది. చురుండా అనే గ్రామంలో ఇద్దరు పౌరులకు గాయాలయ్యాయి. ఈ కాల్పుల్లో నసీమా బేగమ్ అనే మహిళ మృతి చెందింది.

# వారు బాధ్యత గుర్తించాలి

- పౌరసత్వ సవరణ చట్ట వ్యతిరేక ఉద్యమకారులనుద్దేశించి ప్రధాని మోదీ వ్యాఖ్య
- లక్నోలో అటల్‌జీ భారీ విగ్రహావిష్కరణ

**లక్నో:** పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా జరిగిన ఆందోళనల్లో ప్రభుత్వ ఆస్తులు ధ్వంసం చేయడంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. 'చేసిన పని సరైందా అన్నది వాళ్లు (ఆందోళనకారులు) తమని తాము ప్రశ్నించుకోవాలి. వాళ్లు తగులబెట్టింది ఏదైనా కానీ.. వారి పిల్లలకు ఉపయోగపడేదేగా' అని ఆయన ధ్వజమెత్తారు. మాజీ ప్రధాని అటల్ బిహారీ వాజ్‌పేయి 95వ జయంతి సందర్భంగా బుధవారం ప్రధాని మోదీ లక్నోలో 25 అడుగుల ఎత్తైన భారీ విగ్రహాన్ని ఆవిష్కరించారు. అటల్ పేరుతో ఏర్పాటు కానున్న వైద్య విశ్వవిద్యాలయానికి ప్రధాని శంకుస్థాపన చేశారు. లక్నోలోని లోక్‌భవన్‌లో ఈ సందర్భంగా ఏర్పాటైన కార్యక్రమంలో మోదీ మాట్లాడారు. ఆందోళనకారులు తమ హక్కులు, బాధ్యతలు గుర్తెరిగి ప్రవర్తించాలని అన్నారు. ఆందోళనల్లో గాయపడ్డ, పోలీసులు, సామాన్యులు ఏం చేశారని ప్రశ్నించారు. ఆర్టికల్ 370 రద్దుతో ఓ పాత జబ్బు శాంతియుతంగా నయమైపోయిందన్నారు. రామజన్మభూమి సమస్య కూడా శాంతియుతంగానే పరిష్కారమైందని అన్నారు. తమ పిల్లల మాన మర్యాదలను కాపాడుకునేందుకు భారత్ వచ్చిన పాకిస్తాన్, అఫ్గానిస్తాన్, బంగ్లాదేశ్ ప్రజలకు పౌరసత్వం కల్పించేందుకు ఉద్దేశించిన పౌరసత్వ చట్ట సవరణ అనే సమస్యకు 130 కోట్ల మంది భారతీయులు ఒక పరిష్కారాన్ని ఆవిష్కరించారని అన్నారు. ఈ ఆత్మ విశ్వాసంతో భారత్ నవ దశాబ్దంలోకి ప్రవేశిస్తోందని మిగిలిన అన్ని పనులు పూర్తి చేసే లక్ష్యంతో సాగుతోందని అన్నారు. సవాళ్లకే సవాలు విసరడం తమ నైజమని ప్రధాని వ్యాఖ్యానించారు. ఉత్తర ప్రదేశ్ గవర్నర్ ఆనందీ బెన్, ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్, రక్షణ మంత్రి రాజ్‌నాథ్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. పౌరసత్వ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఉత్తరప్రదేశ్‌లో కొనసాగుతున్న ఆందోళనల్లో ఇప్పటిదాకా మొత్తం 15 మంది మరణించగా, సుమారు 263 మంది గాయపడ్డారు.

ఇదిలా ఉండగా.. హిమాచల్‌ప్రదేశ్‌ను లదాఖ్, జమ్మూకశ్మీర్‌లతో కలిపే రోహ్‌తంగ్ సొరంగానికి మాజీ ప్రధాని వాజ్‌పేయి పేరు పెట్టాలని కేంద్రం నిర్ణయించింది. ఇకపై ఈ సొరంగాన్ని అటల్ టన్నెల్‌గా పిలుస్తారని ప్రధాని మోదీ బుధవారం ప్రకటించారు. ఈ సొరంగానికి 2003లో వాజ్‌పేయి శంకుస్థాపన చేశారు.



ఢిల్లీలోని వాజ్‌పేయి స్మారకం వద్ద నివాళులర్పిస్తున్న ప్రధాని నరేంద్ర మోదీ

**25 అడుగుల ఎత్తు**

వాజ్‌పేయి కాంస్య విగ్రహాన్ని శిల్పి రాజ్‌కుమార్ పండిట్ రూపొందించారు. 25 అడుగుల ఎత్తు, 5 టన్నుల బరువున్న ఈ విగ్రహతయారీకి రూ.89 లక్షలు ఖర్చయింది. పండిట్ నేతృత్వంలోని 65 మంది కళాకారులు ఆరు నెలల పాటు శ్రమించి దీనిని తయారు చేశారు. బిహార్‌కు చెందిన రాజ్‌కుమార్ పండిట్ జైపూర్ కేంద్రంగా కాంస్యం, అల్యూమినియం, ఇత్తడి వంటి లోహాలతో ప్రముఖుల విగ్రహాలను వేలాదిగా తయారు చేశారు. ఈయన తయారుచేసిన అత్యంత ఎత్తైన 47 అడుగుల పాండవ వీరుడు అర్జునుడి విగ్రహాన్ని జైపూర్‌లో ప్రతిష్టించారు.

## బొట్టు బొట్టు ఒడిసిపట్టాల్సిందే!

మెరుగైన సాగుపద్ధతులు పాటించడం, నీటి అవసరం తక్కువ ఉన్న పంటలు పండించడం ద్వారా రైతులు జల సంరక్షణకు పాటుపడాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారు. బుధవారం ఢిల్లీలో భూగర్భ జల సంరక్షణ పథకమైన 'అటల్ జల్ యోజన'ను మోదీ ప్రారంభించారు. కొత్తగా ప్రారంభించిన ఈ పథకం ఏడు (మహారాష్ట్ర, హరియాణా, రాజస్తాన్, గుజరాత్, మధ్యప్రదేశ్, ఉత్తరప్రదేశ్, కర్ణాటక) రాష్ట్రాల్లోని 78 జిల్లాలు, 8,300 గ్రామాల్లో భూగర్భ జలాల పెంపునకు కృషి చేస్తుందని చెప్పారు. దేశంలో వ్యవసాయం అధికంగా భూగర్భ జలాలపై ఆధారపడి ఉందని, నీటిని పొలాలకు మళ్లించేందుకు ఇప్పటికీ పాత పద్ధతులను ఉపయోగిస్తున్నారని ప్రధాని తెలిపారు. దీనివల్ల చాలాసార్లు నీరు వృథా అవుతోందని అన్నారు. నీటి అవసరం ఎక్కువగా ఉన్న చెరకు పంట సాగయ్యే ప్రాంతాల్లో భూగర్భజలాలు అడుగంటిపోవడాన్ని గమనించామన్నారు. ఈ పరిస్థితులను మెరుగుపరిచేందుకు రైతుల్లో జలసంరక్షణపై అవగాహన మరింత పెరగాలని అన్నారు. దేశంలోని ప్రతి గ్రామం నీటి వాడకానికి సంబంధించి ప్రణాళికలను సిద్ధం చేసుకోవాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వేర్వేరు పథకాల ద్వారా అందించే నిధుల సాయంతో జల సంరక్షణ పనులు చేపట్టాలని కోరారు. భూగర్భ జల మట్టాలు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో రైతులు పరస్పర సహకారంతో నీటి బడ్జెట్‌లు రూపొందించుకుని తదనుగుణంగా పంటల పెంపకం చేపట్టాలని వివరించారు.

**ఐదేళ్లలో రూ.3.5 లక్షల కోట్ల ఖర్చు**

భూగర్భ జల వనరులు తక్కువగా ఉన్న ప్రాంతాల్లో అటల్ జల్ యోజన ద్వారా తాగునీరు అందించే ప్రయత్నం చేస్తున్నామని మోదీ తెలిపారు. గత 70 ఏళ్లలో దేశంలోని మొత్తం 18 కోట్ల గృహాల్లో మూడు కోట్లకు మాత్రమే పైపుల ద్వారా తాగునీటి సౌకర్యం ఒనగూరిందని, తమ ప్రభుత్వం రానున్న ఐదేళ్లలో మిగిలిన 15 కోట్ల కుటుంబాలకు తాగునీటిని చేర్చాలన్న లక్ష్యంతో పనిచేస్తోందని వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇందుకోసం ఐదేళ్లలో రూ. 3.5 లక్షల కోట్లు ఖర్చు చేయనున్నాయని మోదీ తెలిపారు.

# ఆఫ్రికాలో శాంతి నెలకొనాలి

- పోప్ ఫ్రాన్సిస్ క్రిస్మస్ సందేశం
- ప్రపంచవ్యాప్తంగా క్రిస్మస్ వేడుకలు

**వాటికన్ సిటీ:** అంతర్యుద్ధంతో సతమతమైపోతున్న ఆఫ్రికా దేశాల్లో శాంతి స్థాపన జరగాలని పోప్ ఫ్రాన్సిస్ ఆకాంక్షించారు. మధ్యప్రాచ్యం, వెనిజులా, లెబనాన్ ఇతర దేశాల్లో నెలకొన్న యుద్ధ వాతావరణానికి ఇకనైనా ముగింపు పలకాలని పిలుపునిచ్చారు. క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకొని బుధవారం పోప్ వాటికన్ నగరం నుంచి తన సందేశాన్నిచ్చారు. ఆఫ్రికాలో క్రైస్తవులపై తీవ్రవాద సంస్థలు జరుపుతున్న దాడుల్ని ఆయన తీవ్రంగా ఖండించారు. హింసతో రగిలిపోతున్న దేశాల్లో ప్రకృతి వైపరీత్యాలతో సతమతమైపోతున్న దేశాల్లో, వ్యాధులు పడగవిప్పిన నిరుపేద దేశాల్లో ఈఏడాదైనా శాంతి, సుస్థిరతలు నెలకొనాలని పోప్ ఆకాంక్షించారు. 'మధ్యప్రాచ్యం సహా ఎన్నో దేశాల్లో యుద్ధ వాతావరణంలో చిన్నారులు భయంతో బతుకులీడుస్తున్నారు. వారందరి జీవితాల్లో ఈ క్రిస్మస్ వెలుగులు నింపాలని కోరుకుంటున్నాను''అని పోప్ ఫ్రాన్సిస్ పేర్కొన్నారు.



వాటికన్‌లో బాల ఏసు ప్రతిమను ముద్దాడుతున్న పోప్ ఫ్రాన్సిస్

**అంబరాన్నంటిన సంబరాలు**

క్రిస్మస్ సంబరాలు ప్రపంచవ్యాప్తంగా అంబరాన్నంటాయి. క్రిస్టియన్ నేతలు ఒకరికొకరు శుభాకాంక్షలు చెప్పుకుంటూ శాంతి సందేశాలను పంపించుకున్నారు. సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. తీవ్ర తుఫాన్‌తో అల్లాడిపోయిన ఫిలిప్పీన్స్‌లో వేలాది మంది వరద ముప్పులో చిక్కుకోవడంతో క్రిస్మస్ హడావుడి కనిపించలేదు. ఇక ఫ్రాన్స్‌లో పింఛను సంస్కరణలకు వ్యతిరేకంగా నాలుగు వారాలుగా జరుగుతున్న రవాణా సమ్మెతో రాకపోకలు నిలిచిపోయాయి. బంధువులు, స్నేహితులు తమవారిని చేరుకోకపోవడంతో క్రిస్మస్ సందడి కనిపించలేదు.

# ప్రమాణ స్వీకారానికి రండి

**సోనియాకు హేమంత్ సోరెన్ ఆహ్వానం**

**న్యూఢిల్లీ:** జార్ఖండ్ కాబోయే ముఖ్యమంత్రి హేమంత్ సోరెన్ బుధవారం కాంగ్రెస్ చీఫ్ సోనియా గాంధీతో భేటీ అయ్యారు. ఈ నెల 29వ తేదీన జరిగే ప్రమాణ స్వీకారోత్సవానికి ఆమెను ఆహ్వానించారు. అనంతరం ఆయన రాహుల్ గాంధీతోపాటు ఢిల్లీ సీఎం కేజ్రీవాల్‌తోనూ సమావేశమై, వారినీ ఆహ్వానించారు. ఆయన వెంట కాంగ్రెస్ నేతలు కేసీ వేణుగోపాల్, ఆర్‌పీఎన్ సింగ్ కూడా ఉన్నారు. ఇది కేవలం మర్యాదపూర్వక భేటీ అని సోనియాతో సమావేశానికి ముందు హేమంత్ సోరెన్ మీడియాతో అన్నారు. రాష్ట్రంలో సంకీర్ణ ప్రభుత్వం ఏర్పాటుకు సహకరించిన కాంగ్రెస్ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపేందుకే వచ్చానన్నారు. తమ సంకీర్ణ ప్రభుత్వం సుస్థిరంగా ఐదేళ్లు కొనసాగుతుందని విశ్వాసం వ్యక్తం చేశారు. ఇలా ఉండగా, గవర్నర్ ద్రౌపది ముర్ము ప్రభుత్వం ఏర్పాటు చేయాల్సిందిగా తమ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్, ముఖ్యమంత్రి అభ్యర్థి హేమంత్‌ను ఆహ్వానించారని జార్ఖండ్ ముక్తి మోర్చా (జేఎంఎం) బుధవారం తెలిపింది. మంగళవారం హేమంత్, ఇతర కూటమి నేతలతో గవర్నర్‌తో సమావేశమై తనకు 50 మంది ఎమ్మెల్యేల మద్దతు ఉందంటూ లేఖ అందజేశారన్నారు.



సోనియాకు పుష్పగుచ్ఛమిస్తున్న హేమంత్

# సచిన్ భద్రత కుదింపు.. ఆదిత్యకు పెంపు



**ముంబై:** క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్‌కి ప్రభుత్వం భద్రత తగ్గించింది. శివసేన ఎమ్మెల్యే, మహారాష్ట్ర సీఎం ఉద్ధవ్ ఠాక్రే కొడుకు ఆదిత్యకు భద్రత పెంచారు. ఆయనను జడ్ కేటగిరీకి పెంచినట్లు బుధవారం ఒక అధికారి చెప్పారు. ఆయా వ్యక్తులకు పొంచివున్న ప్రమాదాలపై మహారాష్ట్ర ప్రభుత్వ కమిటీ సమీక్ష చేపట్టిన అనంతరం భద్రతా పరిధిలో మార్పులు చేసినట్లు ఆయన తెలిపారు. సచిన్, ఆదిత్యతో పాటు మరో 90 మందికి పైగా ప్రముఖుల భద్రతను ఇటీవల జరిగిన సమావేశంలో కమిటీ సమీక్షించినట్లు తెలిపారు. సచిన్‌కు ఎక్స్ కేటగిరీ భద్రత ఉండేది. ఎక్స్ కేటగిరీ కింద, ఒక పోలీసు సచిన్‌కు 24 గంటలూ రక్షణ కల్పించేవారు. ఇకపై ఆయన తన ఇంటి నుండి బయటికి వెళ్లాల్సి వచ్చినప్పుడల్లా పోలీసు ఎస్కార్ట్ మాత్రం ఇస్తారని తెలిపారు. ఆదిత్య ఠాక్రేకు జెడ్ సెక్యూరిటీ భద్రత కల్పించారు. ఇప్పుడు మరింత ఎక్కువ మంది భద్రతా సిబ్బంది ఆయనకు రక్షణగా ఉంటారు. అంతకు ముందు ఆదిత్యకు వై ప్లస్ భద్రత ఉండేది. సామాజిక కార్యకర్త అన్నా హజారే భద్రతను వై ప్లస్ కేటగిరీ నుంచి జడ్ కేటగిరీకి పెంచినట్లు వెల్లడించారు. బీజేపీ మొదటిదఫా ప్రభుత్వంలోని మంత్రులకు భద్రతా స్థాయిలను తగ్గించే అవకాశాలు ఉన్నాయని అధికారి చెప్పారు.

## బుర్కినాఫాసోలో రక్తపాతం

- 35 మంది పౌరులను చంపిన ఉగ్రవాదులు
- సైన్యం దాడుల్లో 80 మంది ఉగ్రవాదులు హతం

**ఔగడౌగు:** ఆఫ్రికా దేశం బుర్కినాఫాసో రక్తమోడింది. ఇస్లామిక్ ఉగ్రవాదులు ఓ పట్టణంపై దాడి చేసి 35 మందిని చంపేశారు. ప్రతిగా సైన్యం జరిపిన దాడుల్లో 80 మంది ఉగ్రమూకలు హతమయ్యారు. సౌమ్ ప్రావిన్స్‌లోని అర్బిండాలో మంగళవారం ఉదయం బైక్‌లపై వచ్చిన ఉగ్రవాదులు పట్టణంలోని సైనిక క్యాంపుతోపాటు పౌరులపై కాల్పులకు తెగబడ్డారు. ఈ కాల్పుల్లో 35 మంది పౌరులు చనిపోగా 20 మంది సైనికులు, ఆరుగురు పౌరులు గాయపడ్డారు. మృతుల్లో 31 మంది మహిళలేనని ప్రభుత్వం తెలిపింది. వెంటనే రంగంలోకి దిగిన సైన్యం, వైమానిక దళం సాయంతో ఉగ్రవాదులపై భారీ ఎత్తున విరుచుకుపడింది. తమ దాడుల్లో 80 మందికి పైగా ఉగ్రవాదులు హతమైనట్లు సైన్యం ప్రకటించింది. ఉగ్రదాడికి తామే కారణమంటూ ఎవరూ ప్రకటించుకోనప్పటికీ ఈ ప్రాంతంలో తరచూ హింసాత్మక ఘటనలకు పాల్పడుతున్న అల్ ఖాయిదా, ఐఎస్‌లే కారణమని భావిస్తున్నారు. బుర్కినాఫాసోతో మాలి, నైగర్ సరిహద్దులకు సమీపంలో గడిచిన ఐదేళ్లలో ఉగ్ర దాడుల్లో 700 మంది చనిపోయారు. 5.60 లక్షల మంది ప్రజలు భయంతో ఇతర ప్రాంతాలకు వలసవెళ్లారు. దీంతో ఈ ప్రాంతంలో శాంతిని పునరుద్ధరించేందుకు 4, 500 ఫ్రెంచి, 13 వేల ఐక్యరాజ్యసమితి బలగాలు పనిచేస్తున్నాయి.

# ఎన్నార్సీ లేని ఎన్పీఆర్ ఓకే

- మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి కమల్‌నాథ్ వ్యాఖ్య
- సీఏఏకు వ్యతిరేకంగా భోపాల్‌లో కాంగ్రెస్ భారీ ర్యాలీ

**భోపాల్/బెంగళూరు/లక్నో/ వాషింగ్టన్:** జాతీయ పౌర పట్టిక(ఎన్నార్సీ) బదులు జాతీయ జనాభా పట్టిక (ఎన్పీఆర్) అమలు చేయాలని తమ పార్టీ కోరుకుంటోందని మధ్యప్రదేశ్ సీఎం కమల్‌నాథ్ ప్రకటించారు. ఎన్పీఆర్‌తో కలిపి ఎన్నార్సీని చేపట్టడంపై వెనుక మోదీ ప్రభుత్వ ఉద్దేశాలపై అనుమానం వ్యక్తం చేశారు. సీఏఏకు వ్యతిరేకంగా భోపాల్‌లో బుధవారం కాంగ్రెస్ పార్టీ చేపట్టిన భారీ ర్యాలీకి ఆయన నేతృత్వం వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. సీఏఏలో లొసుగులున్నాయి. ఎన్పీఆర్‌ను మేం కోరుకుంటున్నాం. అయితే, ఎన్నార్సీతో కలిపి కాదు. కేంద్రం రెంటినీ కలిపి తేవడం వెనుక కేంద్రం ఉద్దేశం స్పష్టమవుతోంది. సీఏఏ, ఎన్నార్సీ వంటి చట్టాలు గతంలో ఎన్నడూ లేవు' అని అన్నారు. తమ ప్రభుత్వం రాష్ట్రంలో సీఏఏను అమలు చేయబోదన్నారు.



భోపాల్‌లో జాతీయజెండా పట్టుకుని ర్యాలీలో పాల్గొన్న మధ్యప్రదేశ్ సీఎం కమల్‌నాథ్

**అపోహలు దూరం చేసేందుకు:** దుష్ప్రచారం, అపోహల కారణంగానే భారత్‌లో ఎన్నార్సీ, సీఏఏపై ఆందోళనలు చెలరేగాయంటూ భారతీయ అమెరికన్లు పేర్కొన్నారు. అమెరికాలోని పలు నగరాల్లో ఎన్నార్సీ, సీఏఏ అనుకూల ర్యాలీలు చేపట్టారు. డల్లాస్, షికాగో, శాన్‌ఫ్రాన్సిస్కో, న్యూయార్క్, వాషింగ్టన్, అట్లాంటా, శాన్‌జోస్ తదితర ప్రాంతాల్లో ప్రదర్శనలు జరపనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ముస్లింలను భారత్ నుంచి వెళ్లగొడతారనే అపోహలు, వామపక్ష సంస్థల ప్రచారం కారణంగా భారత్‌లో నిరసనలు జరుగుతున్నాయని వినీత్ అనే నిర్వాహకుడు తెలిపారు.

**పథకం ప్రకారం అల్లర్లు:** మంగళూరులో పోలీసుల కాల్పుల ఘటనపై దర్యాప్తు నివేదిక అందే వరకు కాల్పుల్లో మృతుల కుటుంబాలకు ప్రకటించిన పరిహారాన్ని నిలిపివేస్తున్నట్లు కర్ణాటక సీఎం యడియూరప్ప చెప్పారు. 'నేరస్తులకు పరిహారం క్షమార్హం కాని నేరం. మంగళూరు అల్లర్లు పథకం ప్రకారం జరిగాయి. ఆనాడు ఆందోళనకారులు పోలీస్ స్టేషన్‌లోకి వచ్చి ఆయుధాలను లాక్కునేందుకు ప్రయత్నించారు. వారిని వదలం' అని అన్నారు.

### 60 మందికి యూపీ సర్కారు నోటీసులు

సీఏఏకి వ్యతిరేకంగా రాంపూర్, గోరఖ్‌పూర్‌లలో జరిగిన ఆందోళనల్లో హింసకు కారణమైన 60 మందికి యూపీ పోలీసులు నోటీసులు జారీ చేశారు. ప్రభుత్వం నియమించిన అధికారులు..అల్లర్ల కారణంగా రూ.25 లక్షల మేర ప్రభుత్వ, ప్రజల ఆస్తులకు నష్టం వాటిల్లినట్లు తేల్చారు. దీంతో ఇందుకు కారణమైన 28 మందికి బుధవారం నోటీసులిచ్చారు. దీనిపై వారు వారంలోగా వివరణ అయినా ఇవ్వాలి లేదా నష్టాన్ని చెల్లించాల్సి ఉంటుందని అధికారులు పేర్కొన్నారు. లేకుంటే వారిపై చట్ట ప్రకారం చర్యలుంటాయన్నారు. గోరఖ్‌పూర్‌లో జరిగిన అల్లర్లకు కారకులుగా గుర్తించిన 33 మందికి పోలీసులు నోటీసులిచ్చారు.

సాక్షి
గురువారం, డిసెంబర్, 26

# ఇక తిరుగులేని 'రక్షణ'

ఇరుగుపొరుగుతో శాంతిని కోరుకుంటూనే, అందుకోసం చేయాల్సిందంతా చేస్తూనే యుద్ధం వచ్చే పక్షంలో శత్రువును సమర్థవంతంగా ఎదుర్కొనడానికి అనువుగా రక్షణ దళాలను తీర్చిదిద్దడం, వాటికి అవసరమైన సమస్తమూ అందుబాటులో ఉంచడం ఏ దేశానికైనా తప్పనిసరి. ఎందుకంటే యుద్ధం వద్దని ఒక పక్షం కోరుకుంటే సరిపోదు. అవతలి పక్షం కూడా వాంఛించాలి. యుద్ధ నిపుణుల అభిప్రాయం ప్రకారం శత్రువే చాలాసార్లు యుద్ధాన్ని నిర్ణయిస్తాడు. కనుకనే మన త్రివిధ దళాలను స్వతంత్రంగా పర్యవేక్షించడానికి రక్షణ దళాల అధిపతి(చీఫ్ ఆఫ్ డిఫెన్స్ స్టాఫ్–సీడీఎస్)ని నియమించాలని కేంద్ర మంత్రివర్గం మంగళవారం తీసుకున్న నిర్ణయం అన్నివిధాలా సబబైనది. ఈ విషయమై మొన్న స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించినప్పుడు అనేకమంది దాన్ని స్వాగతించారు. త్రివిధ దళాల అధిపతులు ఎవరికి వారు వారి వారి విభాగాల నిర్వహణలో నిత్యం తలమునకలైవుంటారు. ప్రధాని, రక్షణమంత్రి ఆ విభాగాలకు ఎదురవుతున్న సమస్యలేమిటో, వాటిని తీర్చడానికి అనుసరించాల్సిన విధానమేమిటో తెలుసుకోవాలంటే ఈ ముగ్గురితో విడివిడిగా సమావేశం కావడం ప్రస్తుతం తప్పనిసరవుతోంది. రక్షణ దళాల అధిపతి వస్తే, ఆయన ఆ మూడు విభాగాలనూ పర్యవేక్షిస్తూ, వాటికి కావలసిన దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించి, సాధికారికంగా కేంద్ర ప్రభుత్వానికి సలహాలివ్వగలుగుతారు.

ఇప్పుడున్న విధానంలో సైన్యం, వైమానికదళం, నావికాదళం–ఈ మూడూ ఖరారు చేసే ప్రతిపాదనలు రక్షణ కార్యదర్శి వద్దకు వెళ్లడం, దానిపై ఆయన తన అభిప్రాయాన్ని జోడించి రక్షణమంత్రికి ఇవ్వడం, చివరిగా అత్యున్నత స్థాయిలో తుది నిర్ణయం తీసుకోవడం వంటివి జరుగుతున్నాయి. అయితే రక్షణ దళాల అవసరాలను అర్థం చేసుకుని, ప్రభుత్వం వాటిని తీర్చే క్రమంలో ఉన్నతాధికార వ్యవస్థ పెను అడ్డంకిగా వున్నదని త్రివిధ దళాల్లో ఎప్పటినుంచో అసంతృప్తివుంది. జవాన్లకు మెరుగైన ఆయుధాలు, వాహనాలు, ఇతర సామగ్రి సకాలంలో సమకూరడానికి ఉన్నతాధికార గణం ఆమోదం తప్పనిసరికావడం, వారు క్షేత్రస్థాయి స్థితిగతుల్ని పరిగణనలోకి తీసుకోకుండా జాప్యం చేయడం పెను సమస్యగా వున్నదని రక్షణ సిబ్బంది తరచు ఫిర్యాదు చేస్తున్నారు. కార్గిల్ యుద్ధం తర్వాత ఈ సీడీఎస్ నియామకం ప్రతిపాదన తెరపైకి వచ్చింది. అందుకోసం మంత్రుల బృందాన్ని కూడా ఏర్పాటు చేశారు. అప్పట్లో త్రివిధ దళాధిపతుల మధ్య ఏకాభిప్రాయంలేక మూలనబడింది. అయితే ఉన్నతాధికార గణం కూడా అభ్యంతరం వ్యక్తం చేసిందంటారు. సీడీఎస్ నియామకంతో అధికారాలన్నీ ఆయన వద్దనే కేంద్రీకృతమవుతాయని, తమ మాటకు విలువుండదని రక్షణ శాఖ ఉన్నతాధికారులు మొరపెట్టుకున్నారని చెబుతారు. కారణమేదైనా ఆ ప్రతిపాదన ఆగిపోయింది. అయితే అప్పటినుంచీ అడపా దడపా రక్షణ నిపుణులు దీనిపై పునరాలోచించమని ప్రభుత్వాన్ని కోరుతూనేవున్నారు. ప్రస్తుతం త్రివిధ దళాల కమిటీ ఒకటి పనిచేస్తోంది. ఆ ముగ్గురిలోనూ సీనియర్ చైర్మన్‌గా వ్యవహరిస్తున్నారు. అయితే ఈ మూడు విభాగాలకు సంబంధించి ఆయన సలహాలివ్వరు. ఆ బాధ్యతను జాతీయ భద్రతా సలహాదారు(ఎన్ఎస్ఏ) చూస్తున్నారు.

వాస్తవానికి తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ హయాంలోనే సీడీఎస్ ప్రతిపాదన చర్చకొచ్చింది. ఆఖరి గవర్నర్ జనరల్‌గా పనిచేసిన లార్డ్ మౌంట్‌బాటన్ నెహ్రూతో దీన్ని ప్రస్తావించినా ఆయన సుముఖత వ్యక్తం చేయలేదని లెఫ్టినెంట్ జనరల్ ఎంఎల్ ఛిబ్బర్ ఒక గ్రంథంలో రాశారు. అప్పటి సైనిక దళాల ప్రధానాధికారి జనరల్ కె.ఎస్. తిమ్మయ్యను సీడీఎస్‌గా నియమిస్తే బాగుంటుందని కూడా ఆయన సూచించారట. కానీ జనరల్ తిమ్మయ్య విషయంలో నెహ్రూకు అభ్యంతరం వుండటం వల్ల కావొచ్చు... ఆయన అందుకు అంగీకరించలేదు. దాని పర్యవసానాలు 1962 చైనా యుద్ధంలో దేశం చవిచూసింది. అప్పటి ప్రభుత్వం క్షేత్రస్థాయి అంశాలు సైనిక దళాలకు విడిచి, వారిపై పర్యవేక్షణాధికారాన్ని అనుభవంలేని ఉన్నతాధికార గణానికి అప్పజెప్పింది. త్రివిధ దళాల మధ్య సమన్వయలోపంతో స్వల్పకాలంలోనే ఓటమి చవిచూడాల్సి వచ్చింది. సర్వాధికారాలూ సీడీఎస్‌లో కేంద్రీకృతమైతే ఆ పదవిలో వుండేవారు శక్తిమంతులుగా మారతారని, ఇది ప్రజాస్వామ్య వ్యవస్థకు మంచిది కాదని కొందరు వాదిస్తారు. అయితే ప్రపంచంలో 68 దేశాల్లో సీడీఎస్ వ్యవస్థ చాన్నాళ్లుగా అమల్లోవుంది. యుద్ధ సమయాల్లో ఎదురవుతున్న ఇబ్బందులు గుర్తించాకే అవన్నీ సీడీఎస్‌కు మొగ్గుచూపాయి. పైగా ఇప్పుడు సైనిక రంగంలో పెనుమార్పులు చోటుచేసుకున్నాయి. యుద్ధ రీతులు పూర్తిగా మారాయి. వేగంగా ముగిసే మెరుపు యుద్ధాలు, పరిమితకాలంపాటు మాత్రమే కొనసాగే ఘర్షణలు రివాజయ్యాయి. అణ్వాయుధాలు సరే... రిమోట్ కంట్రోల్ ఆయుధాలు, డ్రోన్‌లద్వారా లక్ష్యాలు ఛేదించడం, కృత్రిమ మేధతో పనిచేసే స్వయంచాలిత ఆయుధాలు రంగంలోకొచ్చాయి.

అయితే సీడీఎస్ పేరుతో మరో ఉన్నత పదవి సృష్టించడం మాత్రమే జరిగితే ఆశించిన ప్రయోజనం నెరవేరదు. దానికి అనుగుణంగా త్రివిధ దళాల్లో వేర్వేరు స్థాయిల్లో పూర్తిగా ప్రక్షాళన చేయాలి. త్రివిధ దళాలకు ప్రస్తుతం మొత్తం 19 భౌగోళిక(కమాండ్) వ్యవస్థలున్నాయి. ఇందులో సైన్యానికి ఆరు, నావికా దళానికి మూడు, వైమానిక దళానికి ఏడు వున్నాయి. వీటన్నిటి మధ్యా సమన్వయం సాధించేలా, ఒకే కమాండ్‌కింద పనిచేసేలా పునర్వ్యవస్థీకరించడం అవసరం. రక్షణ దళాలను ఆధునీకరించి, ఆమేరకు సిబ్బందిని కుదిస్తారని ఆమధ్య కథనాలు వెలువడ్డాయి. అది జరగడంతోపాటు భద్రతకు సంబంధించిన అంశాల్లో త్వరితగతిన నిర్ణయాలు తీసుకుంటూ ముందుచూపుతో వ్యవహరించగల పటిష్టమైన వ్యవస్థ రూపొందితే అది దేశాన్ని శత్రుదుర్భేద్యంగా మారుస్తుంది.


## గ్రహం అనుగ్రహం

శ్రీ వికారి నామ సంవత్సరం, దక్షిణాయనం, హేమంత ఋతువు, మార్గశిర మాసం, తిథి అమావాస్య ఉ.10.28 వరకు, తదుపరి పుష్య శు.పాడ్యమి నక్షత్రం మూల సా.5.11 వరకు, తదుపరి పూర్వాషాఢ, వర్జ్యం ప.3.35 నుంచి 5.11 వరకు, తిరిగి తె.3.30 నుంచి 4.38 వరకు, దుర్ముహూర్తం ఉ.10.09 నుంచి 10.55 వరకు, తదుపరి ప.2.32 నుంచి 3.15 వరకు, అమృతఘడియలు... ఉ.10.46 నుంచి 12.22 వరకు, పాక్షిక సూర్యగ్రహణం.

సూర్యోదయం : 6.31
సూర్యాస్తమయం: 5.28
రాహుకాలం : ప.1.30 నుంచి 3.00 వరకు
యమగండం : ఉ.6.00 నుంచి 7.30 వరకు

# కలల రాజధాని X ప్రగతి రాజధాని

విశ్లేషణ



డాక్టర్ ఏపీ విఠల్

**రాజధాని మార్పుపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ తాజా ప్రతిపాదనతో గ్రాఫిక్స్ రాజధాని భ్రమలు తొలగిపోయాయి. టీడీపీ ముందుకు పోతుందన్న నమ్మకం లేని బాబు, ఆ మధ్య వెనక్కి నడవటం ప్రాక్టీసు చేశారు. రెండు రాజధానులా, మూడు రాజధానులా అని ఇప్పుడు కొందరు ప్రశ్నిస్తున్నారు. కానీ, ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధి ముఖ్యం. అభివృద్ధి ఫలాలు అన్ని ప్రాంతాలకూ అందాలి. సామాజిక రాజకీయ వ్యవహారాల్లో ఎంతో కొంత అనుభవం ఉన్న సినీ నటుడు చిరంజీవి సైతం వైఎస్ జగన్ మూడు రాజధానుల ప్రస్తావనను సమర్థిస్తున్నారు. ఏపీ ముఖ్యమంత్రి ప్రజానుకూల పాలనపై నమ్మకం ఉందన్నారు. పైగా, బాబు కంటే జగన్‌పై అత్యధిక ప్రజలలో విశ్వసనీయత ఉంది. వైఎస్ జగన్ ప్రతిపాదిస్తున్న రాజధాని ప్రగతికి సంబంధించినది కాగా, బాబు ప్రతిపాదించిన రాజధాని కలల రాజధాని మాత్రమే!**

ఇటీవల చంద్రబాబు కలల రాజధాని గురించి ఆందోళనలు మిన్నంటుతున్నట్లు కొన్ని మీడియా చానళ్లు, పత్రికలు గగ్గోలు పెడుతున్నాయి. అసలు చంద్రబాబుకి ఒక మంచి రాజధాని నిర్మించాలన్న ఆలోచన లేనేలేదని నాకు అనిపిస్తోంది. 2014 ఎన్నికల్లో బాబు తెలుగుదేశం, మోదీ బీజేపీ, పవన్ కల్యాణ్ జనసేన అన్నీ కలిపి పోటీ చేసినప్పటికీ, ఆ అవకాశవాద రాజకీయ కూటమికి.. ఒంటరిగా పోటీ చేసిన వైఎస్సార్ సీపీపై కేవలం 1.5 శాతం ఓట్ల ఆధిక్యతతో అధికారం దక్కింది. ఆ క్షణంలోనే చంద్రబాబు కొత్తగా ఏర్పడిన ఆంధ్రప్రదేశ్ ప్రజానీకాన్ని కూడా వెన్నుపోటు పొడిచేందుకు సిద్ధపడి ఉంటారు. ఇక 2019లో తాను మళ్లీ గెలవడం అసాధ్యం అని దూరదృష్టితో గ్రహించి ఉంటారు. అందుకే అయిదేళ్లపాలనలో సాధ్యమైనంతగా సంపద సృష్టించుకుని, తన వారికి, తన పుత్రునికి తన సామాజిక వర్గం వారికి, బంధుమిత్రులకు తాను సృష్టించిన సంపదను కట్టబెడతామని నిర్ణయానికి వచ్చి ఉంటారు. ఏ ఒక్కరితోనూ చర్చించకుండా అప్పటికే కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన శ్రీకృష్ణ కమిటీ నివేదికను తుంగలో తొక్కి, పూర్తిగా అప్రజాస్వామికంగా అమరావతిని ఏకపక్షంగా రాజధానిగా ప్రకటించారు. విద్యాలయాల పేరుతో ధనాగారాన్ని సృష్టించుకున్న పెద్దమనిషి నారాయణ నేతృత్వంలో కమిటీ వేసి దానితో అమరావతి రాజధాని అని 'మమ' అనిపించారు. అలా అమరావతి చంద్రబాబు ఏకపక్ష నిర్ణయమైంది. ఇందులో ప్రజాస్వామ్య పద్ధతి ఏ కోశానా కనిపించదు.

చంద్రబాబు అయిదేళ్ల పాలనలో ప్రధానిచేత ప్రతిష్టింపజేసిన రాజధాని ఫలకం అలాగే ఉండిపోయి ఆ ఫలకం చుట్టూ పిచ్చిమొక్కలు పెరిగి బాబుగారి సామర్థ్యానికి ప్రతీకగా నిలిచివున్నాయి. ప్రపంచంలోని అయిదు గొప్ప రాజధానులతో సమానంగా అమరావతి నిలిచేటట్టు చేస్తానని ఉత్తర కుమార ప్రగల్భాలు పలికారు బాబు. సింగపూర్ నుంచి రాజధాని నమూనా తయారు చేయించారు. ఆకాశ హర్మ్యాలు, 20, 25 బహుళ అంతస్తులు, ఉద్యానవనాలు, నీటిలో విహారాలు, అద్భుతమైన శిల్పాలమయంగా రాజధానిని రూపొందిస్తున్నామని బాబు చెప్పారు. కానీ ఆ నమూనా చూసిన వారెవరూ ఆనందించలేదు. రాజమౌళి బాహుబలి ఎన్నో రెట్లు మెరుగ్గా అనిపించిందన్నారు వారు. ఇంకేం.. రాజధాని నిర్మాణానికి రాజమౌళిని కూడా రప్పించేశారు. ఐకాన్ బ్రిడ్జిలూ, పగలు రాత్రి తెలియని జాజ్వల్యమానమైన విద్యుత్ వెలుగులతో ప్రజల కళ్లకు గ్రాఫిక్స్‌తో గంతలు కట్టారు.

అదేసమయంలో తన కలల రాజధానికి లక్షకోట్ల రూపాయలు అవసరమవుతాయని బాబు చావుకబురు చల్లగా చెప్పారు. కట్టుబట్టలతో గెంటేశారనీ, అమరావతిలో దాదాపు దిశమొలతో తిరి గామనీ, చివరకు పడుకునే మంచాలు లేక నేలమీదే పడుకున్నామనీ, చెట్లకు వేళ్లాడవలసి వచ్చిందనీ ఒకవైపు దీనంగా అరుస్తూ, మింగమెతుకు లేనివానికి మీసాలకు సంపెంగ నూనె అన్నట్లు ఈ పరిస్థితిలో ఉన్న రాష్ట్రానికి ప్రపంచ స్థాయి, గ్రాఫిక్ రాజధాని అవసరమా అని ఆనాడే మాబోటివాళ్లం చెబితే బాబు గారి అహం దెబ్బ తింది. మన తెలుగు



వారు ప్రపంచ స్థాయి అద్భుత రాజధానికి అర్హులు కారా, మన తెలుగువారి సత్తా చూపించలేమా అంటూ హుంకరించారు. ఇక భూ సమీకరణ మొదలెట్టారు. అదుగో ద్వారక, ఆలమందలవిగో.. యదు సింహుండు వశించు మేడ అదిగో అన్నట్లుగా ప్రజలకు సింగపూర్ డాక్యుమెంట్లు చూపిస్తూ భూసమీకరణకు పురికొల్పారు.

తన సామాజిక వర్గానికి చెందిన మోతుబరులను రప్పించి వారిచేత అమరావతి ప్రాంతంలోని సాధారణ రైతులతో చెప్పించారు. 'మీరు కూడా భూసమీకరణకు భూములిస్తే మాలాగే విలాసవంత జీవితం గడపవచ్చు. భూములిచ్చినవారికి రాజధాని ప్రాంతంలో బహుగిరాకీగా ఉండే వ్యావార, వాణిజ్య ప్రాంతంలో ఎకరానికి 1200 చ.అడుగులను బాబు ఇస్తారని అది కోట్ల విలువ చేస్తుంద'ని ఈ మోతుబరులు నమ్మబలికారు. కొందరు అమాయక రైతులు, అగ్రిగోల్డ్ బాధితులు ఆ మాటలకు నమ్మేశారు. కానీ ఈ రియల్ ఎస్టేట్ వ్యాపారంపై ఆధారపడలేమని, మా సేద్యం మేం చేసుకుంటామని తిరస్కరించిన సన్నకారు రైతులను వేధించారు. బలవంతంగా అయినా సరే భూసేకరణ చేస్తామని అప్పుడు మేం చెబుతున్న ఈ ప్లాట్లు కూడా రావని బెదిరించి వారినుంచి భూములు లాక్కున్నారు. ఎదిరించిన రైతుల భూముల్లో అరటి, పండ్ల తోటలను బాబు అనుయాయులు తగులబెట్టారు.

ఇలాంటి పాశవిక చర్యలన్నింటికీ పూనుకుని రాజధాని పేరుతో 33 వేల ఎకరాలను సేకరించారు. ఇంకా భవిష్యత్ అవసరాలకోసం, రింగ్ రోడ్డులను చూపించి మొత్తం 55 వేల ఎకరాలను బాబు ప్రభుత్వం తన అధీనంలోకి తెచ్చుకుంది. దారుణమైన విషయం ఏమిటంటే ఎస్సీ,ఎస్టీలకు గతంలో వైఎస్సార్ పాలనలో దఖలుపర్చిన భూములను ఎవరూ కొనరాదని చట్టం చేశారు కానీ దానికి కూడా తూట్లు పొడిచిన చంద్రబాబు ఒక కొత్త చట్టం పేరుతో ఆ దళితుల భూములను కూడా కొనవచ్చని తీర్మానించి వాటిని కూడా తనవారిచేత కొనిపించారు. నిజానికి రాజధానికి అంత భూమి అవసరం లేదు. ఆ పేరుతో బడాబాబులు, బాబుగారి సహజ మిత్రులు, ఆయన బంధువులు, బినామీలు, ఇంకా రియల్ ఎస్టేట్ కోసం భూదాహంతో ఉన్నవారు అలాంటి భూబకాసురులకు కట్ట బెట్టేందుకు ఇంకా ఎన్ని వేల ఎకరాలైనా సరిపోవు మరి. ఇదీ వెన్నుపోటు బాబు గారి కలల రాజధాని. ఇలాంటిది వాస్తవంలో రాజధాని కాలేదు.

అయినా రాజధాని నిర్మాణానికి ఈ ఆరు సంవత్సరాల్లో లక్ష కోట్లకుగాను బాబు గారి కలల ప్రభుత్వం ఖర్చు చేసింది 5 వేల కోట్లు. అంటే ఏడాదికి వెయ్యికోట్లు సుమారు ప్రభుత్వం ఖర్చు చేసినట్టు. ఇలా అయితే బాబుగారి కలల రాజధాని నిర్మాణం పూర్తయేందుకు 1000 సంవత్సరాలు పడుతుంది. 2050 నాటికి ప్రపంచ ప్రఖ్యాత విలాసవంతమైన పెద్ద రాజధానిగా అమరావతి నిర్మాణమవుతుందని బాబు చెప్పారు. అయితే బాబుగారు ఏమోగానీ ఆయన వెన్నుపోటు పార్టీలో ఇప్పుడున్న 23 మందిలో ఎంతమంది వచ్చే ఎన్నికల నాటికి ఉంటారన్నది చెప్పలేం. ఏదేమైనా చంద్రబాబు తన పార్టీ ముందుకు పోతుందని నమ్మటం లేదు. అందుకే ఆయన ఆమధ్య వెనక్కు నడవటం ప్రాక్టీస్ చేశారు కదా. నిజంగా రియల్ ఎస్టేట్స్ ద్వారా 100 రెట్లు ఎక్కువగా ఆదాయం పొందవచ్చని ప్లాన్లు చెబితే సాధారణ రైతులు, కౌలు రైతులు చంద్రబాబు మోసానికి గురైనారు. అయినా అమాయకంగా మనం ఇంకా బాబుగారి మాటలు నమ్మగలమా? చంద్రబాబు నయవంచనతో అమరావతిని కేవలం తన ధన దాహానికే వాడుకున్నారు. ఆయన కట్టించిన భవనాల నాణ్యత ప్రశ్నార్థకం అయ్యాయి. నమ్మదగిన ఒక్క అభివృద్ధి కూడా లేదు. అభివృద్ధిపై ఆయన మాటలు నీటి మూటలే. కనుక ఆయనను విశ్వసించడం ఇకనైనా మానుకోమని అమరావతి ప్రాంత ప్రజలకు చెప్పడమే మిగిలింది. మిమ్మల్ని మోసం చేసింది చంద్రబాబే అని చెప్పడమే మిగిలింది.

ఇక ప్రజల మనిషిగా, మనసున్న నేతగా ఎదుగుతున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రతిపాదించిన మూడు రాజధానుల విషయం. ముందు ఆయన శాసనసభలో ప్రసంగిస్తూ తన అభిప్రాయంగా ఆ సంగతిని ప్రస్తావించారు. తగిన రీతిలో రాజధానిపై అధ్యయనం చేశారు. రాజధానిపై ఒక కమిటీ వేసి దాని తుది నివేదికను ప్రజలకు తెలియజేశారు. మంత్రివర్గం కూర్చుని ఆ కమిటీతో చర్చించి దానిపై వారు ఒక నిర్ణయానికి వచ్చిన తరువాత అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేస్తారు. రాజధాని నిర్ణయం చర్చకు వస్తుంది. రెండు రాజధానులా, మూడు రాజధానులా అని ఇప్పుడు కొందరు ప్రశ్నిస్తున్నారు. కానీ, ఆంధ్రప్రదేశ్ సమగ్ర అభివృద్ధి ముఖ్యం. అభివృద్ధి ఫలాలు అన్ని ప్రాంతాలకూ అందాలి. మూడు రాజధానులు అభివృద్ధి అయితే మంచిదే కదా. సామాజిక రాజకీయ వ్యవహారాల్లో ఎంతోకొంత అనుభవం ఉన్న సినీ నటుడు చిరంజీవి సైతం జగన్ మూడు రాజధానుల ప్రస్తావనను సమర్థిస్తున్నారు. జగన్ ప్రజానుకూల పాలనపై నమ్మకం ఉందన్నారు. అదే సమయంలో రైతులకు న్యాయం జరగాలని సూచించారు. ఆ సూచన ఆచరణీయమేనని వైఎస్సార్‌సీపీ నేత పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి రైతులకు న్యాయమైన పరిహారం చెల్లిస్తామన్నారు. అన్నింటినీ మించి చంద్రబాబు కంటే జగన్‌పై అత్యధిక ప్రజలలో విశ్వసనీయత ఉంది. వైఎస్ జగన్ ప్రతిపాదిస్తున్న రాజధాని ప్రగతికి సంబంధించినది కాగా, బాబు ప్రతిపాదించిన రాజధాని కలల రాజధాని మాత్రమే!

వ్యాసకర్త మార్క్సిస్టు విశ్లేషకులు । మొబైల్ : 98480 69720

---

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!





### విభిన్నం



"భారతదేశ సంక్లిష్ట రాజకీయాలు ఆయనలోని కవిని ఏ దశలోనూ కఠినాత్ముడిని కానీయలేదు. అలాగని ఆయన కవిత్వం ఆయనలోని రాజకీయ నాయకుణ్ణి మృదువైన నేతగా కూడా మార్చలేదు. కానీ ఆయనలోని రాజకీయ నాయకుడు, కవి మాత్రం తరచుగా తీవ్ర ఘర్షణకు లోనయ్యేవారు. ఈ ఘర్షణే స్వర్గీయ అటల్ బిహారీ వాజ్‌పేయిని భారతీయ జనతా పార్టీలోని ఇతర నేతలతో పోలిస్తే విభిన్నంగా నిలిపింది. అటల్ జయంతి సందర్భంగా ఆయనకు నా నివాళులు"

– పవన్ ఖేరా, కాంగ్రెస్ నాయకుడు

### మాట్లాడరేం?!



"మహారాష్ట్ర ముఖ్యమంత్రి ఉద్ధవ్ ఠాక్రేపై నేను చేసిన వ్యాఖ్యకు ఆగ్రహించి నాపై శివసేన గూండాలు దాడి చేశారు. భారతీయ జనతా పార్టీ అభిమానిని కాబట్టి ఉదారవాదులెవరూ నాపై జరిగిన దాడి గురించి మాట్లాడదల్చుకోలేదా? భారతదేశ పౌరుడిగా నాకు ఈ మాత్రం భావ ప్రకటనా స్వేచ్ఛ లేదా?"

– హిరామణి తివారీ, బీజేపీ కార్యకర్త

### జాగ్రత్త!



"ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ కొనసాగిస్తున్న 'బదలా' రాజకీయాలు అంతిమంగా ఒక్క ఉత్తరప్రదేశ్‌ను మాత్రమే కాదు...యావత్ దేశాన్నే ధ్వంసం చేస్తాయి. ఆయనలాంటి రాజకీయ నాయకుల చేతుల్లో ప్రతీకారం అనేది సామాన్య ప్రజలపై అతి క్రూరమైన, ప్రాణాంతకమైన ఆయుధమవుతుంది"

– ప్రీతిష్ నంది, రచయిత, పెయింటర్


### ఏమైంది?



"యూపీఏ హయాంలో కేంద్ర హోంమంత్రిగా పనిచేసిన చిదంబరం అప్పట్లో జాతీయ జనాభా పట్టిక(ఎన్‌పీఆర్) కసరత్తు గురించి ఘనంగా చెప్పారు. మానవాళి చరిత్రలో తొలిసారి పౌరుల్ని గుర్తించి, లెక్కేసి, రికార్డులకెక్కించి దేశంలోని 120 కోట్లమందికి గుర్తింపు కార్డులివ్వబోతున్నామని ప్రకటించారు. మరి ఇప్పుడేమైంది?"

– అమిత్ మాలవీయ, బీజేపీ నేత

### రంకెలు



"రాజధాని వికేంద్రీకరణను వ్యతిరేకించి తూర్పు ప్రజలకు ఆగ్రహం తెప్పించొద్దు యనమల రామకృష్ణుడు గారూ! మిమ్మల్ని తుని ప్రజలు తరిమేశారన్న అక్కసుతో విశాఖపట్నంని వద్దని రంకెలేయడం న్యాయం కాదు. అయినా దీనికి మీ అనుమతి అవసరం లేదు. ప్రజల ఆశీస్సులున్నాయి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గారికి"

– విజయసాయిరెడ్డి, వైఎస్సార్‌సీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి

### సిగ్గుందా?




"సీఏఏ, ఎన్‌సీఆర్‌లకు అనుకూలంగా భారతీయ అమెరికన్లు ర్యాలీ నిర్వహించారని తెలిసి బిత్తరపోయాను. మీవంటివారిని పౌరులుగా అంగీకరించిన ఆ దేశానికి కృతజ్ఞులుగా ఉండండి. మీరంతా కాస్తయినా సిగ్గుపడండి"

– ప్రదీప్ మేగజైన్, మానవతావాది

---

# కొత్తమలుపులో శివసేన రాజకీయం

సందర్భం




పెంటపాటి పుల్లారావు

బాల్ థాక్రే 1966లో శివసేనను స్థాపించి మహారాష్ట్రలో దాన్ని ఒక గొప్పశక్తిగా మలిచారు. బొంబాయి దేశ ఆర్థిక రాజధానిగా ఉండటంతో ఈ పరిణామం భారత రాజకీయాలపై కూడా ప్రభావితం చూపింది. బాల్‌థాక్రే బలంగా ఒక విషయాన్ని నమ్మేవారు. థాక్రే కుటుంబంలో ఏ ఒక్క సభ్యుడు కూడా ఎన్నికల్లో ఎన్నటికీ పోటీ చేయరు అన్నదే ఆ నమ్మకం. బాల్‌థాక్రే జీవించి ఉన్నంతవరకు శివసేన ఆ నియమాన్ని గౌరవించింది. నిజానికి ఆయన పెద్ద కోడలు అప్పట్లోనే బాంబే మేయర్ కావాలని కోరుకున్నారు. కానీ బాల్‌థాక్రే ఆమె అభ్యర్థనను తిరస్కరించారు. దీంతో ఆయన పెద్దకుమారుడు ఇంట్లోంచి వెళ్లిపోయారు. థాక్రే మరణం తర్వాత ఉద్ధవ్‌థాక్రే ఆ నియమాన్ని బద్దలు చేశారు. ఇప్పుడు ముఖ్యమంత్రి కావడం ద్వారా ఉద్ధవ్‌థాక్రే తండ్రి అంతరాల్లోంచి వచ్చిన ఆ నిబంధనను ఉల్లంఘించారు.

తన కుటుంబంలో ఎవరూ ఎన్నికల్లో పాల్గొనకూడదని చెప్పడంలో బాల్‌థాక్రే తర్కం చాలా సులువైనది. వ్యక్తిగత వైభవం కోసం లేదా పదవికోసం, తన కుటుంబం రాజకీయాల్లో పాల్గొంటోందని ప్రజలు తమ గురించి అనుకోకూడదని థాక్రే భావించేవారు. శివసేన అంటే 80 శాతం సామాజిక సేవ, 20 శాతం రాజకీయాలు అని పదే పదే చెప్పేవారు. ఆయన గొప్ప చింతనాపరుడు. ఒక నాయకుడు ఎన్నికల్లో పాల్గొంటున్నప్పుడు అతడు ప్రజలవద్దకు వెళ్లి ఓట్ల కోసం అడుక్కోవాలని, అలాంటి వైఖరి శివసేనను దెబ్బతీస్తుందని థాక్రే చెప్పేవారు. ఎందుకంటే శివసేన విభిన్నమైన పార్టీ అని థాక్రే విశ్వాసం. కాబట్టి మహారాష్ట్రలో ఇప్పుడు రెండు పరిణామాలు చోటు చేసుకోబోతున్నాయి. శివసేన పూర్తిగా సాధారణ రాజకీయ పార్టీగా మారవచ్చు లేదా అది పతనం కావచ్చు. థాక్రే గొప్ప నియమం బద్దలైపోయింది. శివసేన ప్రస్తుత పాత్రను గుర్తిస్తున్నప్పుడు ఈ అంశాన్ని మనసులో ఉంచుకోవాల్సిందే.

ఒక శివసైనికుడు మహారాష్ట్ర ముఖ్యమంత్రి కావాలన్నది బాల్ థాక్రే చివరి కోరిక అని శివసేన నేత సంజయ్ రౌత్ ఇప్పుడు చెబుతున్నారు. కానీ తన కుటుంబ సభ్యుడొకరు సీఎం కావాలని థాక్రే ఎన్నడూ భావించలేదు. ఈ వాస్తవం ప్రస్తుత శివసేన నాయకత్వాన్ని విచ్చిన్న పరుస్తుంది. బాల్‌థాక్రే రాజరికపాలనపై, కాంగ్రెస్ పార్టీపై పదే పదే దాడిచేసేవారు. రాజరికపాలన క్రమక్రమంగా అంతరించిపోతుందని థాక్రే చెప్పేవారు. శివసేన మిలిటెంట్ పార్టీగానే తప్ప అధికారంపై ఆసక్తి లేకపోవడాన్ని కొనసాగించాలని ఆయన హెచ్చరించేవారు. 1994లో తొలిసారిగా మహారాష్ట్రలో శివసేన అధికారంలోకి వచ్చినప్పుడు బాల్ థాక్రే ముఖ్యమంత్రి అవుతారని అందరూ భావించారు. కానీ మనోహర్ జోషిని సీఎంగా నియమించిన థాక్రే తాను మనోహర్ జోషీ రిమోట్ కంట్రోల్‌గా ఉంటానని బహిరంగంగా చెప్పారు. శివసేన ప్రస్తుత స్థితిని అంచనా వేసేటప్పుడు ఈ నేపథ్యాన్ని తప్పక గుర్తుంచుకోవాలి.

ఉద్ధవ్ థాక్రే దివంగత బాల్‌థాక్రే మూడవ కుమారుడు. మహారాష్ట్ర ప్రస్తుత ముఖ్యమంత్రిగా ఎన్నికయ్యారు. ఎన్నికల ముందు పొత్తు కుదుర్చుకున్న బీజేపీని తుంగలో తొక్కి మరీ సీఎం అయ్యారు. భారత రాజకీయాల్లో ఇలాంటి ఘటన ఎన్నడూ జరగలేదు. అయితే శివసేన నైతికతపై చర్చించటం కంటే అధికారం చేజిక్కించుకోవడం ద్వారా శివసేన ఎదుర్కోనున్న బలమైన సవాళ్లను అంచనా వేయడం అవసరం అని నా భావన. శివసేన ఒక పార్టీగా



1999 నుంచి పతనమవుతూ వస్తోంది. బీజేపీ–శివసేన పొత్తులో ప్రధాన భాగస్వామిగా ఉంటున్న స్థితి నుంచి సేన జూనియర్ భాగస్వామిగా పడిపోయింది. తన ఈ పతనానికి బీజేపీనే వేలెత్తి చూపుతున్న శివసేన తన నాయకత్వ శైలిగురించి ప్రశ్నించుకోవడం లేదు. మహారాష్ట్ర శాసనసభలోని 288 సీట్లలో 124 స్థానాల్లో పోటీ చేసిన శివసేన కేవలం 58 సీట్లను గెల్చుకుంది. మిగిలిన 164 సీట్లలో పోటీ చేసిన బీజేపీ 105 మంది ఎమ్మెల్యేలను గెలిపించుకోగలిగింది. ఈ లెక్కలకు సంబంధించిన తేడాను ఉపయోగించుకున్న శివసేన.. బీజేపీని విడిచి, ఎన్సీపీ, కాంగ్రెస్ పార్టీలతో పొత్తు కుదుర్చుకుని ప్రభుత్వాన్ని ఏర్పర్చింది.

థాక్రే కుటుంబానికి చెందిన వ్యక్తి ముఖ్యమంత్రి అయితే శివసేనకు కలిగే ప్రయోజనాలు ఏమిటి? ప్రధానంగా మహారాష్ట్రలోని కొన్ని జిల్లాల్లో మాత్రమే ఉనికిలో ఉన్న పార్టీగా పతనమైన శివసేన ముఖ్యమంత్రి పదవి ద్వారా పోయిన బలాన్ని తిరిగి పొందవచ్చని ఆశిస్తోంది. సీఎంగా ఉద్ధవ్ ప్రతిచోటా ఆదేశించే స్థాయిలో ఉంటారు కాబట్టి ఇతర పార్టీల్లోని నేతలను, కార్యకర్తలను కూడా పార్టీలోకి ఆకర్షించవచ్చు. ఉనికిలేని ప్రాంతాల్లో కూడా పార్టీని బలోపేతం చేసుకోవచ్చు. తాను కోల్పోయిన గౌరవాన్ని ముఖ్యమంత్రి పదవి ద్వారా తిరిగి పొందవచ్చని, పార్టీ నాయకులు, కార్యకర్తలు మునుపటిలా పార్టీని వదలకపోవచ్చని థాక్రే కుటుంబం ఆశిస్తోంది. అధికారం దన్నుతో పునర్వైభవాన్ని పొందవచ్చన్నది వీరి ఆశ. ఇప్పుడు కాంగ్రెస్–ఎన్సీపీ కూటమి నుంచి మద్దతు ద్వారా బాంబే కార్పొరేషన్‌లో ఆధిక్యత సాధించవచ్చని శివసేన నాయకత్వం భావిస్తోంది. 2019లో కంటే 2024 ఎన్నికల్లో మరిన్ని అసెంబ్లీ స్థానాలను కైవసం చేసుకునే అవకాశాన్ని కూడా ముఖ్యమంత్రి పదవిద్వారా పొందవచ్చు.

శివసేన గత ముఖ్యమంతి నారాయణ్ రానేతో సహా ఇతర పార్టీల్లోకి వెళ్లిన శివసైనికులను అధికార బలంతో తిరిగి ఆకర్షించడమో లేక ప్రతీకారంతో దెబ్బతీయడానికి సీఎం పదవి ఆస్కారం ఇవ్వనుంది. అలాగే చక్కెర ఫ్యాక్టరీలలో, కో ఆపరేటివ్స్‌లో వాటాను పెంచుకోవచ్చు. పైగా శివసేనకు జాతీయ స్థాయిలో ప్రతిష్ట కూడా పెరగనుంది. దేశంలో అతి పెద్ద రాష్ట్రం, దేశ ఆర్థిక రాజధానిని కలిగిన మహారాష్ట్రపై పట్టు సాధించడం ద్వారా జాతీయ రాజకీయాలను శాసించవచ్చని శివసేన అంచనా. ముఖ్యమంత్రిగా ఉద్ధవ్ థాకరే మంచి పాలనను అందిస్తే, సమర్థతను నిరూపిస్తే భవిష్యత్తులో తాను గొప్ప రాజకీయవేత్తగా కావచ్చు. 1999 నుంచి 2014 వరకు 15 సంవత్సరాలపాటు కాంగ్రెస్, ఎన్సీపీ కూటమి అనుభవించిన అధికారాన్ని శివసేన సమర్థపాలన ద్వారా అందుకోవచ్చు.

అన్నిటికంటే మించి మహారాష్ట్రలో వైఫల్యం నుంచి బీజేపీ గుణపాఠం తీసుకుని దిద్దుబాట పట్టకపోతే వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి ప్రధాని కావడానికి నరేంద్ర మోదీ చిక్కు సమస్యలు ఎదుర్కోవచ్చు. మహారాష్ట్రను కోల్పోవడం భారీ నష్టమని బీజేపీకి అర్థమైంది. మహారాష్ట్రలో అధికార పగ్గాలు తిరిగి చేపట్టడానికి మోదీ, అమిత్ షాలు పథకాలు ఏమేరకు ఫలిస్తాయన్న అంశంపైనే శివసేన భవిష్యత్తు, ప్రస్తుత అధికార పొత్తు భవిష్యత్తు ఆధారపడి ఉన్నాయి.

వ్యాసకర్త ప్రముఖ రాజకీయ విశ్లేషకులు

# తూరుపు గాలులు





చరిత్రను ఆసక్తికరంగా చెప్పడానికి కథన మార్గాన్ని ఎంచుకున్న కథారచయిత ఉణుదుర్తి సుధాకర్ తాజాగా 13 కథలతో వెలువరించిన 'తూరుపు గాలులు' సంకలనంలో ఏడు కథలు ప్రధానంగా చరిత్ర నేపథ్యంగా సాగుతాయి. 'మూడు కోణాలు' కథలోని చివరి కోణం దుంబ్రి ఉండే ప్రాంతాల్లో చాలాకాలం తర్వాతే అయినా, మొదలైన కదలిక–ఇతర ప్రాంతాల్లో వచ్చిన 'కదలిక'లాంటిది కాదు. సమూల మార్పులను ఆశించే కదలిక, నవరజాతినే కాదు ప్రపంచాన్నే మార్చేసే కదలిక. అటువంటి 'కదలిక'లను అడ్డుకోవడానికే ప్రభుత్వం ఇప్పటికీ నెత్తుటి ఏరులు పారిస్తోంది. సర్ ఆర్థర్ కాటన్ అంతటి వాడు తళుక్కున మెరవడం 'ఒక వీడ్కోలు సాయంత్రం'కు ఎంతో అందం తీసుకొచ్చింది. ఒక సాంకేతిక మార్పు మరొకరి పాలిట యమపాశం ఎలా అవుతుందో 'వార్తాహరులు'లో; న్యాయ వ్యవస్థ, పోలీసు వ్యవస్థ శతాబ్దాల క్రితమే కుళ్లిపోయిన తీరును 'తెగిన నూలు పోగు'లో;





ఎన్‌కౌంటర్ అనే మాట పుట్టుక, దాన్ని అమలు చేయడంలో పోలీస్ అధికారులు వ్యవహరించే తీరును 'ఏడు కానాల వంతెన'లో; పతనమవుతున్న జమీందారి వ్యవస్థ, ప్రాణం పోసుకున్న దళారి వ్యవస్థ రూపాన్ని 'చేపకనుల రాజకుమారి'లో చెప్పిన తీరు ఆలోచింపజేస్తుంది. ఇక చాలామందికి చాలానచ్చిన చివరి కథ 'తూరుపు గాలులు'లో బౌద్ధం ఉత్థాన పతనాలను వివరించారు. చారిత్రక నేపథ్యంలో సాగే ఈ కథలు కాకుండా ఇందులో మరో ఆరు కథలున్నాయి. 'శాస్త్రి 'మనం'లో కాకుండా, కన్నయ్య 'మీరు'లో వుంటూ దక్కించుకొనేదే విలువైనది' అని చెప్పడం ద్వారా రచయిత తాను ఏ పక్షమో తేటతెల్లం చేశారు. చారెడంత చరిత్రను ఛాయ్ సిప్ లాంటి ట్విస్ట్‌లతో పాఠకులను అబ్బురపరిచారు. మరిన్ని చారిత్రక సత్యాలను తన కథల ద్వారా వెలుగులోకి తెస్తారని ఆశిద్దాం.

– దేశరాజు

వెల: 180, ప్రతులకు: స్టాల్ నెం. 275, హైదరాబాద్ బుక్ ఫెయిర్

మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్న యెడల టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ. 7.00 గం.ల నుండి రా. 8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగు చర్యలు తీసుకోబడును. టోల్ ఫ్రీ నం: 1800 425 9899

# అలసి విశ్రమించిన అలలు

చుక్క పెడితే సమాప్తం అని కాదు.
ఆఖరి చరణం పాడితే అది చరమ గీతం కాదు.
'కట్' అంటే ప్యాకప్ కాదు.
ముకుళిత హస్తాలకు అర్థం ఇక సెలవని కాదు.
అంతమే లేని వాటికి మధ్య మధ్య విరామాలు,
ఆగి అలుపు తీర్చుకుంటున్న అలలు.
ఈ ఏడాది సాహిత్య, సంగీత, సినీ, రాజకీయ,
ఆధ్యాత్మిక రంగాలలోని కొందరు
సుప్రసిద్ధ మహిళల్ని కోల్పోయాం.
వాళ్లు లేని లోటు తీరనిదే అయినా,
వాళ్లు మిగిల్చి వెళ్లినది తరగనిది.

### కృష్ణాసోబ్తి, రచయిత్రి



ప్రముఖ హిందీ రచయిత్రి, జ్ఞానపీఠ్, సాహిత్య అకాడమీ పురస్కారాల గ్రహీత అయిన కృష్ణా సోబ్తీ(93) ఢిల్లీలో జనవరి 25న కన్నుమూశారు. కృష్ణాసోబ్తీ రచించిన 'మిత్రో మర్జానీ' భారత సాహిత్యంలో నూతన శైలిని ప్రతిబింబిస్తుందని సాహితీ ప్రియులు అంటారు. కృష్ణాసోబ్తీ 2010 లో 'పద్మభూషణ్' పురస్కారాన్ని తిరస్కరించి వార్తల్లో నిలిచారు. ఒక సృజనశీలిగా ప్రభుత్వ గుర్తింపులకు దూరంగా ఉండాలన్నది తన ఉద్దేశమని ఆ సందర్భంగా ఆమె అన్నారు.

### వింజమూరి అనసూయాదేవి, గాయని



ప్రముఖ జానపద, శాస్త్రీయ లలిత సంగీత గాయని, ప్రఖ్యాత కవి దేవులపల్లి కృష్ణశాస్త్రి మేనకోడలు వింజమూరి అనసూయాదేవి (99) అమెరికాలోని హ్యూస్టన్‌లో మార్చి 24 న తుదిశ్వాస విడిచారు. ఆంధ్రప్రదేశ్‌లోని తూర్పుగోదావరి జిల్లా కాకినాడలో 1920 మే 12న జన్మించిన అనసూయాదేవి ఆలిండియా రేడియో ద్వారా జానపద గీతాలకు ఎనలేని ప్రాచుర్యం కల్పించారు. దేవులపల్లి కృష్ణశాస్త్రి రాసిన దేశభక్తి గీతం 'జయజయ జయ ప్రియ భారత' పాటకు బాణీ కట్టింది అనసూయాదేవే.

### విజయనిర్మల, సినీ నటి



ప్రముఖ నటి, దర్శకురాలు, సినీ నటుడు కృష్ణ సతీమణి ఘట్టమనేని విజయనిర్మల (73) జూన్ 26న తుదిశ్వాస విడిచారు. 1946 ఫిబ్రవరి 20న గుంటూరు జిల్లా నరసరావుపేటలో విజయనిర్మల జన్మించారు. పాండురంగ మహత్యం సినిమాతో చిత్రరంగంలో ప్రవేశించారు. 1971లో తొలిసారి దర్శకత్వ బాధ్యతలు చేపట్టారు. ఆమె అసలు పేరు నిర్మల కాగా.. తనకు సినీరంగంలో తొలి అవకాశమిచ్చిన విజయా స్టూడియోకు కృతజ్ఞతగా విజయనిర్మల అని పేరు మార్చుకున్నారు.

### షీలా దీక్షిత్, మాజీ ముఖ్యమంత్రి



ఢిల్లీ మాజీ ముఖ్యమంత్రి, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత షీలా దీక్షిత్ (81) జూలై 20న కన్నుమూశారు. పంజాబ్‌లోని కపుర్తలాలో 1938 మార్చి 31వ తేదీన షీలా కపూర్ (షీలా దీక్షిత్) జన్మించారు. 1984–89 సంవత్సరాల మధ్య ఐక్యరాజ్య సమితిలో భారత్ రాయబారిగా షీలా సేవలందించించారు. రాజీవ్ హయాంలో కేంద్ర మంత్రిగా పనిచేశారు. 1998 నుంచి వరసగా మూడు ఎన్నికల్లో ఢిల్లీ ముఖ్యమంత్రిగా ఎన్నికై తిరుగులేని నేతగా ఎదిగారు. 2014లో కేరళ గవర్నర్‌గా అయిదు నెలలు కొనసాగారు.

### మాంటిస్సోరి కోటేశ్వరమ్మ, విద్యాసంస్థల వ్యవస్థాపకురాలు



విజయవాడ మాంటిస్సోరి విద్యా సంస్థల వ్యవస్థాపకురాలు, అభ్యుదయవాది, స్త్రీ విద్య, మహిళా సాధికారతకు విశేష కృషి చేసిన డాక్టర్ వి.కోటేశ్వరమ్మ(94) జూన్ 30న విజయవాడలో కన్ను మూశారు. విజయవాడ సమీపంలోని గోశాలలో కోనేరు వెంకయ్య, మీనాక్షి దంపతులకు 1925 మార్చి 5న కోటేశ్వరమ్మ జన్మించారు. తెలుగు సాహిత్యంలో డాక్టరేట్ చేసి నెల్లూరు, విజయవాడల్లో ఉపాధ్యాయురాలిగా పనిచేశారు. మహిళలు చదువుకుంటేనే పురుషులతో సమానంగా రాణిస్తారన్న నమ్మకంతో 1955లో చిల్డ్రన్స్ మాంటిస్సోరి స్కూళ్లను స్థాపించారు.

### ఛాయాదేవి, సాహితీవేత్త



ప్రముఖ సాహితీవేత్త, కథా రచయిత్రి అబ్బూరి ఛాయాదేవి (85) జూన్ 28న హైదరాబాద్ లోని చంద్ర రాజేశ్వర్‌రావు వృద్ధాశ్రమంలో కన్నుమూశారు. గతంలో ఆమె కోరిన మేరకు ఆమె భౌతిక కాయాన్ని ఈఎస్‌ఐ వైద్య కళాశాలకు అప్పగించారు. అలాగే కళ్లను ఎల్వీ ప్రసాద్ వైద్యులు సేకరించారు. 1933 అక్టోబర్ 13న రాజమండ్రిలో మద్దాల వెంకటాచలం, రమణమ్మ దంపతులకు ఛాయదేవి జన్మించారు. ప్రముఖ రచయిత, విమర్శకుడు, అధికార భాషా సంఘం మాజీ అధ్యక్షుడు అబ్బూరి వరదరాజేశ్వరరావు ఆమె భర్త. ఆయన చాలా కాలం క్రితమే చనిపోయారు. ఛాయాదేవి ఎన్నో కథలు రాశారు. బోన్‌సాయ్ బ్రతుకు అనే కథని 2000 సంవత్సరంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 10వ తరగతి తెలుగు వాచకంలో పెట్టింది. ఆమె రాసిన 'తన మార్గం' కథా సంపుటికి 2005 లో కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కారం లభించింది. స్త్రీల జీవితాల్లోని దృక్కోణాలను తన కథల్లో ఛాయాదేవి ఆవిష్కరించారు.

### కాంచన్ చౌదరి, తొలి మహిళా డీజీపీ



కాంచన్ చౌదరి భట్టాచార్య (72) ఆగస్టు 26న ముంబైలో కన్నుమూశారు. 1973 ఐపీఎస్ బ్యాచ్ అధికారి అయిన కాంచన్ దేశంలో తొలి మహిళా డీజీపీగా చరిత్ర సృష్టించారు. కిరణ్ బేడీ తరువాత దేశంలో రెండో మహిళా ఐపీఎస్ అధికారిగా నిలిచారు. హిమాచల్ ప్రదేశ్‌లో జన్మించిన కాంచన్ 2004 నుంచి 2007 అక్టోబర్ 31 వరకు ఉత్తరాఖండ్ డీజీపీగా పని చేశారు. సీఐఎస్ఎఫ్ అధిపతిగానూ పనిచేశారు.

### సుష్మా స్వరాజ్, కేంద్ర మాజీమంత్రి



బీజేపీ సీనియర్ నేత, కేంద్ర మాజీ మంత్రి సుష్మాస్వరాజ్ (67) ఆగస్టు 6న కన్ను మూశారు. 1952 ఫిబ్రవరి 14న హరియాణాలోని అంబాలాలో సుష్మ జన్మించారు. పంజాబ్ యూనివర్సిటీ నుంచి న్యాయవిద్య ముగించారు. 1975 జూలై 13న స్వరాజ్ కౌశల్‌ను వివాహమాడారు. కొన్నాళ్లు సుప్రీంకోర్టు న్యాయవాదిగా పనిచేశారు. 1977లో తొలిసారి ఎమ్మెల్యేగా ఎన్నికైన సుష్మ 1998లో ఢిల్లీ సీఎం అయ్యారు. 1996లో కేంద్ర సమాచార ప్రసార శాఖ మంత్రిగా ఉన్నారు.

### గీతాంజలి, నటి



ప్రముఖ నటి గీతాంజలి (72) అక్టోబర్ 31న కన్నుమూశారు. 1947లో కాకినాడలో జన్మించిన గీతాంజలి అసలు పేరు మణి. 1961లో 'సీతారామ కల్యాణం'తో కథానాయికగా పరిచయమయ్యారు. తెలుగుతో పాటు తమిళ, మలయాళం, హిందీ భాషలన్నిటిలో కలిపి 300 కు పైగా చిత్రాల్లో నటించారు. దేవత, సంబరాల రాంబాబు, పంతాలు పట్టింపులు, శ్రీకృష్ణ పాండవీయం, పొట్టి ప్లీడరు, తోడు నీడ వంటి చిత్రాలు గీతాంజలికి మంచి గుర్తింపును తెచ్చాయి.

### నానమ్మాళ్, యోగా శిక్షకురాలు



తమిళనాడులోని కోయంబత్తూరుకు చెందిన యోగా శిక్షకురాలు, పద్మశ్రీ పురస్కార గ్రహీత వి. నానమ్మాళ్ (99) అక్టోబర్ 26న కన్నుమూశారు. నానమ్మాళ్ కోయంబత్తూరు జిల్లా పొళ్లాచ్చి సమీపంలో ఉన్న జమీన్ కాళియపురంలో 1920లో రైతు కుటుంబంలో జన్మించారు. తాత మన్నర్‌స్వామి వద్ద యోగా శిక్షణ తీసుకున్న ఆమె.. చనిపోయే వరకు కఠినమైన యోగాసనాలు వేశారు. నానమ్మాళ్ వద్ద శిక్షణ పొందిన 600 మంది ప్రపంచవ్యాప్తంగా యోగా శిక్షకులుగా పనిచేస్తున్నారు. వీరిలో 36 మంది ఆమె కుటుంబసభ్యులే ఉన్నారు. నానమ్మాళ్‌ను కేంద్ర ప్రభుత్వం 2018లో పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది.





క్రిస్మస్ స్టార్స్ - లోపలి పేజీలో

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
గురువారం ॥ 26-12-2019



మరో మూడు నెలల్లో రెండేళ్లు – సినిమా పేజీలో


# అర్థం కాని కొడుకు



ప్రతీకాత్మక చిత్రం

**భార్య చనిపోతే ఆ భర్తకు భార్యను వెతుకుతుంది సమాజం.**
**అయితే ఆ భార్య అతని కొడుకుకు తల్లి కాగలదా?**
**ఆ కొడుకు ఆమెను తల్లిగా స్వీకరిస్తాడా?**
**చాలా సున్నితమైన అంశాలు.**
**సదుద్దేశాలతో ఇటువంటి వివాహాల్లో ప్రవేశించే స్త్రీలకు**
**మనోవ్యథ మిగిలితే?**
**ఏం చేయాలి?**

ఆమెను చూస్తే సైకియాట్రిస్ట్‌కు ఆందోళనగా అనిపించింది. చాలాఏళ్లుగా మనోవ్యథ భరించి భరించి పూర్తిగా కుంగిపోయిన స్త్రీలా ఉందామె. ఆమెకు జీవితం మీద ఆశ లేదు. జీవితంలో సంతోషం ఉంటుందనీ తెలియదు. చూపించిన ప్రేమ, ఆప్యాయతలకు ఫలితం ఇంత చేదుగా ఉంటుందని ఊహించక కుదేలై ఉంది.

'నేనొక దురదృష్టవంతురాలైన మారుతల్లిని డాక్టర్' అందామె.

•••

సమత వయసు ఇప్పుడు 28 సంవత్సరాలు. కాని ఇంకో పది ఎక్కువ ఉన్నట్టుగా కనిపిస్తుంది. జుట్టు పలుచబడింది. కళ్ల కింద నీడలు. పలుచబడ్డ శరీరం. మెల్లగా ఉన్న కదలికలు. కాని పదేళ్ల క్రితం ఆమె ఇలా లేదు. ఎంతో ఉత్సాహంగా ఉండేది. సాటి మనుషుల పట్ల దయగా ఉండేది. తోటి మనుషుల ఆనందంలో తుళ్లిపడేది. ఆ సమయంలో ఆమె వయసు 18 సంవత్సరాలు. హైదరాబాద్‌లో బిటెక్ ఫస్ట్ ఇయర్ చదువుతుండేది. చదువు గురించిన ఆలోచనలు తప్ప జీవితపు ఆలోచనలు లేవు. కాని ఆ ఆలోచనలు చేయాల్సి వచ్చింది. ఒకరోజు ఆమె తండ్రి గుంటూరు నుంచి కలవడానికి హాస్టల్‌కు వచ్చాడు.

'ఎలా చదువుతున్నావమ్మా?'

'బాగా చదువుతున్నాను నాన్నా'

తండ్రి కాసేపు ఆలోచనలో ఉన్నవాడిలా కనిపించాడు.

'రోహిత్ గురించి ఎప్పుడన్నా ఆలోచిస్తున్నావా అమ్మా'

రోహిత్ పేరు తలువగానే సమత మనసు బెంగతో నిండిపోయింది. రోహిత్ ఆమె అక్క కొడుకు. ఎనిమిది సంవత్సరాల పిల్లవాడు. సమత అక్క భాను రెండేళ్ల క్రితం కేన్సర్‌తో కన్ను మూసింది. ఆమె బావ సుధీర్ జంషడ్‌పూర్‌లో పని చేస్తున్నాడు. చాలా మంచివాడు. భార్య చనిపోయాక చాలా నిబ్బరంగా పిల్లవాడిని చూసుకుంటూ అక్కడే ఉండిపోయాడు. రెండేళ్ల కాలం అతనిలో చాలా మార్పే తెచ్చింది. ఒంటరి జీవితం, చిన్న పిల్లవాడు... అతన్ని గంభీరంగా మార్చాయి. ఎప్పుడైనా గుంటూరు వచ్చినా రెండు మూడు రోజులు ఉండి వెళ్లిపోయేవాడు. ఆ రెండు మూడు రోజుల్లో రోహిత్ ఏ ప్రవర్తనలో ఉండాలో తెలియక కొత్తగా ఉండేవాడు.

'మీ బావను ఇంకో పెళ్లి చేసుకోమంటే చేసుకోవడం లేదమ్మా' అన్నాడు తండ్రి.

సమత ఈ సంభాషణ ఎక్కడకు వెళుతోందో అర్థం చేసుకుంది.

'నీ ఆలోచన ఏమిటమ్మా?' అడిగాడు.

'నాన్నా... బావ మంచివాడు. రోహిత్ మన పిల్లవాడు. నాకు వారిద్దరంటే జాలి, ప్రేమ ఉన్నాయి. కానీ...'

'కానీ అంటే లాభం లేదమ్మా. నువ్వు పెద్ద మనసు చేసుకోవాలి. వేరే స్త్రీ అయితే రోహిత్‌కు పూర్తిగా తల్లిప్రేమ చూపించకపోవచ్చు. నువ్వైతే నీ అక్క కొడుకే కాబట్టి నీ పిల్లాడిగా చూసుకుంటావు'

సమత మౌనంగా ఉండిపోయింది.

•••

'మావయ్యా... అలాంటి ఆలోచనలు చేయొద్దు. సమత చిన్నపిల్ల. చాలా భవిష్యత్తు ఉంది. నేను పెళ్లి చేసుకోలేను' అన్నాడు ఫోన్‌లో సుధీర్.

'లేదు బాబూ... ఇలా ఎక్కువ రోజులు ఉంటే నీ ఆరోగ్యానికే ప్రమాదం. బాబు ఎదుగుదలకు కష్టం' అన్నాడు సమత తండ్రి.

'ఈ పెళ్లి సమతకు ఇష్టమేనా?'

'తనకు పూర్తి సమ్మతమే' అన్నాడు తండ్రి.

పెళ్లి జరిగిపోయింది.

•••

సుధీర్‌ది పెద్ద ఉద్యోగం. మనిషి యావరేజ్‌గా ఉంటాడు. పెళ్లి చేసుకోవడమే లేట్‌గా చేసుకున్నాడు. వీటన్నింటి కారణాన అతనికీ సమతకు దాదాపు 14 ఏళ్ల గ్యాప్ ఉంది. ఇంత గ్యాప్ ఉన్నప్పటికీ ఎంతో సహృదయంతో తన కోసం, పిల్లాడి కోసం సమత చేసిన త్యాగానికి అతడి మనసు కృతజ్ఞతతో నిండిపోయింది. సమతను ఎంతో బాగా చూసుకోవడం మొదలెట్టాడు. అంతవరకూ రోహిత్‌ను నిమిషం కూడా వదలకుండా అంటిపెట్టుకుని ఉండే అతడు కొంచెం రిలాక్స్ అయ్యాడు. ఇంకా చెప్పాలంటే రోహిత్ బాధ్యత పూర్తిగా సమతకే అప్పజెప్పాడు. కాని అప్పుడు మొదలైంది చిక్కు. రోహిత్ ప్రవర్తనలో సడన్‌గా మార్పు మొదలైంది. అల్లరి పెంచాడు. మాట వినకుండా మొండికేయడం మొదలెట్టాడు. స్కూల్లో కూడా పాఠాలు సరిగ్గా వినకుండా అటెన్షన్ పెట్టకుండా నానా యాగీ చేస్తున్నాడని కంప్లయింట్‌లు వచ్చాయి. సుధీర్‌కు ఇవి చిన్న సమస్యలుగా కనిపించాయి. కాని రోహిత్‌ను చూసుకోవాల్సిన సమతను ఇవి టెన్షన్ పెట్టసాగాయి. గతంలో రోహిత్ సమతను 'పిన్నీ' అని పిలిచేవాడు. ఇప్పుడు 'అమ్మా' అని పిలవమంటే ఒక్కోసారి పిలుస్తున్నాడు. ఒక్కోసారి పిలవడం లేదు. తండ్రి దగ్గరకు వెళ్లి పడుకుంటాడు. సమతతో 'నువ్వు వేరే గదిలో పడుకో' అని హఠం చేస్తాడు. చేసేది లేక ఆమె తన గదిలో పడుకుంటుంది. ముగ్గురూ ఒకే బెడ్ మీద పడుకోవడం రోహిత్‌కు ఇష్టం లేదు. సమత ఎంతో ప్రేమ చూపడానికి దగ్గర కావడానికి ప్రయత్నించింది. కాని రోహిత్ కాలేదు. ఈలోపు సమతకు రెండు సార్లు అబార్షన్ అయ్యింది. దానివల్ల సుధీర్ ఆమె మీద ఇంకా కన్సర్న్ పెట్టి బాగా చూసుకుంటూ పరోక్షంగా రోహిత్ మనసులో ఆమె పట్ల దూరం పెంచాడు. సంవత్సరాలు గడిచే కొద్దీ రోహిత్ దూరమయ్యాడు తప్ప చేరువకాలేదు. ఇంటర్ వయసుకు వచ్చేసరికి వాడు పూర్తిగా తల్లికి ఎదురు తిరగడం, లెక్కలేనట్టుగా వ్యవహరించడం, బాధించడం ఎక్కువ చేశాడు. సుధీర్ నిస్సహాయత వాణ్ణి ఇంకా రెచ్చిపోయేలా చేసింది.

ఇప్పుడు ఆ ఇంట్లో సుధీర్, రోహిత్ బాగానే ఉన్నారు. కాని సమత పూర్తిగా నలిగిపోయింది.

'నేను చేసిన పాపం ఏమిటి? మంచికిపోతే చెడు ఎదురయ్యింది. నేనే నా చేతులారా జీవితాన్ని నాశనం చేసుకున్నానా' అనే భావంతో పూర్తి డిప్రెషన్‌లోకి వెళ్లిపోయింది. ఆమెలో వచ్చిన మార్పు వాళ్లిద్దరూ గమనించినా ఎలా పరిష్కరించాలో తెలియక కొనసాగనిచ్చారు.

> 'నేను చేసిన పాపం ఏమిటి? మంచికిపోతే చెడు ఎదురయ్యింది. నేనే నా చేతులారా జీవితాన్ని నాశనం చేసుకున్నానా' అనే భావంతో పూర్తి డిప్రెషన్‌లోకి వెళ్లిపోయింది. ఆమెలో వచ్చిన మార్పు వాళ్లిద్దరూ గమనించినా ఎలా పరిష్కరించాలో తెలియక కొనసాగనిచ్చారు.

చివరకు సమత తండ్రి దీనికి ముగింపు పలకడానికి వాళ్ల ముగ్గురినీ హైదరాబాద్‌లో సైకియాట్రిస్ట్ దగ్గరకు తీసుకు వచ్చాడు.

•••

అంతా విన్న సైకియాట్రిస్ట్ 'అయితే మొదట మాట్లాడిల్సింది మీతో కాదు. మీ అబ్బాయితో. మీకు సరైన మెడిసిన్ ఆ అబ్బాయే అని నాకు అర్థమవుతోంది' అన్నాడు.

బయట ఉన్న రోహిత్‌ను పిలిస్తే మొదట లోపలికి రావడానికి కూడా వాడు అంగీకరించలేదు. బతిమాలి ఒంటరిగా కూచోబెట్టి రోహిత్‌తో మాట్లాడాడు డాక్టర్.

'చూడు రోహిత్. మీ అమ్మకు డబ్బు ఉంది. మీ నాన్నను పెళ్లి చేసుకునే సమయంలో ఆమె మంచి వయసులో ఉంది. ఎంతో మంచి సంబంధం చేసుకుని ఈసరికి ఏ అమెరికాలోనో ఉండేది. కాని నీ కోసం ఒంటరి అయిపోయిన తన అక్క కొడుకు కోసం తల్లిలా మారడానికి మీ ఇంటికి వచ్చింది. మీ నాన్న దానిని అర్థం చేసుకున్నాడు. నువ్వు ఇబ్బంది పెడుతున్నావు. ఆమె నీకు ఏం అపకారం చేసింది? ఎందుకు వేధిస్తున్నావు? నీకు ఇష్టం లేకపోతే చెప్పు... ఆమె విడాకులు తీసుకుంటుంది. మీకు దూరంగా వెళ్లిపోతుంది. సరేనా?'

ఆ మాటకు రోహిత్ చటుక్కున తలెత్తి చూశాడు. నిర్లక్ష్యంగా ఉన్న కళ్లల్లో పశ్చాత్తాపం కనిపడింది.

'లేదు డాక్టర్. నాకు మా పిన్నంటే ఇష్టమే. కాని నాకు ఎనిమిదేళ్లు వచ్చేవరకూ అడ్డు చెప్పేవారే లేరు. అమ్మ చనిపోవడంతో గారం పెంచేసి కొండ మీద కోతిని తెమ్మన్నా మా నాన్న తెచ్చిచ్చేవాడు. కాని పిన్ని వచ్చి నన్ను క్రమశిక్షణలో పెట్టబోయింది. అది నా మంచి కోసమే. కాని ఆమె నన్ను కంట్రోల్‌లో పెట్టడానికి వచ్చిన విలన్‌గా ఆ వయసులో నాకు అనిపించింది. అందుకే ఆమెను వ్యతిరేకించాను. అది అలాగే అలవాటైపోయింది. ఆమెకు సరండర్ కావడానికి ఇగో అడ్డుపడుతుంది. కాని అమ్మ పరిస్థితి చూసి నాకు నిజంగానే దుఃఖంగా ఉంది. నేను చాలా తప్పు చేశాను' పదిహేడేళ్ల కుర్రావాడి మాటల్లో నిజాయితీ.

మైక్ ఆన్ చేసి పక్క గదిలో ఉన్న సమతకు ఈ మాటలు వినిపించేలా చేయడంతో సమత పెద్దగా ఏడుస్తూ బయటకు వచ్చింది. 'నాన్నా... రోహిత్' అని కొడుకును అల్లుకుపోయింది.

సమత ఎనిమిదేళ్ల పిల్లవాడికి తల్లి కావాలని వచ్చింది. కాని వాడికి పదిహేడేళ్లు వచ్చాకే నిజంగా తల్లి అయ్యింది. ఇక ఆమె జీవితానికి ఢోకా లేదు.


– కథనం: సాక్షి ఫ్యామిలీ
ఇన్‌పుట్స్: డాక్టర్ కల్యాణ చక్రవర్తి, సైకియాట్రిస్ట్


# ఆ మసీదు అందరిదీ...

భిన్నత్వంలో ఏకత్వానికి ప్రాక్టికల్ ఎగ్జాంపుల్ బిహార్, నలంద జిల్లాలోని మారి గ్రామం. అక్కడ 200 ఏళ్ల నాటి మసీదు ఉంది. ఉపాధి కోసం ఆ గ్రామంలోని ముస్లిములంతా ఏనాడో వలసవెళ్లిపోయారు. మిగిలింది హిందువులే. ఒక్క ముస్లిం కూడా ఆ గ్రామంలో లేకుండా పోయినప్పటి నుంచి ఆ మసీదు సంరక్షణ బాధ్యతను గ్రామంలోని హిందువులే తీసుకున్నారు. ఆ ప్రార్థన మందిరాన్ని రోజూ శుభ్రంగా ఉడ్వడం... తడిగుడ్డతో తుడవడం దగ్గర్నుంచి పెచ్చులూడిపోతున్న గోడలకు మరమ్మతులు చేయడం.. పెయింటింగ్ వేయడం వంటి అన్ని పనులూ హిందువులే నిర్వహిస్తున్నారు. అంతేకాదు.. అజా వేళ్లల్లో అజానూ వినిపిస్తున్నారు. ''పెన్‌డ్రైవ్‌లో అజాను రికార్డ్ చేయించి టైమ్‌కి ఆ రికార్డ్‌ను వేస్తున్నాం. హిందూ, ముస్లిం తేడా లేకుండా ఈ ఊళ్లో అందరికీ ఈ మసీదు పవిత్ర స్థలమే. ఈ ఊళ్లో ఏ హిందువుల ఇంట్లో పెళ్లయినా ఆ కొత్త జంట ముందుగా ఈ మసీదుకు వచ్చి ఆశీర్వాదం తీసుకొని వెళ్తుంది. తరతరాలుగా వస్తున్న ఈ ఊరి సంప్రదాయం అది. ఈ చుట్టుపక్కల ఊళ్లల్లో హిందూముస్లింల మధ్య చాలానే గొడవలయ్యాయి. కానీ మా ఊళ్లో ఎలాంటి గొడవలూ జరగలేదు. మేమంతా కలిసిమెలిసే ఉంటూ వస్తున్నాం. ఉంటాం కూడా'' అని చెప్తాడు ఆ మసీదును చూసుకుంటున్న మారి గ్రామ నివాసి ఒకరు.






అజా రికార్డింగ్ వినిపిస్తూ..



మసీదు శుభ్రం చేస్తూ...

## తిరుప్పావై 11వ పాశురం

బొమ్మ: కేశవ్ వెంకటరాఘవన్



**కత్తు కఱవై క్కణ్గళ్ పలకఱందు**
**శెత్తార్ తిఱల్ అరియ చ్చెన్రు శెరుచ్చెయ్యుమ్**
**కుత్తం ఒన్రిల్లాద కోవలర్ -దం పొర్కొడియే**
**పుత్తరవల్ గుల్ పునమయిలే పోదరాయ్**
**శుత్తత్తు త్తోరిమార్ ఎల్లారుమ్ వందు నిన్ -**
**ముత్తం పుగుందు ముగిల్ వణ్ణన్ పేర్ -పాడ**
**శిత్తాదే పేశాదే శెల్వప్పెన్డాట్టి నీ -**
**ఎత్తుక్కురంగుం పొరుళ్-ఏలోరెమ్బావాయ్ .**

ఈ పాశురంలో ఉత్తమ వంశీకురాలు, సౌందర్యరాశియైన గోపికను ఆండాళ్, సఖులు మేల్కొల్పబోతున్నారు. ఆ గోపిక అభిజాత్యం గలదని తెలుస్తున్నది.

**అర్థం:** 'ఓ బంగారుతీగ వంటి మేను కల సుందరీ! గోపకుల సంజాతా! గోపకాంతలందరిలోకి పేరెన్నిక గల దానివి. వేలాది గోవులకు ఒక్క బిగిని పాలు పితకగల నేర్పరులు నీ ఇంటివాళ్ళు. అకళంకమైన చరిత్ర గల యోధులు కూడా. అవసరమైతే శత్రువులను నిర్వీర్యం చెయ్యగల శక్తిమంతులు. ఎవరి జోలికీ వెళ్లని బుద్ధిమంతులు. సందర్భం వస్తే పోరుకు వెఱవని పరాక్రమవంతులు నీ వాళ్ళు. పాముపడగ వంటి తీరైన జఘనభాగం కల లావణ్యవతీ, మయూరి వంటి హొయలు కలదానా, వచ్చి నీకై ఎదురు చూస్తున్న మా గోష్ఠిలో చేరు. నీ ఆత్మీయులమందరము నీ చావిడిలో గుమిగూడి భగవన్నామ సంకీర్తనం చేస్తుంటే, ఆ మేఘశ్యాముని భజించటం వినబడి కూడా కదలక, మెదలక ఉన్నావేమమ్మా ఐశ్వర్యవంతురాలా!'

– శ్రీదేవి మురళీధర్






● 'బ్రోచేవారెవరురా'లో శ్రీవిష్ణు, రాహుల్, ప్రియదర్శి

● 'జెర్సీ'లో నాని

● 'మజిలీ'లో నాగచైతన్య

# ద్వితీయ విఘ్నం దాటారండోయ్

ఇండస్ట్రీలో ఒక గమ్మత్తైన గండం ఉంది. ఫస్ట్ సినిమా ఫస్ట్ క్లాస్‌లో పాస్ అయినా కూడా రెండో సినిమాకు తడబడుతుంటారు దర్శకులు. సినిమా భాషలో దీనికి 'సెకండ్ మూవీ సిండ్రోమ్' అనే పేరు కూడా పెట్టారు. ఇండస్ట్రీలో ఇది తరచూ కనిపించేదే. దర్శకులు మొదటి సినిమాతో ఎంతలా మెప్పించినా, రెండో సినిమాతో నిరాశపరిచిన సందర్భాలు చాలానే ఉన్నాయి. కొందరు దర్శకులు మాత్రం సెకండ్ హిట్ కూడా ఇచ్చేస్తారు. అలా తొలి సినిమాతోనే ఇండస్ట్రీ దృష్టిని ఆకర్షించిన కొందరు దర్శకులు ఈ ఏడాది తమ రెండో సినిమాతో వచ్చారు. కానీ ముగ్గురు దర్శకులు మాత్రం ద్వితీయ విఘ్నాన్ని విజయవంతంగా దాటేశారు. ఈ 'సెకండ్ మూవీ సిండ్రోమ్'ను సక్సెస్‌ఫుల్‌గా దాటేసిన సక్సెస్‌ఫుల్ డైరెక్టర్స్ స్టోరీ.

## శివ మజిలీ



● శివ నిర్వాణ

'నిన్ను కోరి' (2017) సినిమాతో ఇండస్ట్రీకు పరిచయం అయ్యారు శివ నిర్వాణ. ప్రేమలో ఓడిపోయినా జీవితాన్ని ముందుకు సాగించొచ్చు అని 'నిన్ను కోరి'లో చెప్పారు. ఈ చిత్రంలో నాని, నివేదా థామస్, ఆది ముఖ్య పాత్రల్లో నటించారు. అద్భుతమైన స్క్రీన్‌ప్లే, టేకింగ్, పాటలు, ఫెర్ఫార్మెన్స్‌లతో ఈ సినిమా సక్సెస్ కొట్టింది. రెండో సినిమాగా టాలీవుడ్ యంగ్ కపుల్ నాగచైతన్య, సమంతలతో 'మజిలీ' తీశారు శివ నిర్వాణ. వివాహం తర్వాత చైతన్య, సమంత స్క్రీన్ షేర్ చేసుకున్న చిత్రమిదే. మనం కోరుకున్న వాళ్లు మనకు కొన్నిసార్లు దక్కకపోవచ్చు. మనల్ని కోరుకునేవాళ్లూ మనకోసం ఉండే ఉంటారు అనే కాన్సెప్ట్‌తో ఈ సినిమా తీశారు శివ. ఎమోషనల్ మీటర్ కరెక్ట్‌గా వర్కౌట్ అయింది. బాక్సాఫీస్ దగ్గర మంచి వసూళ్లు సాధించిన ఈ చిత్రం నాగచైతన్య, సమంత గుర్తుంచుకునే చిత్రం అయింది. ప్రస్తుతం తన తొలి హీరో నానీతో 'టక్ జగదీష్' చేస్తున్నారు శివ.

## మళ్ళీ హిట్



● గౌతమ్ తిన్ననూరి

మొదటి చిత్రానికి ప్రేమకథను ఎన్నుకున్నారు గౌతమ్ తిన్ననూరి. కథను చెప్పడంలో, కథను ఎంగేజ్ చేయడంలో తనదైన శైలిలో 'మళ్ళీ రావా'ని తెరకెక్కించారు. ఇందులో సుమంత్, ఆకాంక్షా సింగ్ జంటగా నటించారు. మన ఫస్ట్ లవ్ మళ్లీ మన జీవితంలోకి ప్రవేశిస్తే? ఆమెను వదులుకోకూడదనుకునే ఓ ప్రేమికుడి ప్రయాణమే ఈ సినిమా. ఎమోషనల్ డ్రామాగా ఈ సినిమా యువతను బాగా ఆకట్టుకుంది. రెండో సినిమాగా నానీతో 'జెర్సీ'ని తెరకెక్కించారు గౌతమ్. వందమందిలో గెలిచేది ఒక్కడే. ఆ ఒక్కడి గురించి అందరూ చర్చించుకుంటారు. మిగతా 99 మందికి సంబంధించిన కథే 'జెర్సీ'. 36 ఏళ్ల వయసులో మళ్లీ క్రికెటర్‌గా టీమ్‌లో సెలక్ట్ కావాలనుకున్న ఓ ప్లేయర్ కల నెరవేరిందా లేదా అనేది కథ. నాని కెరీర్‌లో మైలురాయిగా ఈ సినిమా ఉండిపోతుంది. ప్రస్తుతం ఈ సినిమాను హిందీలో షాహిద్ కపూర్ హీరోగా రీమేక్ చేస్తున్నారు గౌతమ్ తిన్ననూరి.

## నో కన్‌ఫ్యూజన్



● వివేక్ ఆత్రేయ

'దర్శకుడిగా వివేక్ ఆత్రేయకు 'మెంటల్ మదిలో' తొలి సినిమా. శ్రీవిష్ణు, నివేదా పేతురాజ్ జంటగా నటించారు. ఏ సందర్భంలో అయినా ఏదైనా ఎంపిక చేసుకోవాలంటే కన్‌ఫ్యూజ్ అయ్యే మనస్తత్వం హీరోది. అలాంటి అతను లైఫ్ పార్ట్‌నర్‌ని ఎలా ఎంచుకున్నాడన్నది కథ. హీరో కన్‌ఫ్యూజ్డ్ అయినప్పటికీ ప్రేక్షకులు కన్‌ఫ్యూజ్ కాకుండా బావుందనేశారు. దాదాపు అదే టీమ్‌తో 'బ్రోచేవారెవరురా' తెరకెక్కించారు వివేక్. క్రైమ్ కామెడీ జానర్‌లో తెరకెక్కిన ఈ సినిమా వినోదం పంచింది. లైంగిక వేధింపులు అనే సున్నితమైన సబ్జెక్ట్‌ను ఈ చిత్రంలో అతి సున్నితంగా చర్చించారు వివేక్. ప్రస్తుతం మూడో సినిమాను పట్టాలెక్కించే పనిలో ఉన్నారు.

ఈ ముగ్గురు దర్శకులూ ద్వితీయ విఘ్నాన్ని దాటేశారు. ప్రస్తుతం మూడో సినిమా పనిలో ఉన్నారు. మూడో హిట్‌ని కూడా ఇస్తే 'హ్యాట్రిక్ డైరెక్టర్స్' అనిపించుకుంటారు.

– గౌతమ్ మల్లాది


## హిట్ లుక్



● విశ్వక్ సేన్

హీరోగా నాని సూపర్ సక్సెస్‌ఫుల్. నిర్మాతగా మారి 'అ!' చిత్రం తీశారు. ఆ సినిమా మంచి ప్రశంసలు అందుకుంది. తాజాగా రెండో సినిమా కూడా సిద్ధం చేస్తున్నారు. 'ఫలక్‌నుమా దాస్' ఫేమ్ విశ్వక్ సేన్ హీరోగా శైలేష్ కొలను దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'హిట్'. నాని సమర్పణలో ప్రశాంత్ త్రిపిర్‌నేని నిర్మిస్తున్నారు. రుహానీ శర్మ హీరోయిన్. 'హిట్' ఫస్ట్‌లుక్‌ను బుధవారం విడుదల చేశారు. ఈ చిత్రంలో విక్రమ్ రుద్రరాజు అనే పవర్‌ఫుల్ పోలీస్ ఆఫీసర్‌గా విశ్వక్‌సేన్ కనిపించనున్నారు. జనవరి 1న ఈ చిత్రానికి సంబంధించిన టీజర్‌ను రిలీజ్ చేయనున్నారు. ఈ సినిమాకు కెమెరా: మణికందన్, సంగీతం: వివేక్ సాగర్.

## అంతఃకరణ శుద్ధితో...



● అమిత్

అమిత్, ఇందు జంటగా చీమ ప్రధాన పాత్రలో నటించిన చిత్రం 'చీమ ప్రేమ మధ్యలో భామ!'. శ్రీకాంత్ శ్రీ అప్పలరాజు దర్శకత్వంలో ఎస్ఎన్ లక్ష్మీనారాయణ నిర్మించిన ఈ సినిమా త్వరలో విడుదల కానుంది. ''మా సినిమాకి చీమే హీరో. అంతఃకరణ శుద్ధితో అడుగు ముందుకు వేస్తే ఏదైనా సాధ్యమే, ఎవరేం కావాలనుకున్నా కావచ్చనే అంతర్లీన సందేశంతో ఈ సినిమా రూపొందించాం. ఈ చిత్రం హీరో ప్రభాస్‌గారి అభిమానులకు ప్రత్యేకంగా నచ్చుతుంది.. అది ఎందుకో తెలియాలంటే విడుదల వరకూ ఆగాలి'' అన్నారు శ్రీకాంత్ శ్రీ అప్పలరాజు. ''ఫ్యాంటసీతో కూడిన ప్రేమ కథ ఇది'' అన్నారు లక్ష్మీ నారాయణ. ఈ చిత్రానికి సంగీతం: రవి వర్మ, కెమెరా: ఆరిఫ్ లలాని.

సాక్షి ఫ్యామిలీ సినిమా
నల్లగొండ
గురువారం
26-12-2019

## తెల్లజుట్టు బాండ్



● డేనియల్

మై నేమ్ ఈజ్ బాండ్. జేమ్స్ బాండ్. సుమారు 57 ఏళ్లుగా ఈ పంచ్ డైలాగ్‌ను వింటూనే ఉన్నాం. జేమ్స్ బాండ్ చిత్రాలకు ఉన్న పాపులారిటీ అలాంటిది. ప్రస్తుతం బాండ్ 25వ సినిమా రూపొందుతోంది. 'నో టైమ్ టు డై' అనే టైటిల్‌తో తెరకెక్కుతున్న ఈ సినిమాలో ఐదోసారి బాండ్ పాత్రలో డేనియల్ క్రెగ్ నటిస్తున్నారు. ఈ సినిమాలో 8 విభిన్న లుక్స్‌లో బాండ్ కనిపిస్తారట. అలాగే సాల్ట్ అండ్ పెప్పర్ లుక్ (సగం నెరిసిన జుట్టు)లోనూ కనిపిస్తారట. వచ్చే ఏడాది ఏప్రిల్ 8న ఈ సినిమా రిలీజ్ కానుంది.

## మరో మూడు నెలల్లో రెండేళ్లు



● శ్రియ

గత ఏడాది మార్చిలో బ్యాచిలర్ లైఫ్‌కి ఫుల్‌స్టాప్ పెట్టారు శ్రియ. తన బాయ్‌ఫ్రెండ్, రష్యాకు చెందిన బిజినెస్‌మ్యాన్ ఆండ్రూ కోచీవ్‌ను పెళ్లాడారామె. కానీ ఈ వేడుక అతికొద్ది మంది స్నేహితులతో, పెద్ద హడావిడి లేకుండా జరిగింది. వివాహం విషయంలో అంత గోప్యత పాటించడానికి కారణం ఏంటి? అనే ప్రశ్నను శ్రియ ముందుంచితే – ''ఆండ్రూతో వివాహం అయి మరో మూడు నెలల్లో రెండేళ్లు పూర్తి కావస్తోంది అంటే నమ్మబుద్ధి కావడం లేదు. మా పెళ్లిని రహస్యంగానో, చాటుగానో ఉంచాలనుకోలేదు. పెళ్లనేది నాకు, ఆండ్రూకి జరిగిన చాలా వ్యక్తిగతమైన విషయం. మా వ్యక్తిగత విషయం మా మధ్యనే ఉండాలనుకున్నాం. అంతకు మించి వేరే కారణం ఏం లేదు. సినిమాలు నా వృత్తి. ఆ విషయంలో మా ఆయన చాలా సపోర్ట్‌గా ఉన్నారు. నేను ఎక్కువ సినిమాలు చేయాలంటున్నారు ఆయన'' అని పేర్కొన్నారు. భర్తతో విదేశాల్లో నివసిస్తున్నారు శ్రియ. ''ముంబైలో ఉంటున్న మా అమ్మానాన్న దగ్గరకు వచ్చి వెళుతుంటాను. అలాగే సినిమాల షూటింగ్ ఎక్కడ ఉంటే అక్కడికి వెళతాను. నేను ఎక్కడ ఉన్నా షూటింగ్స్‌కి ఇబ్బంది లేకుండా చూసుకుంటాను'' అన్నారు శ్రియ.



● గురురాజ్

## రెండు లక్షలమందికి ఉపాధి కల్పించాలన్నదే నా లక్ష్యం

''సినిమా ఇండస్ట్రీపై ఉన్న ప్రేమతో జయాపజయాలతో సంబంధం లేకుండా సినిమాలు నిర్మిస్తున్నాను. పెద్ద హీరోలు నటించినా కంటెంట్ సరిగా లేకపోతే ఆ చిత్రాలను ప్రేక్షకులు మెచ్చరు. అలాగే కథాబలం ఉన్న మంచి సినిమాలు చిన్నవైనా, పెద్దవైనా వాటికి ప్రేక్షకాదరణ తప్పక ఉంటుంది'' అన్నారు నిర్మాత ఏ. గురురాజ్. నటరాజ్, నూరిన్, అంకిత జంటగా సుఖీభవ మూవీస్ పతాకంపై ఆయన నిర్మించిన చిత్రం 'ఊల్లాల ఊల్లాల'. సీనియర్ నటుడు సత్యప్రకాష్ ఈ చిత్రంతో దర్శకునిగా పరిచయం అవుతున్నారు. జనవరి 1న ఈ సినిమా విడుదల కానున్న సందర్భంగా గురురాజ్ చెప్పిన విశేషాలు.

- మాది మధ్యతరగతి కుటుంబం. నటుణ్ణి కావాలని వచ్చాను. అప్పట్లో అవకాశం, అదృష్టం కలిసి రాలేదు. దాంతో సుఖీభవ ప్రాపర్టీస్‌ను స్థాపించి రియల్‌ఎస్టేట్ రంగంలో మంచి స్థాయికి ఎదిగాను. ఇంతకుముందు మా సుఖీభవ మూవీస్ సంస్థ నుంచి 'రక్షకభటుడు, ఆనందం మళ్లీ మొదలైంది, లవర్స్ డే' చిత్రాలు వచ్చాయి. ఇప్పుడు 'ఊల్లాల ఊల్లాల' చిత్రం నిర్మించా. కామెడీ, రొమాన్స్, యాక్షన్, ఎమోషన్ వంటి అంశాలు ఈ సినిమాలో ఉన్నాయి.
- సినిమాల్లో సత్యప్రకాష్ విలన్‌గా కనిపించినా బయట మాత్రం మంచి వ్యక్తి. ఓ సందర్భంలో స్టోరీ లైన్ ఉంది వింటావా? అని సత్యప్రకాష్ అన్నారు. ఆయన చెప్పిన లైన్ నచ్చింది. ఆ లైన్‌ని తీసుకుని 'ఊల్లాల ఊల్లాల' స్టోరీని మేమే రాశాం. నటుడు కావాలనుకున్న వ్యక్తి నిర్మాతగా మారినప్పుడు మెయిన్ క్యారెక్టర్‌గా తననే పెట్టుకుని సినిమా చేస్తాడు. కానీ నేను కథలో ఏ పాత్రకు సెట్ అవుతానో ఆ పాత్రను మాత్రమే ఈ సినిమాలో చేశాను.
- నిర్మాతగా నేను చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నాను. అప్పట్లో మాకు ఛాంబర్‌లో కూడా కొన్ని సమస్యలు ఎదురయ్యాయి. కానీ ఇప్పుడు ఆ పరిస్థితి లేదు. ఈ రోజుల్లో అవకాశాలు కూడా ఎక్కువగానే దొరుకుతున్నాయి. ప్రతిభ ఉన్నవారు పైకి వస్తున్నారు. మా ఆడియో ఫంక్షన్‌కు రామ్‌గోపాల్ వర్మగారు వచ్చారు. అవకాశం వస్తే ఆయనతో సినిమా చేస్తాను. రాజమౌళితో కూడా చేయవచ్చు. నాకు అందరితో సినిమాలు చేయాలని ఉంది.
- 100, 500 కోట్ల భారీ బడ్జెట్ సినిమాలు తీసే స్థాయికి ఏదో ఒక రోజు నేను వెళ్తాననే నమ్మకం ఉంది. దాదాపు రెండు లక్షల మందికి ఉపాధి కల్పించాలన్నది నా లక్ష్యం. ఆ భగవంతుడు ఆశీర్వదిస్తే అది తప్పకుండా నేరవేరుతుంది.










epaper.sakshi.com

సాక్షి ఫ్యామిలీ
నల్లగొండ
గురువారం
26-12-2019

# కాళ్ల వాపులు కనిపిస్తున్నాయా?



**కొంతమంది పెద్దవయసువారు తమ కాళ్లపై కాస్తంత నొక్కుకుని పరిశీలనగా చూసుకుంటూ ఉంటారు. అలా నొక్కగానే కొద్దిగా గుంట పడ్డట్లుగా అయి... అది మళ్లీ క్రమంగా నెమ్మదిగా పూడుకుపోయి మామూలు స్థితికి వస్తుంది. ఇది చాలామందిలో కనిపించే సాధారణ సమస్య. చాలావరకు హానిలేనిదే అయినా కొన్నిసార్లు ఈ కాళ్లవాపు లోపల ఉన్న ప్రమాదకరమైన పరిస్థితికి ఒక సంకేతం కావచ్చు. రెండు కాళ్లలోనూ వాపు కనిపిస్తే అది మూత్రపిండాలు, కాలేయం, హార్ట్ ఫెయిల్యూర్ వంటి సమస్యలకు సూచన కావచ్చు. అదే ఒకే కాలిలో వాపు ఉంటే అది ఫైలేరియాసిస్‌లాంటి సమస్యకు సంకేతం కావచ్చు. కాళ్లవాపులపై అవగాహన పెంచుకునేందుకు ఉపయోగపడేదే ఈ కథనం.**

కాళ్లలో నొక్కిన చోట గుంట పడి, అది మెల్లగా సర్దుకోడాన్ని సాధారణ పరిభాషలో 'పిట్టింగ్' అంటారు. ఇదే సమస్యను వైద్యపరిభాషలో 'ఎడిమా' అని చెబుతారు. సాధారణంగా పురుషుల్లో కంటే మహిళల్లో ఎక్కువగా కనిపించే ఈ సమస్యకు అనేక కారణాలుంటాయి. మనమందరమూ సాధారణంగా ఈ తరహా కాళ్లవాపును మన జీవితంలోని ఏదో ఒక దశలో గమనించే ఉంటాం. అన్నిటికంటే సాధారణమైనదేమిటంటే చాలా దూరం కూర్చుని ప్రయాణం చేయడం వల్ల చాలామందిలో కాళ్లవాపు వస్తుంటుంది. ఇది నిరపాయకరం. కాసేపట్లో తగ్గిపోతుంది. కానీ కొన్ని సమస్యలు అంత సింపుల్‌గా ఉండవు. ఈ సమస్యకు గల కారణాలేమిటో చూద్దాం.




## తెలుసుకోవాల్సిన కారణాలివే

### రెండు కాళ్లకూ నీరొస్తుంటే...

ఈ కింది సమస్యలు ఉండే అవకాశం ఉంది.

- **గుండె సమస్యలు :** హార్ట్ ఫెయిల్యూర్ వంటి గుండెకు సంబంధించిన సమస్యలున్నప్పుడు ఇలా కాళ్లపై నీరు రావడం చాలా మామూలే.
- **కాలేయ సమస్యలు :** సిర్రోసిస్ ఆఫ్ లివర్ వంటి కాలేయ సమస్య ఉన్నప్పుడు
- **కిడ్నీ సమస్యలు :** నెఫ్రోటిక్ సిండ్రోమ్, గ్లామరూలో నెఫ్రైటిస్ వంటి మూత్రపిండాల వ్యాధులు ఉన్నవారిలో
- **హైపోథైరాయిడిజం :** మహిళల్లో సాధారణంగా కనిపించే ఈ సమస్యలో కాళ్ల వాపు అనేది నీరుపట్టడం వల్ల జరగదు. కానీ... 'ప్రీటిబియల్ మిక్స్ ఎడిమా' అనే తరహా కాళ్ల వాపు కనిపిస్తుంది. ఇది గ్రేవ్స్ డిసీజ్ అనే థైరాయిడ్ సమస్యలో కనిపిస్తుంది.
- **పోషకాహార లోపాలు :** ఆహారంలో తగినంతగా ప్రోటీన్లు తీసుకోకపోవడం (హైపో ప్రోటీనీమియా), బెరిబెరీ వంటి పోషకాహార లోపాలు ఉండటం
- **కొన్ని రకాల మందుల వల్ల :** కొన్ని రకాల హైబీపీ మందుల వల్ల (క్యాల్షియమ్ ఛానెల్ బ్లాకర్స్), డయాబెటిస్‌కు వాడే మందులు (పయోగ్లిటజోన్స్), నివారణ మందులు (పెయిన్ కిల్లర్స్ ఎన్ఎస్ఏఐడీస్) వాడే వారిలోనూ, స్టెరాయిడ్స్ (గ్లూకో కార్టికాయిడ్స్), అసిడిటీకి వాడే మందుల (ప్రోటాన్ పంప్ ఇన్హిబిటర్స్)... వల్ల కాళ్లవాపు కనిపించవచ్చు.
- **ఎలాంటి కారణాలు లేకుండా :** కొంతమందిలో నిర్దిష్టంగా ఎలాంటి కారణం లేకుండానే కాళ్ల వాపులు రావచ్చు. ముఖ్యంగా పిల్లలను కనే వయసులోని మహిళల్లో ఇది కనిపించడం చాలా సాధారణం. దీన్ని ఇడియోపాథిక్ సైక్లిక్ అడిమా అంటారు.

### ఒకే కాలిలో వాపు వస్తుంటే...

1 **ఫైలేరియాసిస్:** క్యూలెక్స్ దోమకాటు వల్ల వచ్చే వాపు.
2 **వేరికోస్ వెయిన్స్ :** కాళ్లపై ఉండే రక్తనాళాల్లోని (సిరలు) కవాటాలు పనిచేయకపోవడం వల్ల నరాలు ఉబ్బినట్లుగా కనిపిస్తాయి. ఇలాంటప్పుడు కూడా ఏదో ఓ కాలిపై వాపు రావచ్చు.
3 **డీప్ వెయిన్ థ్రాంబోసిస్ :** రక్తనాళాల్లో రక్తం గడ్డకట్టడం వల్ల ఈ సమస్య వస్తుంది.
4 **వీనస్ ఇన్‌సఫిషియెన్సీ :** కాళ్లలోని రక్తనాళాల్లో రక్తం... తాను పయనించాల్సిన మార్గంలో ప్రయాణం చేయకపోవడం వల్ల వచ్చే సమస్య ఇది.
5 **సెల్యులైటిస్ :** కాళ్ల చర్మంలోని డెర్మల్, సబ్‌క్యుటేనియస్ అనే పొరలలో ఉండే కనెక్టివ్ టిష్యూలో సమస్యల వల్ల ఈ వాపు వస్తుంది.

### ఇతర సమస్యల కారణంగా...

- **పోషకాహార లోపాల్లో :** ప్రోటీన్లు ఎక్కువగా ఉండే ఆహారం తీసుకోవాలి.
- **ఏదైనా మందుల వల్ల కాళ్ల వాపు వస్తే...** పేషెంట్ వాడుతున్న నొప్పినివారణ మందులు, హైబీపీ మందులు, స్టెరాయిడ్స్ నిలిపివేసి, వాటికి బదులుగా ఇతర మందులు మార్చాలివస్తుంది.
- **ఏ కారణం లేకుండా వచ్చే వాపు :** ఇది ఏ కారణం లేకుండా వచ్చే ఇడియోపథిక్ సైక్లిక్ ఎడిమా అయితే ఎలాంటి మందులు వాడనవసరం లేదు. దానంతట అదే తగ్గిపోతుంది. ఒకవేళ అప్పటికీ తగ్గకపోతే కొద్ది రోజుల పాటు (షార్ట్ కోర్స్) డైయూరెటిక్స్ వాడవచ్చు.
- **ప్రయాణంలో వచ్చే వాపులు...** వీటికి ఎలాంటి మందులు వాడాల్సిన అవసరం లేదు. కాస్త ఎత్తుగా ఉండేలా తలగడపై కాళ్లు పెట్టుకోవడంతో కాళ్ల వాపు తగ్గుతుంది. అరికాళ్లను ప్రతి అరగంటకోసారి గుండ్రంగా తిప్పుతున్నట్లుగా (రొటేటింగ్ మోషన్‌లో) చేయాలి. ప్రయాణంలో ఉన్నప్పటికీ ప్రతి గంటకోసారి కాస్తంత లేచి అటు ఇటు నడవాలి. బస్‌లోనో లేదా రైల్లోనో ఉన్నప్పటికీ ఈ పని చేయాలి. ఫ్లైట్స్‌లో యూఎస్ వంటి దూరప్రాంతాలకు వెళ్లేవారిలో ఇది మరీ ముఖ్యం. ఇలా తప్పక నడవాల్సిందేనంటూ డాక్టర్లు సిఫార్సు చేస్తుంటారు.

### నిర్ధారణ పరీక్షలు

- సీబీపీ (కంప్లీట్ బ్లడ్ పిక్చర్)
- యూరిన్ స్పాట్ ప్రోటీన్ / కియాటినిన్ రేషియో
- బ్లడ్ యూరియా క్రియాటినిన్
- లివర్ ఫంక్షన్ పరీక్ష
- 2–డీ ఎకో కార్డియోగ్రామ్
- టీ3, టీ4, టీఎస్‌హెచ్
- అల్ట్రా సౌండ్ హోల్ అబ్డామిన్
- వీనస్ డాప్లర్ ఆఫ్ ద లెగ్స్
- నైట్ స్మియర్ ఫర్ మైక్రోఫైలేరియా లాంటి పరీక్షలతో పాటు, డీడైమర్ అనే పరీక్షను కాళ్ల వాపులు ఉన్నవారిలో చేయించాల్సి ఉంటుంది.

## చికిత్స

### రెండు కాళ్లూ వాచినప్పుడు...

సాధారణంగా కాళ్ల వాపు వచ్చిన అన్ని సందర్భాల్లోనూ ఒకేలాంటి నిర్దిష్టమైన చికిత్స ఉండదు. కారణాన్ని బట్టి చికిత్స మారుతుంది. అందుకే ముందుగా పరీక్షలు చేయించి కాళ్ల వాపుకు కారణాన్ని కనుగొనాల్సి ఉంటుంది.

- **మూత్రపిండాల సమస్యలో:** ఇమ్యునోసప్రెసెంట్స్, డైయూరెటిక్స్ వంటి మందులు.
- **కాలేయ సమస్య అయితే :** స్పైరనోలాప్టోన్ అనే మందులు.
- **గుండెకు సంబంధించిన సమస్యలో :** అయనోట్రోపిక్స్, డైయూరెటిక్స్ వంటి మందులు వాడాల్సి ఉంటుంది.
- **హైపోథైరాయిడిజమ్‌లో :** థైరాక్సిన్ అనే హార్మోన్ ఇవ్వాల్సి ఉంటుంది.

### ఒకే కాలి వాపునకు చికిత్స

- **ఫైలేరియాసిస్‌లో:** డై ఇథైల్ కార్బొమైసిన్‌ను సాధారణంగా ఉపయోగిస్తారు.
- **వేరికోస్ వెయిన్స్ :** నిర్దిష్టంగా మందులు ఉండవు. అయితే కాళ్లకు తొడిగే తొడుగు (స్టాకింగ్స్) వల్ల ఈ సమస్యను నియంత్రణలో ఉంచవచ్చు. అవసరాన్ని బట్టి శస్త్రచికిత్స చేయించాల్సి రావచ్చు.
- **వీనస్ ఇన్‌సఫిషియెన్సీ :** ఈ సమస్యకు కూడా నిర్దిష్టంగా చికిత్స ఉండదు. అయితే ప్రత్యేకమైన ఎలాస్టిక్ తొడుగుల ద్వారా కాళ్ల వాపును అదుపు చేయవచ్చు. ఒకవేళ కాళ్ల వాపు మరీ ఎక్కువగా ఉంటే శస్త్రచికిత్స చేయాల్సి ఉంటుంది.
- **సెల్యులైటిస్ :** ఈ సమస్య వచ్చినప్పుడు యాంటీబయాటిక్స్ వాడాల్సి ఉంటుంది.

### తీసుకోవాల్సిన జాగ్రత్తలు

అన్ని రకాల కాళ్ల వాపుల విషయంలో ఈ సాధారణ జాగ్రత్తలు తీసుకోవాలి.

1. ఆహారంలో ఉప్పు తగ్గించాలి.
2. చాలాసేపు అదేపనిగా కూర్చోవడం, నిలబడటం తగ్గించాలి.
3. రాత్రివేళల్లో కాళ్లను ఎత్తుగా తలగడపై విశ్రాంతిగా ఉంచాలి.
4. అవసరాన్ని బట్టి ఎలాస్టిక్ స్టాకింగ్స్ వాడాలి.

ఈ అవగాహన కల్పించుకుని కాళ్లవాపు తరచూ వస్తుంటే వైద్యుణ్ణి సంప్రదించి తగిన చికిత్స చేయించుకోవాల్సి ఉంటుంది.



**డాక్టర్ టి.ఎన్.జె. రాజేశ్,**
సీనియర్ కన్సల్టెంట్ ఫిజీషియన్
ఇంటర్నల్ మెడిసిన్ & ఇన్‌ఫెక్షియస్ డిసీజెస్, స్టార్ హాస్పిటల్స్,
బంజారాహిల్స్, హైదరాబాద్

అపోహ - వాస్తవం

## సైక్లింగ్ వల్ల మోకాళ్లు మరింత దెబ్బతింటాయా?



**అపోహ :** మోకాళ్ల నొప్పులతో బాధపడుతున్నప్పుడు సైక్లింగ్ చేయడం వల్ల ఆ నొప్పులు మరింత పెరుగుతాయి.

**వాస్తవం :** సైక్లింగ్ ఎక్సర్‌సైజ్ వల్ల లేదా సైకిల్ తొక్కడం వల్ల మోకాళ్లు మరింత దెబ్బతింటాయని చాలా మంది అపోహ పడుతుంటారు. కాని మోకాళ్ల నొప్పుల నివారణకు అది మంచి వ్యాయామం. మామూలు సైకిల్ తొక్కినా, లేక ఒకేచోట స్థిరంగా ఉండే ఎక్సర్‌సైజ్ సైకిల్ తొక్కినా మీ బరువు మీ శరీరంపై పడదు. కాబట్టి మోకాళ్లపై శరీరం బరువు చాలా తగ్గిపోతుంది. సైక్లింగ్‌లో పెడల్ తొక్కడం వల్ల మోకాళ్లు బాగా కదిలి మంచి ఎక్సర్‌సైజ్ అవుతుంది. ఇక ఈత (స్విమ్మింగ్)లో కూడా శరీరం బరువు మోకాళ్లపై ఏమాత్రం పడదు కాబట్టి అది కూడా చాలా మంచి ఎక్సర్‌సైజ్ అవుతుంది.

సినిమా

## క్రిస్మస్ స్టార్స్

క్రిస్మస్ పూర్తయింది. కుటుంబంతో, కావాల్సిన వాళ్లతో సంబరాలు చేసుకున్నారందరూ. సినిమా స్టార్స్ కూడా క్రిస్మస్ చేసుకున్నారు. క్రిస్మస్ చెట్టులో ఉన్న స్టార్స్‌తో పాటు తామూ స్టార్స్‌లా మెరిశారు. ఆ సంతోషంలో దిగిన ఫొటోలను ఇలా పంచుకున్నారు.



భార్య విరానిక, కుమార్తెలు అరియానా, వివియానా, కుమారుడు అవ్రామ్‌తో మంచు విష్ణు



చెల్లెలు అర్హాని కుర్చీలో కూర్చోబెట్టుకుని సందడి చేస్తున్న అల్లు అయాన్‌తో అల్లు అరవింద్ ఇతర మనవళ్లు, మనవరాలు



రకుల్



జాన్వీ కపూర్

## రంగా సురేష్

నందమూరి తారకరత్న టైటిల్ రోల్‌లో నటిస్తున్న చిత్రం 'దేవినేని'. ఇందులో వంగవీటి రంగా పాత్రను సురేష్ కొండేటి చేస్తున్నారు. నవీనా రెడ్డి, తేజూ రెడ్డి కథానాయికలుగా నటిస్తున్నారు. శివనాగేశ్వరరావు (శివనాగు) దర్శకత్వంలో ఆర్.టి.ఆర్ ఫిలింస్ పతాకంపై రామూ రాథోడ్, జి.ఎస్.ఆర్ చౌదరి ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఒక పాట మినహా షూటింగ్ పూర్తయింది. ప్రస్తుతం ఈ పాట చిత్రీకరణ అమలాపురంలో జరుగుతోంది. ఈ సందర్భంగా శివనాగు మాట్లాడుతూ – ''డిసెంబరు 26న రంగా వర్ధంతి. గత ఏడాది ఇదే రోజున మా సినిమా చిత్రీకరణ మొదలైంది. ఇవాళ్టితో షూటింగ్ మొత్తం పూర్తవుతుంది. ఇందులోని రంగా పాత్ర సినిమాకు హైలైట్‌గా ఉంటుంది. ఈ సినిమా విడుదల తర్వాత సురేష్ కొండేటిని రంగా సురేష్ అంటారేమో'' అన్నారు. ''మేము అనుకున్న దాని కన్నా సినిమా బాగా వచ్చింది. ఎక్కడా రాజీ పడకుండా చిత్రీకరించాము'' అన్నారు రామూ రాథోడ్. ''త్వరలో పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు మొదలుపెడతాం'' అన్నారు జి.ఎస్.ఆర్ చౌదరి.



సురేష్ కొండేటి

## విజయభేరి

''చిన్న కళాకారుడిగా కెరీర్‌ని మొదలుపెట్టిన విష్ణు నిర్మాతగా మారి, ఐదేళ్లుగా అవార్డ్స్ ఫంక్షన్ చేయడం అభినందనీయం. నా జయభేరి ఆర్ట్స్ ప్రొడక్షన్స్ స్ఫూర్తితో తను విజయభేరి ఆర్ట్స్ సంస్థను స్థాపించడం సంతోషం. ఈ ప్రొడక్షన్‌లో మంచి సినిమాలు తీసి, ఎంతో మందికి ఉపాధి కల్పించాలి'' అని నటుడు మురళీ మోహన్ అన్నారు. వి.బి.ఎంటర్‌టైన్‌మెంట్స్ ద్వారా బుల్లితెర, వెండితెర అవార్డులు అందిస్తున్న విష్ణు బొప్పన విజయభేరి ఆర్ట్స్ పేరుతో బేనర్‌ని స్థాపించారు. హైదరాబాద్‌లో జరిగిన బుల్లితెర అవార్డ్స్ ఫంక్షన్‌లో బేనర్ లోగోని సినీ ప్రముఖులు మురళీ మోహన్, వి.కె.నరేష్, వీరు పోట్ల, బాబూమోహన్, అంబికా కృష్ణ విడుదల చేశారు. ''ప్రతిభ ఉన్న నూతన నటీనటులు, సాంకేతిక నిపుణులను ప్రోత్సహిస్తూ మా సంస్థలో త్వరలో సినిమా నిర్మించనున్నా'' అన్నారు విష్ణు బొప్పన.



విష్ణు

## వేర్వేరు అవయవాలపై ఒత్తిడి ప్రభావం

# అధిగమించండి



మీరు బాగా ఒత్తిడిలో ఉన్నారా? ఆ విషయం మీ శరీరం ద్వారానూ మీకు స్పష్టంగా తెలుస్తోందా? ఎందుకంటే దాని ప్రభావం ఒక్కొక్కరిలో ఒక్కోలా ఉంటుంది. మానసిక ఒత్తిడి తీవ్రమైనప్పుడు కొందరిలో తలనొప్పి రావచ్చు. మరికొందరిలో ఛాతీ బరువుగా ఉన్నట్లు అనిపించవచ్చు. ఇలా తల మొదలుకొని, పాదాల వరకు రకరకాల అవయవాల్లోని ఇబ్బందులు రకరకాల రూపాల్లో వ్యక్తమవుతాయి. మానసిక ఒత్తిడి మీలోని ఏ అవయవాన్ని ఎలా ప్రభావితం చేసి, ఏయే లక్షణాలను కనబరుస్తోందో... దాన్ని బట్టి ఒత్తిడిని ఎదుర్కొనేందుకు ఏం చేయాలో తెలుసుకోండి. ఇవి చాలా తేలికైనవి. అనుసరించి చూడండి. రిలాక్స్ అవ్వండి.

### తల, మెడ భాగాల్లో

కొందరిలో ఒత్తిడి వల్ల తల గట్టిగా పట్టేసినట్లుగా అనిపిస్తుంది. నుదురు ముడుచుకుపోతుంది. ఆ తర్వాత సన్నగా తలనొప్పి మొదలై తీవ్రం కావచ్చు. మరికొందరిలో తెలియని భారమంతా తమ భుజాలపైన ఉన్నట్లుగానూ, ఆ బరువు తమను కుంగదీస్తున్నట్లుగానూ ఉండవచ్చు. మెడ, భుజాల కండరాలు గట్టిగా పట్టేసినట్టు అనిపించవచ్చు. ఇది తగ్గాలంటే కొన్ని చిట్కాలివి...

- మొదట కుర్చీలో హాయిగా, సౌకర్యంగా కూర్చుని రిలాక్స్ అవ్వండి. చేతులు, కాళ్లు రిలాక్స్‌డ్‌గా ఉంచాలి.
- మీ ముఖాన్ని కుడి భుజం వైపుకు, మళ్ళీ ఎడమ భుజం వైపు తిప్పాలి. ఆ తర్వాత పైకీ, ఆ వెంటనే కిందకు వంచాలి. ఇలా ఐదు సార్లు చేయాలి.
- మీ తలను మొదట ఎడమ భుజం వైపు తర్వాత ఛాతీ వైపుకు, అక్కడి నుంచి కుడి భుజం వైపుకు ఇలా గుండ్రంగా తిప్పాలి. ఆ తర్వాత మళ్లీ నెమ్మదిగా వ్యతిరేక దిశలో తిప్పాలి. ఇలా ఐదు సార్లు చేయాలి.
- నోటిని పెద్దగా తెరవాలి, కళ్ళను రెప్పలతో గట్టిగా నొక్కిపెట్టాలి. నోటితో గట్టిగా అరుస్తున్నట్టుగా నోరు తెరవాలి. కానీ ఎలాంటి శబ్దం చేయకూడదు. అలా విశాలంగా నోరు తెరచి గాలిని బాగా పీల్చాలి. మీకు బాగా తలనొప్పిగా ఉన్నప్పుడు ఈ చిట్కా బాగా పనిచేస్తుంది.

**ఛాతీ:** ఒత్తిడి కారణంగా ఛాతీ చాలా బరువుగా ఉన్నట్లు అనిపించడం, శ్వాస గుండెల నిండా పూర్తిగా తీసుకోలేకపోవడం, ఏదో ఇబ్బందిగా ఉన్నట్టు అనిపించడం వంటి లక్షణాలు కనిపిస్తుంటే ఈ కింది విధంగా చేయండి.

- రిలాక్స్‌డ్‌గా కూర్చోవాలి. ఆ సమయంలో నడుమును నిటారుగా ఉంచాలి.
- కళ్ళు మూసుకుని మీ శ్వాస మీద ధ్యాస పెట్టాలి.
- ఐదు వరకు అంకెలు లెక్కపెడుతూ నెమ్మదిగా శ్వాస తీసుకోవాలి. అలాగే మళ్లీ ఐదు అంకెలు లెక్కపెడుతూ శ్వాసను నెమ్మదిగా బయటకు వదిలేయాలి.
- వీలైతే శ్వాస లోపలికి తీసుకుంటున్నప్పుడు ఉదరాన్ని బయటకు పెట్టాలి. అలాగే శ్వాసను వదలుతున్నప్పుడు ఉదరాన్ని లాగినట్టుగా లోపలికి తీసుకోవాలి.
- ఇప్పుడు మీ ఉచ్ఛ్వాస-నిశ్వాస్వలను లెక్కించండి. ఈ లెక్కపెట్టడం రివర్స్‌లో జరగాలి. మీకు సమయం ఉంటే 60 నుంచి వెనక్కి సున్న వచ్చేంత వరకూ, సమయం లేకపోతే కనీసం 20 సంఖ్య నుంచి వెనక్కి సున్న వచ్చేంత వరకూ లెక్కించాలి. శ్వాస లోపలికి తీసుకున్నప్పుడు ఒక అంకె, శ్వాస వదిలినప్పుడు తర్వాత అంకె... ఇలా సున్న వరకు లెక్కించి, సున్న తర్వాత కళ్ళు తెరవాలి.

### కళ్లు



ఒత్తిడి బాగా ఉన్నప్పుడు కొందరిలో కళ్లు నొప్పిగా ఉండటం, కళ్లు లాగినట్లు అనిపించడం, కళ్ల వెంట నీరుకారడం జరుగుతుంది. టీవీ, మొబైల్స్ ఎక్కువగా వాడటం, కంప్యూటర్‌పై ఎక్కువగా పనిచేయడం వల్ల కూడా కళ్లపై ఒత్తిడి పడి ఈ లక్షణాలు కనిపిస్తాయి. ఇలాంటి లక్షణాలు కనిపించినప్పుడు ఈ కింది సూచనలు పాటించండి.

- ప్రతి గంటకోసారి కళ్లను గట్టిగా కాకుండా, మృదువుగా మూసుకొని... కళ్లపై మునివేళ్లతో నెమ్మదిగా మర్దన చేసుకోవాలి. ఇది గుండ్రంగా చేయాలి. తొలుత క్లాక్‌వైజ్‌గా ఐదు సార్లు, ఆ తర్వాత యాంటీక్లాక్‌వైజ్‌గా మరో ఐదుసార్లు చేయాలి.
- కళ్లకు ఆహ్లాదంగా ఉండే రంగు (సూదింగ్ కలర్) లైట్ గ్రీన్. కాబట్టి కిటికీలోంచి పచ్చటి చెట్లను చూడవచ్చు. లేదా కంప్యూటర్ మానిటర్ పక్కన ఇన్‌డోర్ ప్లాంట్స్ పెట్టుకొని చూస్తుండటం కూడా మంచి పద్ధతి.
- కంప్యూటర్ / మొబైల్ ఫోన్స్‌లో రీడింగ్ మోడ్‌లో ఉంచి చదవడం మంచిది.
- రోజూ రాత్రి పడుకునే ముందు కళ్లమీద తాజా నీటిలో ముంచిన తడిగుడ్డ కాసేపు ఉంచుకోవడం మంచిది.
- వీటన్నింటివల్ల ప్రయోజనం కనిపించినప్పుడు ఒకసారి కంటి డాక్టర్‌ను సంప్రదించి తమ ఐ–సైట్ చెక్ చేయించుకోవాలి.

### ఛాతీ, మొండెం భాగాల్లో

మీరు ఒత్తిడికి గురయ్యినప్పుడల్లా మీరు ఎలా నుంచున్నారో లేదా కూర్చొని ఉన్నారో మీ పోశ్చర్‌ను ఒకసారి గమనించుకోండి. సాధారణంగా ఒత్తిడి తీవ్రమైనప్పుడు చాలామంది ఒంగిపోయి, తల ఒంచుకుని ఉంటారు. ఇది మీ వెన్ను మీద ప్రభావం చూపే ప్రమాదం ఉంది. ఈ కింది చిట్కాలు పాటించి ఒత్తిడిని దూరం చేసుకోవచ్చు.

- మొదటగా మీకు తెలిసిందే... తలవంచుకుని లేదా తలవాల్చి ఉండవద్దు. నిటారుగా కూర్చోండి.
- ఎక్కువ సేపు కూర్చుని చేసే ఉద్యోగాల్లో ఉండే వారు ప్రతి అరగంటకి ఒకసారి లేచి నిలబడి అక్కడికక్కడే ఒకటిరెండు నిమిషాలు నడవండి.
- నడుం నొప్పి వచ్చేవారికి భుజంగాసనం చాలా బాగా పనిచేస్తుంది.

### కాళ్లు... పాదాలపై

చాలామందిలో ఒత్తిడి తమ పాదాలపై ప్రభావం చూపుతుంది. మరీ ఒత్తిడికి గురైన చాలా మందిలో పిక్కలు పట్టేయడం, కాళ్ల కండరాలు పట్టేయడం (మజిల్ క్రాంప్స్) కనిపిస్తాయి. ఒత్తిడి వల్ల కాళ్లు, పాదాలు ప్రభావితమయ్యేవారు ఈ కింది టిప్స్ పాటించాలి...

- కాళ్ళను కాస్తంత ఎత్తు మీద పీటలాంటిదానిపై పెట్టి ఉంచండి.
- మీ కాళ్ళను స్ట్రెచ్ చేసి మీ పాదాలను మీ వైపు తీసుకురావడానికి ప్రయత్నించండి, అలాగే దానికి వ్యతిరేక దిశలో మళ్లీ స్ట్రెచ్ చేయండి.
- నిలబడి గాని, కూర్చునిగాని ఒక కాలిని పైకి లేపి మడమను గుండ్రంగా రొటేట్ చేస్తున్నట్లుగా తిప్పాలి. మొదట కుడివైపుకు, తర్వాత ఎడమవైపుకు తిప్పాలి. రెండుకాళ్లతో ఇలా ఐదుసార్లు చేయాలి.
- పెడిక్యూర్ చేయడం /పాదాల మసాజ్ వల్ల కూడా పాదాలపై ఒత్తిడి తగ్గుతుంది.

### అదనంగా...

- పైన పేర్కొన్న వాటన్నింటితో పాటు టెన్నిస్, ఫుట్‌బాల్, బాస్కెట్ బాల్, హాకీ లేదా క్రికెట్ వంటి ఆటలు కూడా ఆడుతుండటం మంచిది.
- ప్రతి రోజు ఒక గంట ఎరోబిక్స్ చేయడం మంచిది. టీవీ చూస్తూ డ్యాన్స్ కూడా చేయవచ్చు.
- వాకింగ్, జాగింగ్, స్విమింగ్ వీటిలో ఏదో ఒకటి రోజుకు గంట పాటు చేయాలి.

వీటన్నింటి వల్ల మన గుండె , ఊపిరితిత్తులు, రక్తకణాలు చాలా ఆరోగ్యంగా ఉంటాయి. కండరాలు, కీళ్ళు గట్టిపడతాయి. దేహమంతా ఆరోగ్యంగా ఉంటుంది. ఎండార్ఫిన్స్ వంటి మంచి హార్మోన్లు విడుదలయ్యి అవి ఒత్తిడిని కలిగించే రసాయనాలకు వ్యతిరేకంగా పనిచేస్తాయి.



**డా. సుధీంద్ర ఊటూరి**
లైఫ్‌స్టైల్ స్పెషలిస్ట్,
కిమ్స్ హాస్పిటల్స్,
సికింద్రాబాద్

epaper.sakshi.com

సాక్షి
భవిత
సోమవారం నుంచి శుక్రవారం వరకు
స్పర్ధయా వర్ధతే విద్య
గురువారం
26-12-2019

మీ సలహాలు, సందేహాలు పంపాల్సిన చిరునామా
సాక్షి ఎడ్యుకేషన్ డెస్క్, సాక్షి దినపత్రిక,
రోడ్ నంబరు-1, బంజారాహిల్స్,
హైదరాబాద్-34. ఈ-మెయిల్
sakshieducation@gmail.com




# కొలువుల క్యాలెండర్

**చిన్న వయసులోనే కేంద్ర ప్రభుత్వ ఉద్యోగం సొంతం చేసుకోవాలని కలలు కనే అభ్యర్థులకు స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్సీ) సువర్ణావకాశాన్ని కల్పిస్తోంది. ప్రతీ సంవత్సరంలాగే 2020లో కూడా కొలువుల భర్తీకి సన్నాహకాలు చేస్తోంది. ఇప్పటికే పలు నోటిఫికేషన్లు విడుదల చేసింది. త్వరలో మరికొన్ని ప్రకటనలు జారీ చేయనుంది. తాజాగా ఎస్ఎస్సీ-2020 క్యాలెండర్ విడుదల చేసిన నేపథ్యంలో.. ఆయా నోటిఫికేషన్ల వివరాలు, భర్తీ చేయనున్న ఉద్యోగాలు, అర్హతలు, దరఖాస్తు తేదీలు, పరీక్ష విధానం, ఎంపిక తదితర అంశాలపై సమగ్ర కథనం...**

## ఎస్ఎస్సీ-కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్(సీజీఎల్)

### గ్రూప్-బీ, గ్రూప్- సీ పోస్టులు

కేంద్ర ప్రభుత్వ కొలువు సాధించడం చాలా మంది యువత కల. కేంద్రంలో గ్రూప్-బీ, గ్రూప్-సీ పోస్టులు ప్రధానమైనవి. వీటిని స్టాఫ్ సెలక్షన్ కమిషన్ 'కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవల్(సీజీఎల్)' పరీక్ష ద్వారా భర్తీ చేస్తుంది. గ్రూప్-బీ పోస్టుల్లో రెండు గెజిటెడ్ ఆఫీసర్(అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్, అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్) పోస్టులుంటాయి. అలాగే సెంట్రల్ సెక్రటేరియట్ సర్వీస్, ఇంటెలిజెన్స్ బ్యూరో, రైల్వే మినిస్టరీ, విదేశాంగ శాఖ, సీబీఐ, ఇన్‌కమ్ ట్యాక్స్, పోస్టల్ డిపార్ట్‌మెంట్, రెవెన్యూ డిపార్ట్‌మెంట్,ఎన్ఐఏ, సెంట్రల్ బ్యూరో ఆఫ్ నార్కోటిక్స్, కస్టమ్స్ డిపార్ట్‌మెంట్‌లలో గ్రూప్-బీ,సీ పోస్టులుంటాయి. వీటిలో ఫీల్డ్ జాబ్, డెస్క్ జాబ్ రెండు రకాలుంటాయి. ఫీల్డ్ జాబ్‌లో భాగంగా వివిధ కంపెనీలు, పరిశ్రమలు, కర్మాగారాలు సందర్శించి వారి నుంచి సమాచారం సేకరించడం, ప్రభుత్వ అనుమతులు, నిబంధనల ప్రకారం నడుపుతున్నారా లేదా, ట్యాక్సులు సక్రమంగా కడుతున్నారా లేదా వంటి విషయాలను పరిశీలించాలి. ఫీల్డ్ ఉద్యోగులు సేకరించిన సమాచారం ఆధారంగా డెస్క్ ఉద్యోగుల విధులుంటాయి.



- **అర్హత:** గ్రాడ్యుయేషన్ ఉత్తీర్ణత. డిగ్రీ చివరి సంవత్సరం చదువుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. జూనియర్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టులకు 10+2లో మ్యాథమెటిక్స్‌లో 60శాతం మార్కులు వచ్చుండాలి(లేదా) గ్రాడ్యుయేషన్‌లో స్టాటిస్టిక్స్ ఒక సబ్జెక్టుగా చదివుండాలి.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- **దరఖాస్తులు ప్రారంభం:** సెప్టెంబర్ 15, 2020
- **దరఖాస్తుకు చివరితేదీ:** అక్టోబర్ 15, 2020
- **పరీక్ష తేదీ:** దరఖాస్తుల ప్రారంభానికి ముందే వెబ్‌సైట్‌లో తెలియజేస్తారు.

### ఎంపిక

ఎంపిక ప్రక్రియ నాలుగంచెల్లో జరుగుతుంది. టైర్-1,2 పరీక్షలను ఆన్‌లైన్ విధానంలో నిర్వహిస్తారు. టైర్-3 డిస్క్రిప్టివ్ పరీక్ష. టైర్-4 కంప్యూటర్ స్కిల్ టెస్ట్. గతంలో ఉన్న ఇంటర్వ్యూ విధానం తీసేసి.. ఆ స్థానంలో టైర్-3, 4లను ప్రవేశ పెట్టారు. ప్రతి విభాగంలో నిర్దేశిత మార్కులు సాధిస్తేనే.. తర్వాతి పరీక్షలకు అర్హత లభిస్తుంది. ఆన్‌లైన్ పరీక్షలో రుణాత్మక మార్కులు (1/4 వంతు) ఉన్నాయి.

### పరీక్ష విధానం

- **టైర్-1:** ప్రతి విభాగం నుంచి 25 ప్రశ్నల చొప్పున మొత్తం నాలుగు విభాగాల్లో 100 ప్రశ్నలుంటాయి. ప్రతి ప్రశ్నకు రెండు మార్కులు. పరీక్ష సమయం 60 నిమిషాలు.
- **టైర్-2:** టైర్-1లో కనీస అర్హత మార్కులు పొందిన అభ్యర్థులందరూ దరఖాస్తు చేసుకున్న పోస్టులకు అతీతంగా పేపర్-1, పేపర్-2 పరీక్షలు రాయాలి.
- పేపర్-1లో మ్యాథమెటిక్స్, అర్థమెటిక్స్ అంశాల నుంచి 100 ప్రశ్నలు వస్తాయి. ప్రతి ప్రశ్నకు రెండు మార్కులు. పరీక్ష సమయం 2 గంటలు.
- పేపర్-2లో ఇంగ్లిష్ లాంగ్వేజ్ నుంచి 200 ప్రశ్నలు వస్తాయి. 200 మార్కులకు జరిగే ఈ పరీక్ష సమయం 2 గంటలు.
- జూనియర్ స్టాటిస్టికల్ ఆఫీసర్ పోస్టులకు దరఖాస్తు చేసుకున్న వారు పేపర్-3 రాయాలి. స్టాటిస్టిక్స్ విభాగం నుంచి 100 ప్రశ్నలు వస్తాయి. ప్రతి ప్రశ్నకు రెండు మార్కులు. పరీక్ష సమయం రెండు గంటలు.
- గ్రూప్-బీ గెజిటెడ్ పోస్టుకు దరఖాస్తు చేసుకున్న వారు పేపర్-4 రాయాలి. ఎకనామిక్స్, ఫైనాన్స్ అంశాల నుంచి 100 ప్రశ్నలు వస్తాయి. ప్రతి ప్రశ్నకు రెండు మార్కులు. పరీక్ష సమయం రెండు గంటలు.
- **టైర్-3:** ఇంగ్లిష్ లేదా హిందీ మాధ్యమాల్లో ఏదైనా ఒకటి ఎంచుకొని పెన్, పేపర్ విధానంలో డిస్క్రిప్టివ్ పరీక్ష రాయాలి. ఎస్సే, లెటర్, అప్లికేషన్ రైటింగ్ సంబంధిత ప్రశ్నలు వస్తాయి. 100 మార్కులకు జరిగే ఈ పరీక్షను 60 నిమిషాల వ్యవధిలో పూర్తి చేయాలి.
- **టైర్-4:** కంప్యూటర్ స్కిల్ టెస్ట్ లేదా కంప్యూటర్ ప్రొఫిషియన్సీ టెస్ట్‌లో అభ్యర్థుల టైపింగ్ సామర్థ్యాన్ని పరిశీలిస్తారు.

### ఏ విభాగం నుంచి ఎన్ని మార్కులు?

టైర్-1, 2 పరీక్షల్లో పేపర్-3, 4 మినహా మొత్తం 600 మార్కులకు సీజీఎల్ పరీక్ష జరుగుతుంది. ఇందులో జనరల్ ఇంటెలిజెన్స్ నుంచి 50 మార్కులు, జనరల్ అవేర్‌నెస్ నుంచి 50 మార్కులు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ నుంచి 250 మార్కులు, ఇంగ్లిష్ లాంగ్వేజ్, కాంప్రహెన్షన్ల నుంచి 250 మార్కులు ఉంటాయి. కాబట్టి క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, ఇంగ్లిష్ లాంగ్వేజ్‌ల నుంచి అత్యధిక మార్కులు తెచ్చుకున్న వారికి ఉద్యోగ అవకాశాలు ఎక్కువ.

## ఎస్ఎస్సీ-జూనియర్ ఇంజనీర్ ఎగ్జామినేషన్

కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిచే ప్రాజెక్టులు, పరిశోధన విభాగాలు, రక్షణ రంగ సంస్థల్లో జరిగే ఇంజనీరింగ్ పనుల పర్యవేక్షణ, అమలుకు అవసరమయ్యే సిబ్బందిని జూనియర్ ఇంజనీర్ పరీక్ష ద్వారా భర్తీ చేస్తారు. స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నిర్వహించే ఈ పరీక్ష ద్వారా ప్రతి ఏటా కేంద్ర ప్రభుత్వ శాఖల్లోని దాదాపు 21 విభాగాల్లో ఖాళీగా ఉన్న జూనియర్ ఇంజనీర్ ఉద్యోగాలకు అభ్యర్థులను ఎంపిక చేస్తారు. జూనియర్ ఇంజనీర్‌గా నియమితులైన వారు గ్రూప్-బీ(నాన్-గెజిటెడ్) విభాగంలో కేంద్ర



కొలువు సొంతం చేసుకోవచ్చు. వీరు కేంద్ర జల సంఘం, సీపీడబ్ల్యూడీ, మిలిటరీ, ఇంజనీరింగ్ సర్వీస్, బోర్డర్ రోడ్స్ ఆర్గనైజేషన్, కేంద్ర జల, విద్యుత్ రీసెర్చ్, నేషనల్ టెక్నికల్ రీసెర్చ్ ఆర్గనైజేషన్ తదితర కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో పనిచేసే అవకాశం లభిస్తుంది.

- **అర్హత:** సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, క్వాంటిటీ సర్వేయింగ్ అండ్ కాంట్రాక్ట్ విభాగాల్లో డిప్లొమా లేదా ఇంజనీరింగ్ ఉత్తీర్ణత.
- **వయసు:** పోస్టులను బట్టి 18-32 ఏళ్ల మధ్య ఉండాలి.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తు ఫీజు:** రూ.100
- **దరఖాస్తులు ప్రారంభం:** ఆగస్టు 4, 2020
- **దరఖాస్తుకు చివరితేదీ:** సెప్టెంబర్ 3, 2020.

### ఎంపిక విధానం

- జేఈ పరీక్ష రెండు విభాగాలు(పేపర్-1, 2)గా ఉంటుంది.
- **పేపర్-1:** కంప్యూటర్ బేస్డ్ విధానంలో జరిగే ఈ పరీక్షలో మూడు విభాగాలుంటాయి. జనరల్ ఇంటెలిజెన్స్-50 మార్కులు, జనరల్ అవేర్‌నెస్-50 మార్కులు, జనరల్ ఇంజనీరింగ్ (సివిల్, ఎలక్ట్రికల్, మెకానికల్ తదితర విభాగాల్లో ఏదో ఒకదాన్ని ఎంచుకోవాలి)-100 మార్కులు. మొత్తం 200 ప్రశ్నలు-200 మార్కులకుంటాయి. పరీక్ష సమయం రెండు గంటలు. నెగిటివ్ మార్కింగ్(0.25) విధానం ఉంది. పేపర్-1లో అర్హత సాధించిన వారే పేపర్-2 రాయడానికి అర్హులు.
- **పేపర్-2:** పేపర్-2లోనూ మూడు విభాగాలుంటాయి. అభ్యర్థి ఏ విభాగం(సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్, క్వాంటిటీ సర్వేయింగ్ అండ్ కాంట్రాక్) నుంచి డిప్లొమా లేదా ఇంజనీరింగ్ పూర్తిచేశారో ఆ విభాగంలో పరీక్ష రాయాల్సి ఉంటుంది. పేపర్-2లో ప్రతి ప్రశ్నకు లిఖిత పూర్వక సమాధానం రాయాలి. మొత్తం 300 మార్కులకు జరిగే ఈ విభాగంలో నెగిటివ్ మార్కింగ్ ఉండదు.

## ఎస్ఎస్సీ-కంబైన్డ్ హయ్యర్ సెకండరీ (10+2) ఎగ్జామ్

ఇంటర్మీడియట్ అర్హతతోనే కేంద్ర ప్రభుత్వ కొలువు సొంతం చేసుకోవడానికి చక్కటి మార్గం.. కంబైన్డ్ హయ్యర్ సెకండరీ(10+2) లెవల్(ఎస్ఎస్సీ సీహెచ్ఎస్ఎల్) పరీక్ష. స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్సీ) నిర్వహించే ఈ పరీక్ష ద్వారా కేంద్ర ప్రభుత్వ మంత్రిత్వ శాఖల్లోని డేటాఎంట్రీ ఆపరేటర్, లోయర్ డివిజన్ క్లర్క్(ఎల్‌డీసీ), పోస్టల్ అసిస్టెంట్స్, కోర్ట్ క్లర్క్ తదితర పోస్టులు భర్తీ చేస్తారు.

- **అర్హత:** ఇంటర్మీడియట్ తత్సమాన విద్యార్హత ఉండాలి
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **దరఖాస్తులు ప్రారంభం:** నవంబర్ 30, 2020
- **దరఖాస్తుకు చివరి తేదీ:** డిసెంబర్ 15, 2020
- **పరీక్షతేదీ:** దరఖాస్తులు ప్రారంభానికి ముందే వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచుతారు.

### ఎంపిక విధానం

ఈ పరీక్ష మొత్తం మూడంచెల్లో జరుగుతుంది. టైర్-1(కంప్యూటర్ బేస్డ్ ఆన్‌లైన్ ఎగ్జామ్), టైర్-2 (డిస్క్రిప్టివ్-పేపర్ అండ్ పెన్ విధానం), టైర్-3 (స్కిల్/టైపింగ్ టెస్ట్) ఉంటాయి. ప్రస్తుతం టైర్-1 పరీక్షకు సంబంధించి నోటిఫికేషన్ విడుదలైంది.



### టైర్-1 నోటిఫికేషన్ వివరాలు

- **దరఖాస్తులు ప్రారంభం:** డిసెంబర్ 3, 2019
- **దరఖాస్తుకు చివరితేదీ:** జనవరి 10, 2020
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- **దరఖాస్తు ఫీజు:** రూ.100
- **వయసు:** 2020, జనవరి 1 నాటికి 18-27 ఏళ్ల మధ్య ఉండాలి. రిజర్వేషన్ల ఆధారంగా మినహాయింపు ఉంటుంది.
- **అర్హత:** ఇంటర్మీడియట్.
- **పరీక్ష తేదీలు:** 2020, మార్చి 16 నుంచి 27 వరకు జరుగుతాయి.
- **తెలుగు రాష్ట్రాల్లో పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, విజయవాడ, విశాఖపట్నం, తిరుపతి, గుంటూరు, రాజమండ్రి, వరంగల్, కాకినాడ, కరీంనగర్, నెల్లూరు, విజయనగరం, చీరాల.

### పరీక్ష విధానం

ఇది కంప్యూటర్ ఆధారిత పరీక్ష. పరీక్ష సమయం 60 నిమిషాలు. నెగిటివ్ మార్కింగ్ విధానం అమల్లో ఉంది. ప్రతి తప్పు సమాధానానికి ఒక మార్కు కోత విధిస్తారు.

| క్రమ సంఖ్య | సబ్జెక్ట్ | ప్రశ్నల సంఖ్య | మార్కులు |
|---|---|---|---|
| 1 | జనరల్ ఇంటెలిజెన్స్ | 25 | 50 |
| 2 | జనరల్ అవేర్‌నెస్ | 25 | 50 |
| 3 | క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ (బేసిక్ అర్థమెటిక్ స్కిల్స్) | 25 | 50 |
| 4 | ఇంగ్లిష్ లాంగ్వేజ్ | 25 | 50 |
| | మొత్తం | 100 | 200 |

### టైర్-2

- **పరీక్ష తేదీ:** జూన్ 28, 2020.

ఈ పరీక్ష డిస్క్రిప్టివ్ విధానంలో జరుగుతుంది. పేపర్‌పై పెన్నుతో రాయాలి. వంద మార్కులకు ప్రశ్నపత్రం ఉంటుంది. పరీక్ష వ్యవధి గంట. ఇందులో రెండు రకాల ప్రశ్నలుంటాయి. అడిగిన అంశానికి సంబంధించిన వ్యాసాన్ని 200-250 పదాల్లో రాయాలి. ఉత్తరం లేదా దరఖాస్తును 150-200 పదాల్లో పూర్తి చేయాలి. జవాబులు హిందీ లేదా ఇంగ్లిష్‌లో రాయాలి. ఈ విభాగంలో కనీసం 33 శాతం మార్కులు పొందడం తప్పనిసరి.

### టైర్-3

దరఖాస్తు చేసుకున్న పోస్టును బట్టి స్కిల్ లేదా టైపింగ్ టెస్ట్ నిర్వహిస్తారు. లోయర్ డివిజన్ క్లర్క్/జూనియర్ సెక్రటేరియట్ అసిస్టెంట్, పోస్టల్ అసిస్టెంట్/సార్టింగ్ అసిస్టెంట్ పోస్టులకు స్కిల్ టెస్ట్ నిర్వహిస్తారు. డేటాఎంట్రీ ఆపరేటర్ పోస్టులకు టైపింగ్ టెస్ట్ ఉంటుంది. ఈ పరీక్షలో అర్హత సాధిస్తే సరిపోతుంది. డేటా ఎంట్రీ పోస్టులకు టైపింగ్ టెస్ట్‌లో భాగంగా కంప్యూటర్‌పై 15 నిమిషాలకు 2000 నుంచి 2200 కీ డిప్రిషన్స్ ఇవ్వాలి. కంప్ట్రోలర్ అండ్ ఆడిటర్ జనరల్ విభాగంలోని పోస్టులకు 15 నిమిషాలకు 3700 నుంచి 4000 కీ డిప్రిషన్స్ ఇవ్వాలి. ఏదైనా సమాచారం ఇచ్చి దాన్ని కంప్యూటర్‌పై టైప్ చేయమంటారు. తప్పులు టైపింగ్ చేస్తే మార్కుల కోత ఉంటుంది. టైపింగ్ టెస్టులో భాగంగా హిందీ లేదా ఇంగ్లిష్ ఎంచుకోవచ్చు. ఇంగ్లిష్‌లో నిమిషానికి 35, హిందీలో నిమిషానికి 30 పదాల చొప్పున టైప్ చేయాలి.

## ఎస్ఎస్సీ- సబ్‌ఇన్‌స్పెక్టర్, సీఏపీఎఫ్

స్టాఫ్ సెలక్షన్ కమిషన్ భర్తీచేసే కేంద్ర కొలువుల్లో.. సబ్ ఇన్‌స్పెక్టర్-ఢిల్లీ, సీఏపీఎఫ్ (సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్)-ఢిల్లీ ముఖ్యమైనవి. ఈ రెండు విభాగాల పోస్టుల భర్తీకి ఎస్ఎస్సీ ప్రతిఏటా నోటిఫికేషన్ విడుదల చేస్తుంది.

- **అర్హత:** బ్యాచిలర్ డిగ్రీ (ఢిల్లీ సబ్ ఇన్‌స్పెక్టర్ పోస్టులకు మోటార్ సైకిల్ (లేదా) కార్ డ్రైవింగ్ లైసెన్స్ ఉన్న పురుష అభ్యర్థులు మాత్రమే అర్హులు).
- **వయసు:** 20-25 ఏళ్ల మధ్య ఉండాలి.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో.
- **దరఖాస్తులు ప్రారంభం:** ఏప్రిల్ 17, 2020.
- **దరఖాస్తుకు చివరితేదీ:** మే 16, 2020.
- **పరీక్ష తేదీలు:** 2020, సెప్టెంబర్ 28 నుంచి అక్టోబర్ 1 వరకు.

### పరీక్ష విధానం

పేపర్-1, పేపర్-2లుగా పరీక్ష విధానం ఉంటుంది. కంప్యూటర్ బేస్డ్ విధానంలో జరిగే పేపర్-1లో అర్హత సాధించిన అభ్యర్థులకు పీఈటీ, పీఎస్‌టీ టెస్టులు నిర్వహిస్తారు. ఇందులో జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్, జనరల్ అవేర్‌నెస్, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్, ఇంగ్లిష్ కాంప్రహెన్షన్ విభాగాల నుంచి ప్రశ్నలుంటాయి. ఇందులో అర్హత సాధించిన వారే పేపర్-2కు అర్హులు. పేపర్-2లో పూర్తిగా ఇంగ్లిష్ లాంగ్వేజ్ అండ్ కాంప్రహెన్షన్‌పై 200 ప్రశ్నలకుగాను 200 మార్కులుంటాయి. పేపర్-1, 2ల్లో అర్హత సాధించిన వారికి మెడికల్ టెస్టులు నిర్వహించి ఉద్యోగాల్లోకి తీసుకుంటారు.

## ఎస్ఎస్సీ-మల్టీ టాస్కింగ్ స్టాఫ్ (ఎంటీఎస్)

పదోతరగతి ఉత్తీర్ణతతో కేంద్ర ప్రభుత్వంలోని వివిధ విభాగాల్లో కిందిస్థాయి ఉద్యోగాలను స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్సీ) భర్తీ చేస్తోంది. దీనికోసం మల్టీ టాస్కింగ్ స్టాఫ్(ఎంటీఎస్) పేరుతో ప్రతి ఏటా నోటిఫికేషన్ విడుదల చేస్తుంది. కేంద్ర ప్రభుత్వంలోని వివిధ విభాగాల్లో రోజువారీ కార్యక్రమాలు సక్రమంగా సాగడానికి సాయపడే గ్రూప్-సీ ఉద్యోగాలు ఈ విభాగం కిందకు వస్తాయి. ఈ ఉద్యోగాలకు ఎంపికైన వారు శాఖకు సంబంధించిన సమాచారాన్ని ఫోన్‌లలో అందించడం, ఫైల్స్ భద్రపరచడం, లేఖలను సంబంధిత విభాగాలకు చేరవేయడం, పోస్టల్ వర్క్.. ఇలా పలు రకాల విధులు నిర్వహిస్తూ పైఅధికారులకు సహాయ పడుతుంటారు. అందుకే వీరిని మల్టీ టాస్కింగ్ స్టాఫ్ అని వ్యవహరిస్తారు.

- **అర్హత:** పదోతరగతి
- **వయసు:** 18-25 ఏళ్ల మధ్య ఉండాలి
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- **దరఖాస్తులు ప్రారంభం:** జూన్ 2, 2020
- **దరఖాస్తుకు చివరి తేదీ:** జులై 15, 2020
- **పరీక్ష తేదీలు:** 2020, అక్టోబర్ 26 నుంచి నవంబర్ 13 వరకు.

### ఎంపిక ప్రక్రియ

- **పేపర్-1:** ఎంపిక రెండు (పేపర్-1, 2) దశల్లో ఉంటుంది. మొదటి దశ రాతపరీక్షలో ప్రశ్నలు ఆబ్జెక్టివ్ తరహాలో ఉంటాయి. ఒక్కో ప్రశ్నకు ఒక్కో మార్కు చొప్పున 100 మార్కులకు 100 ప్రశ్నలుంటాయి. జనరల్ ఇంగ్లిష్, జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్, న్యూమరికల్ ఆప్టిట్యూడ్, జనరల్ అవేర్‌నెస్ విభాగాల్లో ఒక్కో దాని నుంచి 25 ప్రశ్నలు వస్తాయి. పరీక్ష కాల వ్యవధి 90 నిమిషాలు. నెగిటివ్ మార్కింగ్(0.25) ఉంటుంది. ప్రశ్నలు ఇంగ్లిష్, హిందీ మాధ్యమాల్లో అడుగుతారు. పేపర్-1లో నిర్ణీత అర్హత మార్కులు సాధిస్తేనే రెండో దశ(పేపర్-2) డిస్క్రిప్టివ్ పరీక్షకు అర్హులు. పేపర్-2 కేవలం అర్హత పరీక్ష మాత్రమే. పేపర్-1లో సాధించిన మెరిట్ ఆధారంగానే తుది ఎంపిక ఉంటుంది.




- **పేపర్-2:** అర్హత పరీక్ష అయినప్పటికీ పేపర్-2 ను జాగ్రత్తగా రాయాల్సి ఉంటుంది. ఇంగ్లిష్, హిందీ, స్థానిక భాష(తెలుగు భాష)ల్లో జవాబులు రాయవచ్చు. 50 మార్కులకు జరిగే ఈ పరీక్షకు 30 నిమిషాల సమయం కేటాయించారు. ఎంచుకున్న భాషలో అభ్యర్థుల వ్యక్తీకరణ, రాత నైపుణ్యాలను ఇందులో పరిశీలిస్తారు. ప్రధానంగా ఎస్సే, లెటర్ రైటింగ్‌పై ప్రశ్నలుంటాయి. అక్షర దోషాలు, పద ప్రయోగాల్లో తప్పులు లేకుండా చూసుకోవాలి. వాక్యనిర్మాణం, విరామ చిహ్నాలపై శ్రద్ధ అవసరం. ఇంగ్లిష్‌లో సమాధానాలు రాసే వారు క్యాపిటల్, స్మాల్ లెటర్ల వినియోగంపై అవగాహన కలిగి ఉండాలి.

## ఎస్ఎస్సీ-స్టెనోగ్రాఫర్స్ (గ్రేడ్-సీ, డీ)

స్టాఫ్ సెలక్షన్ కమిషన్(ఎస్ఎస్సీ) ఇంటర్ అర్హతతో కేంద్ర ప్రభుత్వ సంస్థల్లో గ్రేడ్-సీ, డీ కేటగిరీల్లో స్టెనోగ్రాఫర్ ఉద్యోగం పొందే అవకాశం కల్పిస్తుంది. వీటి భర్తీ కోసం ప్రతిఏటా అఖిల భారత స్థాయిలో రాతపరీక్ష నిర్వహిస్తుంది.

- **అర్హత:** ఇంటర్మీడియట్ (స్టెనోగ్రఫీ సర్టిఫికెట్ ఉండాలి).
- **వయసు:** గ్రేడ్-సీ పోస్టులకు 18-30; గ్రేడ్-డీ పోస్టులకు 18-27 ఏళ్ల మధ్య ఉండాలి.
- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్/ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి
- **దరఖాస్తులు ప్రారంభం:** ఆగస్టు 4, 2020
- **దరఖాస్తుకు చివరితేదీ:** సెప్టెంబర్ 3, 2020.
- **పరీక్ష తేదీలు:** 2020, డిసెంబర్ 1 నుంచి 3 వరకు.

### ఎంపిక విధానం

రెండు దశల్లో ఎంపిక ప్రక్రియ జరుగుతుంది. మొదటిది కంప్యూటర్ ఆధారిత పరీక్ష (సీబీటీ), రెండోది స్కిల్ టెస్ట్.



- **మొదటి దశ:** జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ 50 ప్రశ్నలు-50 మార్కులు, జనరల్ అవేర్‌నెస్ 50 ప్రశ్నలు-50 మార్కులు, ఇంగ్లిష్ అండ్ కాంప్రహెన్షన్ 100 ప్రశ్నలు-100 మార్కులుంటాయి. మొత్తం 200 మార్కులకు జరిగే ఈ పరీక్ష కాల వ్యవధి 2 గంటలు. ప్రతి తప్పు సమాధానానికి 0.25 మార్కుల కోత విధిస్తారు.
- **రెండో దశ:** ఇది పూర్తిగా స్కిల్ టెస్ట్. మొదటి దశలో అర్హత సాధించిన వారికి ఈ పరీక్ష నిర్వహిస్తారు. ఇక్కడ కూడా నిర్ణీత మార్కులు సాధించాల్సి ఉంటుంది. ఇక్కడ అభ్యర్థులకు ఇంగ్లిష్ లేదా హిందీలో 10 నిమిషాల వ్యవధి గల డిక్టేషన్ ఇస్తారు. గ్రేడ్-సీ అభ్యర్థులు ఇంగ్లిష్/హిందీ భాషల్లో నిమిషానికి 100 పదాలు కంప్యూటర్‌పై స్టెనోగ్రఫీ చేయాలి. అలాగే గ్రేడ్-డీ అభ్యర్థులు ఇంగ్లిష్/హిందీ భాషల్లో నిమిషానికి 80 పదాలు స్టెనోగ్రఫీ చేయాలి.

### స్టెనోగ్రఫీకి కేటాయించే సమయం

- **గ్రేడ్-సీ పోస్టులు..** 40 నిమిషాలు (ఇంగ్లిష్); 55 నిమిషాలు (హిందీ).
- **గ్రేడ్-డీ పోస్టులు..** 50 నిమిషాలు (ఇంగ్లిష్); 65 నిమిషాలు (హిందీ).
- **వెబ్‌సైట్:** https://ssc.nic.in



సాక్షి స్పోర్ట్స్
గురువారం 26-12-2019

**పేస్ గ్రాండ్‌స్లామ్ టైటిల్స్**

**పురుషుల డబుల్స్**
ఆస్ట్రేలియన్ ఓపెన్: 2012
ఫ్రెంచ్ ఓపెన్: 1999, 2001, 2009
వింబుల్డన్: 1999
యూఎస్ ఓపెన్: 2006, 2009, 2013

**మిక్స్‌డ్ డబుల్స్**
ఆస్ట్రేలియన్ ఓపెన్: 2003, 2010, 2015
ఫ్రెంచ్ ఓపెన్: 2016
వింబుల్డన్: 1999, 2003, 2010, 2015
యూఎస్ ఓపెన్: 2008, 2015

# ఇక మిగిలింది 2020

**మూడు దశాబ్దాల ఆటకు వీడ్కోలు పలుకనున్న భారత టెన్నిస్ దిగ్గజం లియాండర్ పేస్**

29 ఏళ్ల క్రితం... 16 ఏళ్ల ఒక టీనేజీ కుర్రాడు తొలిసారి భారత జట్టు తరఫున డేవిస్ కప్ మ్యాచ్ ఆడాడు. డబుల్స్ మ్యాచ్‌లో సీనియర్ సహచరుడు జీషాన్ అలీతో కలిసి ఐదు సెట్ల సుదీర్ఘ పోరులో జపాన్‌పై భారత్ గెలవడంలో కీలకపాత్ర పోషించాడు. నాటి అతని పోరాటపటిమ ఒక్కసారిగా టెన్నిస్ ప్రపంచం దృష్టిని ఆకర్షించింది.

ఇప్పుడు 46 ఏళ్ల ప్రాయంలోనూ కూడా అదే ఉత్సాహం, అదే జోరు... పాయింట్, గేమ్, సెట్, మ్యాచ్... దినచర్యలో భాగంగా మారిపోయిన ఈ అంకెల కోసం కోర్టు నలుమూలలా పరుగెత్తుతూనే ఉన్న ఆ శరీరానికి అలసట వచ్చేసింది. వయసును గెలిచిన 'ఆ కుర్రాడు' వచ్చే ఏడాది తన మూడు దశాబ్దాల టెన్నిస్ కెరీర్‌కు ముగింపు పలకాలని నిర్ణయించుకున్నాడు.

సాక్షి క్రీడా విభాగం

18 గ్రాండ్‌స్లామ్ టైటిల్స్... ఒలింపిక్స్‌లో కాంస్య పతకం... 55 కెరీర్ టైటిల్స్... ఇవన్నీ ఒక ఎత్తయితే, 'వయసు' దాటిన తర్వాత తన పేర వరుసగా లిఖించుకుంటూ వస్తున్న రికార్డులకైతే అంతే కనిపించడం లేదు. అలసిపోవడం లేదు, ఫిట్‌నెస్ సమస్యలు అసలే లేవు, కాలు నొప్పితోనో, వేలు నొప్పితోనో ఆటకు దూరమైన రోజులే లేవు... ఈ మనిషికి ఎలా సాధ్యం. మూడు పదులు దాటగానే కెరీర్ చరమాంకంలోకి వచ్చిందని చాలా మంది భావించే ఆటలో 46 ఏళ్ల వయసు వచ్చినా గ్రాండ్‌గా ఆడి చూపిస్తున్న అద్భుతం పేరే లియాండర్ పేస్. అతను తొలి డేవిస్ కప్ మ్యాచ్ ఆడిన రోజు నుంచి డేవిస్ కప్‌లో కొత్త రికార్డు సృష్టించే వరకు టెన్నిస్‌లో తరం మారిపోయింది. అతను వచ్చే సమయానికి స్టీఫెన్ ఎడ్‌బర్గ్, బోరిస్ బెకర్, ఇవాన్ లెండిల్‌లాంటి వాళ్లు ఆటకు గుడ్‌బై చెప్పే దశలో ఉన్నారు. ఆ తర్వాత సంప్రాస్, అగస్సీలతో సమాంతరంగా పేస్ కెరీర్ సాగింది. ఇప్పుడు ఫెడరర్, నాడల్, జొకోవిచ్‌ల కాలంలోనూ పేస్ రాకెట్ మాట్లాడుతూనే ఉంది. పేస్ ఆడేది డబుల్స్‌లోనే అయినా మ్యాచ్ ఫిట్‌నెస్ పరంగా చూస్తే అదేమీ తక్కువ శ్రమతో కూడింది కాదు. టీమ్ గేమ్ అయిన క్రికెట్‌లో 24 ఏళ్లు ఆడిన సచిన్‌ను ఆశ్చర్యంతో భారత క్రీడాభిమానులు చూశారు. కానీ టెన్నిస్‌లాంటి క్రీడలో 29 ఏళ్లుగా సత్తా చాటడం పేస్‌లాంటి దిగ్గజానికే సాధ్యమైంది.

## అట్లాంటాతో అంబరాన...

పేస్ 1990లో జూనియర్ వింబుల్డన్... 1991లో జూనియర్ యూఎస్ ఓపెన్ గెలిచి వరల్డ్ నంబర్‌వన్‌గా నిలిచినప్పుడు కూడా అతను ఇంత సుదీర్ఘకాలం సాగిపోగలడని ఎవరూ ఊహించలేదు. జూనియర్ స్థాయిలో సంచలనాలు చేసి అంతటితో సరిపెట్టే ఆటగాళ్ల జాబితాలోకి అతడిని చేర్చారు. 1992 బార్సిలోనా ఒలింపిక్స్‌లో వైఫల్యంతో అందరికీ అదే అనిపించింది. కానీ నాలుగేళ్ల తర్వాత పేస్ భారత జెండాను విశ్వవేదికపై రెపరెపలాడించాడు. నాడు 126వ ర్యాంక్‌లో ఉండి ఏ మాత్రం ఆశలు లేని స్థితిలో 44 ఏళ్ల తర్వాత భారత్‌కు వ్యక్తిగత ఒలింపిక్ పతకం అందించాడు. ఆ గెలుపుతో హీరోగా మారిన పేస్... ఇప్పటికీ తనపై నమ్మకాన్ని నిలబెట్టుకుంటూనే ఉన్నాడు. తన ఘనతలతో ప్రపంచాన్ని ఆశ్చర్యపరుస్తూనే ఉన్నాడు. ఒలింపిక్ పతకం మొదలు అనేక సంచలన విజయాలు పేస్ వెంట నడుస్తూ వచ్చాయి. ఈ పెద్ద జాబితాలో ఒకసారి సింగిల్స్‌లో పీట్ సంప్రాస్‌ను ఓడించిన చిరస్మరణీయ మ్యాచ్ కూడా ఉంది.




పేస్ ప్రతిభకు గుర్తింపుగా భారత ప్రభుత్వం 1990లో అర్జున అవార్డు... 1996-1997లో దేశ అత్యున్నత క్రీడా పురస్కారం 'రాజీవ్ ఖేల్ రత్న'... 2001లో 'పద్మశ్రీ'... 2014లో 'పద్మభూషణ్' అవార్డులు అందజేసింది.

## డేవిస్ కప్ సూపర్ స్టార్...

పేస్‌కు సంబంధించి ప్రతీ భారతీయుడు మెచ్చే, అతని నుంచి ఆశించే విషయం డేవిస్ కప్ పోటీల్లో అతని అద్భుత ప్రదర్శన. ప్రత్యర్థి ఎదురుగా నిలబడగానే వాలి బలం రెట్టింపు అయిపోయినట్లు... భారత జట్టు తరఫున ఆడే సమయంలో పేస్ ఆటతీరు కూడా ఒక్కసారిగా అద్భుతంగా మారిపోతుంది. ఏటీపీ టోర్నీల సంగతి ఎలా ఉన్నా... దేశానికి ప్రాతినిధ్యం వహించే సమయంలో అతని రాకెట్ మరింత పదునెక్కుతుంది. ఇన్నేళ్లలో అది ఎన్నోసార్లు నిరూపితమైంది. ఒలింపిక్స్ పతకం తర్వాత లియాండర్ ఆడిన అన్ని డేవిస్‌కప్ మ్యాచ్‌లలో ఇది పదే పదే కనిపించింది. తనలో కూడా కొత్త శక్తి వచ్చేస్తుందని అతను కూడా దీని గురించి చెప్పుకున్నాడు. ప్రత్యర్థి ఎంత బలమైన ఆటగాడు అయినా వీరోచిత ప్రదర్శనతో పేస్ డేవిస్ కప్‌లో భారత్‌కు ఎన్నో గొప్ప విజయాలు అందించాడు. హెన్రీ లెకాంటే, ఇవాన్‌సెవిచ్, టిమ్ హెన్మన్, వేన్ ఫెరీరా తదితరులతో పాటు ఆ సమయంలో టాప్ ర్యాంక్‌లలో ఉన్న పలువురు ఆటగాళ్లపై వచ్చిన స్ఫూర్తిదాయక విజయాలు ఈ జాబితాలోనివే. 1993లో డేవిస్‌కప్ వరల్డ్ గ్రూప్‌లో భారత్ సెమీస్ చేరడంలో పేస్‌దే కీలక పాత్ర.

## మృత్యువుతో పోరాడి...

2003లో వింబుల్డన్ క్వార్టర్ ఫైనల్ ఆడుతున్న సమయంలో అటు వైపు కోర్టు నుంచి బంతి పేస్ వైపు వచ్చింది. సునాయాసంగా రిటర్న్ చేయాల్సిన అతను, ఏమీ చేయకుండా అలా బంతిని చూస్తుండిపోయాడు. ఎదురుగా అంతా చీకటి, కళ్లు బైర్లు కమ్మాయి. శరీరంపై నియంత్రణ లేక నిలబడేందుకు భాగస్వామి మార్టినా నవ్రతిలోవాను పట్టుకున్నాడు. అది బ్రెయిన్ క్యాన్సర్ కావచ్చని, ఎంతో కాలం బతకడం కూడా కష్టమని ప్రాథమికంగా కొందరు డాక్టర్లు తేల్చారు. చివరకు అమెరికాలోని ఒర్లాండోలో అండర్సన్ క్యాన్సర్ సెంటర్‌లో చికిత్స తర్వాత ప్రమాదం లేదని తెలిసింది. చివరకు న్యూరోసిస్టోసర్కోసిస్ అనే నరాల సమస్యగా తేలింది. ఇలాంటి స్థితిలో ఆడలేనంటూ పేస్‌కు మద్దతుగా యూఎస్ ఓపెన్ నుంచి తప్పుకునేందుకు కూడా మార్టినా నవ్రతిలోవా సిద్ధమైంది. దాని నుంచి కోలుకున్న తర్వాత పేస్ మళ్లీ ప్రాక్టీస్‌కు దిగి తన విజయాలకు శ్రీకారం చుట్టాడు.




ముందుగా నా తల్లిదండ్రులకు కృతజ్ఞతలు. నేర్పిన క్రమశిక్షణ, చేసిన మార్గదర్శనం, కల్పించిన వాతావరణం ఇవన్నీ నన్ను ఈ స్థాయికి తీసుకొచ్చాయి. వారు నా పట్ల కనబరిచిన అనిర్వచనీయమైన ప్రేమ ఎప్పటికీ మరువలేను. అమ్మా–నాన్న... మీరు లేకుంటే నేనూ లేను. ఐ లవ్ యూ.

మా అక్కలకు థ్యాంక్స్ చెప్పాలి. జాక్వి, మరియాలిద్దరు నాకంటే పెద్దవాళ్లు. వాళ్లే నన్నింతలా మార్చేశారు. జీవన ప్రయాణంలో ఎత్తుపల్లాలు అర్థమయ్యేలా చేశారు. నేనో పరిపూర్ణ వ్యక్తిగా ఎదిగేందుకు బాగా సహకరించారు. తల్లిదండ్రులు చెప్పిన నైతిక విలువల్ని నేనూ పాటించేలా చేశారు. ఐ లవ్ యూ సిస్టర్స్.

ఇక నా గారాలపట్టి... కుమార్తె అయానా! పాప లవ్స్ యూ. ఈ ప్రపంచంలో అత్యంత అందమైన అంశం కూతుర్ని కలిగి ఉండటం అనేది నీ వల్లే నాకు అర్థమైంది. అయానా నీవే నాకు స్ఫూర్తి.

నా కెరీర్‌లో మిగిలున్నది 2020 టెన్నిస్ క్యాలెండరే! కేవలం ఎంపిక చేసుకున్న టోర్నీలే ఆడతాను. నా జట్టుతో చేసే ఆఖరి క్రీడా పయనాన్ని గొప్పగా మలచుకుంటా. సహచరులు, మిత్రులు, అభిమానులతో ఆనందంగా గడుపుతా. నా సుదీర్ఘ ప్రయాణానికి అండగా నిలిచిన వారందరికీ థ్యాంక్స్.

అభిమానులకు విన్నపం. నాతో ఎవరికైనా మధుర జ్ఞాపకాలు, తీపి గుర్తులు ఉంటే 'లియాండర్ మెమోరిస్'కు షేర్ చేయండి. నేను నా మధుర స్మృతుల్ని మీతో పంచుకుంటాను. 'గుడ్‌బై ఇయర్'గా 2020 నాకు ఉద్వేగంగా గడువనుంది. భారంగా నేను రాకెట్‌ను విడువనున్నాను.

– ట్విట్టర్‌లో లియాండర్ పేస్

## కొన్ని విశేషాలు....

● అంతర్జాతీయ టెన్నిస్‌లో 700కు పైగా విజయాలు సాధించిన కేవలం ఎనిమిది మంది ఆటగాళ్ళలో ఒకడు. 18 గ్రాండ్‌స్లామ్‌లు (8 పురుషుల డబుల్స్, 10 మిక్స్‌డ్ డబుల్స్) గెలిచాడు. ● వరుసగా 7 ఒలింపిక్స్‌లలో (1992, 1996, 2000, 2004, 2008, 2012, 2016) పాల్గొన్న ఏకైక టెన్నిస్ ఆటగాడు. 1999లో డబుల్స్ విభాగంలో ప్రపంచ నంబర్‌వన్ ర్యాంక్‌లో నిలిచాడు. వరుసగా 19 సీజన్ల పాటు (1997–2015) ఏడాదికి కనీసం ఒక్క టైటిల్ అయినా గెలిచాడు. ● తన ప్రొఫెషనల్ కెరీర్‌లో పేస్ ఇప్పటివరకు 55 టైటిల్స్ సాధించాడు. ఇందులో సింగిల్స్‌లో ఒక టైటిల్ ఉండగా... మిగతా 54 టైటిల్స్ డబుల్స్ విభాగంలో వచ్చాయి. ● సింగిల్స్ విభాగంలో పేస్ 101 మ్యాచ్‌ల్లో గెలిచి... 99 మ్యాచ్‌ల్లో ఓడిపోయాడు. డబుల్స్‌లో పేస్ 767 మ్యాచ్‌ల్లో విజయం సాధించి... 455 మ్యాచ్‌ల్లో ఓడిపోయాడు. ఇప్పటివరకు తన కెరీర్‌లో పేస్ 85,71,006 డాలర్ల ప్రైజ్‌మనీ (రూ. 61 కోట్ల 11 లక్షలు) సంపాదించాడు. ● 1990లో జపాన్‌పై డేవిస్ కప్‌లో అరంగేట్రం చేసిన పేస్ 57 సార్లు డేవిస్ కప్ బరిలోకి దిగాడు. 92 మ్యాచ్‌ల్లో గెలిచి (సింగిల్స్‌లో 48; డబుల్స్‌లో 44)... 35 మ్యాచ్‌ల్లో (సింగిల్స్‌లో 22; డబుల్స్‌లో 12) ఓడిపోయాడు. డేవిస్‌కప్ చరిత్రలో అత్యధిక డబుల్స్ విజయాలు (44) సాధించిన ప్లేయర్‌గా పేస్ ప్రపంచ రికార్డు సృష్టించాడు.

## వచ్చే ఏడాదే ఆఖరు...

పేస్ ఆటతీరు భీకరమైన సర్వీస్‌లు, బెంబేలెత్తించే ఏస్‌లతో సాగదు. ఇన్నేళ్ల కెరీర్‌లో కూడా అతను వాలీలు, డ్రాప్ షాట్‌లనే నమ్ముకున్నాడు. ముఖ్యంగా నెట్ వద్ద పేస్ ఆట తన పార్ట్‌నర్ ఎవరైనా వారికి కొండంత అండ. టెన్నిస్ కుర్రాళ్ల ఆటగా మారిపోయిన ఈతరంలో కూడా పేస్ నెట్ వద్ద అత్యంత బలమైన ఆటగాడు అంటూ ఇటీవల మాజీ సహచరుడు మహేశ్ భూపతి ప్రశంసించడం అతని ఆటలో ఇంకా పదును మిగిలి ఉందనే చూపిస్తోంది. రాడ్ లేవర్ తర్వాత మూడు వేర్వేరు దశాబ్దాల్లో వింబుల్డన్ నెగ్గిన ఏకైక ఆటగాడైన పేస్, 100కు పైగా వేర్వేరు భాగస్వాములతో కలిసి డబుల్స్ బరిలోకి దిగాడు. ఇటీవల పదే పదే అతని రిటైర్మెంట్‌పై వార్తలు రావడం, దానిని అతను ఖండించడం చాలా సార్లు జరిగాయి. వయసు పెరిగిన కొద్దీ ఇలాంటివి వినిపించడం సహజం. అయితే ఆటను పిచ్చిగా ప్రేమించే పేస్, ఏ స్థాయిలోనైనా దానిని కొనసాగించేందుకు ఇష్టపడుతున్నాడు. దాదాపు 20 ఏళ్ల తర్వాత భారత్‌లో తొలిసారి అతను చాలెంజర్ టోర్నీ ఆడటానికి కూడా అదే కారణం. డబుల్స్‌లో ప్రస్తుతం ప్రపంచ 105వ ర్యాంకర్‌గా ఉన్న పేస్ వచ్చే ఏడాది కెరీర్‌కు వీడ్కోలు పలుకనున్నట్లు బుధవారం అధికారికంగా ప్రకటించాడు.



# ధావన్ అజేయ శతకం

**ఫామ్ చాటుకున్న ఓపెనర్ ● ఢిల్లీ 269/6 ● హైదరాబాద్‌తో రంజీపోరు**

న్యూఢిల్లీ: ఈ ఏడాది గాయాలతో సతమతమైన భారత ఓపెనర్ శిఖర్ ధావన్ రంజీమ్యాచ్‌లో అజేయ సెంచరీతో ఫామ్‌లోకి వచ్చాడు. 15 నెలల తర్వాత తొలి ఫస్ట్ క్లాస్ మ్యాచ్ ఆడుతున్న ఈ 'గబ్బర్' హైదరాబాద్ బౌలర్లకు తన తడాఖా చూపించాడు. ఉదయం గడ్డకట్టించే శీతల సమయంలో అతనొక్కడే ప్రత్యర్థి బౌలర్లను దీటుగా ఎదుర్కొన్నాడు. తొలిరోజు ఆటలో అతను (198 బంతుల్లో 137 బ్యాటింగ్; 19 ఫోర్లు, 2 సిక్స్‌లు) వీరోచిత ప్రదర్శన కనబరిచాడు. మొదట బ్యాటింగ్‌కు దిగిన ఢిల్లీని హైదరాబాద్ బౌలర్లు సిరాజ్ (2/60), మెహదీ హసన్ (3/61) కుదిపేశారు. ఒక దశలో 4 పరుగులకే 2 వికెట్లు కోల్పోయిన ఢిల్లీని కెప్టెన్ ధావన్ ఆదుకున్నాడు. కీలక వికెట్లన్నీ పడటంతో బాధ్యతగా ఆడి తొలిరోజు పూర్తయ్యేవరకు క్రీజులో నిలిచాడు. మిగతా వారిలో నితీశ్ రాణా (25; 5 ఫోర్లు), అనూజ్ (29; 3 ఫోర్లు, 1 సిక్స్), కున్వర్ (22 బ్యాటింగ్; 2 ఫోర్లు, 1 సిక్స్) రెండంకెల స్కోర్లు చేశారు. ఆరో వికెట్‌కు రావత్‌తో కలిసి 84 పరుగులు జోడించిన ధావన్... అబేధ్యమైన ఏడో వికెట్‌కు కున్వర్‌తో 57 పరుగులు జతచేశాడు. హైదరాబాద్ బౌలర్లలో సీవీ మిలింద్‌కు ఒక వికెట్ దక్కింది. తొలి రోజు ఆట ముగిశాక ఢిల్లీ ఆటగాడు కునాల్‌కు, హైదరాబాద్ ప్లేయర్ తన్మయ్ అగర్వాల్‌కు జాతీయ డోపింగ్ నిరోధక సంస్థ (నాడా) డోపింగ్ పరీక్షలు నిర్వహించింది.

### అభిషేక్ సెంచరీ: బెంగాల్ 241/4



కోల్‌కతా: ఓపెనర్ అభిషేక్ రామన్ (255 బంతుల్లో 110 బ్యాటింగ్; 13 ఫోర్లు, 1 సిక్స్) అజేయ శతకం సాధించడంతో... ఆంధ్రతో బుధవారం మొదలైన రంజీ ట్రోఫీ లీగ్ మ్యాచ్‌లో బెంగాల్ భారీ స్కోరు దిశగా సాగుతోంది. తొలి రోజు ఆట నిలిచే సమయానికి బెంగాల్ 83 ఓవర్లలో 4 వికెట్ల నష్టానికి 241 పరుగులు చేసింది. ఆంధ్ర కెప్టెన్ హనుమ విహారి సహా ఆరుగురు బౌలర్లు రోజంతా శ్రమించినా ప్రత్యర్థి ఇన్నింగ్స్‌లో 4 వికెట్లను మించి పడగొట్టలేకపోయారు. కౌశిక్ ఘోష్ (37; 5 ఫోర్లు)తో కలిసి రెండో వికెట్‌కు 66 పరుగులు జోడించిన అభిషేక్ తర్వాత మూడో వికెట్‌కు కెప్టెన్ మనోజ్ తివారీ (46; 6 ఫోర్లు, 1 సిక్స్)తో కలిసి 87 పరుగులు జతచేశాడు. దీంతో బెంగాల్ ఇన్నింగ్స్ సాఫీగా సాగిపోయింది. ఆంధ్ర బౌలర్లలో స్టీఫెన్ 2 వికెట్లు పడగొట్టగా... షోయబ్ ఖాన్, పృథ్వీరాజ్ చెరో వికెట్ తీశారు.

# నేడు 'బాక్సింగ్ డే' టెస్టుల షురూ

**మెల్‌బోర్న్‌లో న్యూజిలాండ్‌తో ఆసీస్ ● సెంచూరియన్‌లో ఇంగ్లండ్‌తో దక్షిణాఫ్రికా 'ఢీ'**

మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా టాపార్డర్ బ్యాట్స్‌మన్ లబ్‌షేన్‌ను అరుదైన సెంచరీ చాన్స్ ఊరిస్తోంది. అతను గత మూడు టెస్టుల్లోనూ శతకం సాధించాడు. ఇప్పుడు ఇక్కడా శతక్కొడితే... వరుసగా నాలుగు టెస్టుల్లో సెంచరీలు చేసిన ఆరో ఆస్ట్రేలియన్‌గా నిలుస్తాడు. ఈ జాబితాలో బ్రాడ్‌మన్ మూడు సార్లు ఈ ఘనతకెక్కాడు. తర్వాత ఫింగ్లెటన్, హార్వీ, హేడెన్, స్మిత్ వరుసగా నాలుగు టెస్టుల్లో సెంచరీలు చేశారు. మరోవైపు తొలి టెస్టు పరాజయంతో సిరీస్‌లో వెనుకబడిన న్యూజిలాండ్ 'బాక్సింగ్ డే' టెస్టులో ప్రతాపం చూపాలని గట్టి పట్టుదలతో ఉంది. అయితే కివీస్‌కు మెల్‌బోర్న్ క్రికెట్ గ్రౌండ్ (ఎంసీజీ) ఎప్పుడూ కలిసి రాలేదు. ఇక్కడ మూడు మ్యాచ్‌లాడిన న్యూజిలాండ్ రెండు ఓడి, ఒకదాంట్లో 'డ్రా' చేసుకుంది. కానీ ఈసారి ఆ రికార్డును మార్చేపనిలో ఉంటామని న్యూజిలాండ్ కెప్టెన్ విలియమ్సన్ అన్నాడు. ఆతిథ్య జట్టేమో ఈ మ్యాచ్ కూడా గెలిచి... మరోటి మిగిలుండగానే మూడు టెస్టుల సిరీస్‌ను 2–0తో కైవసం చేసుకోవాలని ఆశిస్తోంది. మెల్‌బోర్న్‌లాంటి బౌన్సీ వికెట్ పిచ్‌లపై ఐదుగురు బౌలర్లను బరిలోకి దించాలని యోచిస్తోంది. హాజెల్‌వుడ్ స్థానంలో ప్యాటిన్సన్ తుది జట్టులోకి వచ్చాడు. కమిన్స్, స్టార్క్, లయన్‌లతో ఐదో బౌలర్‌గా మైకెల్ నెసెర్‌ను తీసుకునే అవకాశముందని కోచ్ లాంగర్ చెప్పాడు.



వార్నర్ ప్రాక్టీస్



రూట్, డుప్లెసిస్

సెంచూరియన్: గాయాలతో సతమతమవుతున్న ఇంగ్లండ్... ఆతిథ్య దక్షిణాఫ్రికాతో తొలిటెస్టుకు సిద్ధమైంది. ఇరు జట్ల మధ్య గురువారం నుంచి 'బాక్సింగ్ డే' పోరు జరగనుంది. పేస్ బౌలర్లు స్టువర్ట్ బ్రాడ్, జోఫ్రా ఆర్చర్, క్రిస్ వోక్స్, స్పిన్నర్ జాక్ లీచ్... ఇలా కీలక ఆటగాళ్లు 'ఫ్లూ' జ్వరాలతో బాధపడుతున్నారు. తన తండ్రి అనారోగ్యం కారణంగా స్టార్ ఆల్‌రౌండర్ బెన్ స్టోక్స్ కూడా ఆడేది అనుమానంగా మారింది. ఇది ఇంగ్లిష్ జట్టు కూర్పునకు పెను సమస్యగా మారింది. అయితే అందుబాటులో ఉన్న ఆటగాళ్లు సత్తాచాటేందుకు సిద్ధంగా ఉన్నారని కెప్టెన్ జో రూట్ తమ జట్టులో స్థైర్యాన్ని పెంచే ప్రకటన చేశాడు. మరోవైపు సొంతగడ్డపై బలంగా కనబడుతున్న దక్షిణాఫ్రికా జట్టు మొదటి రోజు నుంచే 'దెబ్బ'తిన్న ఇంగ్లండ్‌పై పైచేయి సాధించాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ టెస్టుతో తమ బ్యాట్స్‌మన్ రస్సీ వాన్‌డెర్ డస్సెన్ అంతర్జాతీయ టెస్టుల్లో అరంగేట్రం చేస్తాడని దక్షిణాఫ్రికా కెప్టెన్ ఫాఫ్ డుప్లెసిస్ తెలిపాడు. అలాగే ఆల్‌రౌండర్ డ్వేన్ ప్రిటోరియస్ కూడా అరంగేట్రం చేసే అవకాశముందని చెప్పాడు. ఐసీసీ టెస్టు చాంపియన్‌షిప్‌లో భాగమైన ఈ సిరీస్‌లో ఇరు జట్లు నాలుగు టెస్టు మ్యాచ్‌ల్లో తలపడతాయి. ప్రస్తుతం ఇంగ్లండ్ 56 పాయింట్లతో ఆరో స్థానంలో ఉండగా... దక్షిణాఫ్రికా ఇంకా ఖాతానే తెరువకపోవడంతో అట్టడుగున 9వ స్థానంలో ఉంది.

## టైటిల్‌తో సీజన్ ముగించేనా?

**● ప్రపంచ ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్ టోర్నీ బరిలో హంపి, హారిక**



హంపి



హారిక

మాస్కో: ఆంధ్రప్రదేశ్ చెస్ గ్రాండ్‌మాస్టర్లు కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక ఈ సంవత్సరంలో చివరి టోర్నమెంట్‌కు సిద్ధమయ్యారు. మాస్కోలో నేడు మొదలయ్యే ప్రపంచ ర్యాపిడ్, బ్లిట్జ్ చెస్ చాంపియన్‌షిప్‌లో హంపి, హారిక టైటిలే లక్ష్యంగా బరిలోకి దిగనున్నారు. ర్యాపిడ్ విభాగంలో మొత్తం 121 మంది తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. 12 రౌండ్లపాటు టోర్నీ జరుగుతుంది. గురు, శుక్ర, శనివారాల్లో నాలుగు రౌండ్‌ల చొప్పున గేమ్‌లు జరుగుతాయి. ఈనెల 29, 30వ తేదీల్లో బ్లిట్జ్ విభాగం గేమ్‌లను నిర్వహిస్తారు. బ్లిట్జ్ కేటగిరీలో 17 రౌండ్‌లు ఉంటాయి. ఇక ఓపెన్ విభాగంలో భారత్ నుంచి గ్రాండ్‌మాస్టర్లు విదిత్ సంతోష్ గుజరాతి, ఆధిబన్, కృష్ణన్ శశికిరణ్, సూర్యశేఖర గంగూలీ, సేతురామన్, శ్రీనాథ్ నారాయణన్, అరవింద్ చిదంబరం, విష్ణుప్రసన్న, హర్ష భరతకోటి, రౌనక్ సాధ్వాని, నిహాల్ సరీన్, డి.గుకేశ్ ఉన్నారు.

## బెంగళూరుపై కోల్‌కతా గెలుపు



కోల్‌కతా: క్రిస్మస్ పర్వదినాన అట్లెటికో డి కోల్‌కతా జట్టు సంబరాల్లో మునిగి తేలింది. ఇండియన్ సూపర్ లీగ్ (ఐఎస్‌ఎల్) ఫుట్‌బాల్ టోర్నీలో అట్లెటికో తొలిసారి బెంగళూరు ఎఫ్‌సీపై విజయం సాధించింది. ఐఎస్‌ఎల్‌లో భాగంగా బుధవారం జరిగిన మ్యాచ్‌లో రెండుసార్లు మాజీ చాంపియన్ అయిన అట్లెటికో జట్టు 1–0తో డిఫెండింగ్ చాంపియన్ బెంగళూరు ఎఫ్‌సీపై గెలుపొందింది. మ్యాచ్ మొత్తం మీద అన్ని విభాగాల్లో సునీల్ ఛెత్రి సారథ్యంలోని బెంగళూరు జట్టే ఆధిపత్యం ప్రదర్శించినప్పటికీ విజయం మాత్రం అందుకోలేకపోయింది. మ్యాచ్ 47వ నిమిషంలో డేవిడ్ విలియమ్స్ చేసిన గోల్‌తో అట్లెటికో విజయాన్ని అందుకుంది. ఈ గెలుపుతో పాయింట్ల పట్టికలో అట్లెటికో (18 పాయింట్లు) అగ్రస్థానానికి చేరుకుంది.

సాక్షి బిజినెస్
గురువారం 26-12-2019
WWW.SAKSHIBUSINESS.COM

## స్టాక్ మార్కెట్లు (చివరి రెండు సూచీలు మినహా మిగిలినవి మంగళవారం ముగింపు)

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ | నిఫ్టీ |
|---|---|
| 181 ▼ | 48 ▼ |
| 41,461 | 12,214 |

మరిన్ని వార్తలు, స్టాక్ అప్‌డేట్స్ కోసం... www.sakshibusiness.com చూడండి

**విదేశీ సూచీలు**

| సూచీ | | | |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 8,953 | ▲ | 7 |
| డోజోన్స్ | 28,515 | ▼ | 36 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 7,632 | ▲ | 9 |
| డాక్స్ | 13,301 | ▼ | 18 |
| షాంఘై | 2,982 | ▼ | 1 |
| నికాయ్ | 23,783 | ▼ | 48 |


● అమెరికా ● బ్రిటన్ ● జర్మనీ ● చైనా ● జపాన్

## ఫారెక్స్ రేట్లు రూ. లలో

| | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|
| యూఎస్ డాలర్ | ఎస్‌బీఐ | 70.47 | 72.11 |
| బ్రిటన్ పౌండ్ | ఎస్‌బీఐ | 90.69 | 93.89 |
| యూరో | ఎస్‌బీఐ | 77.62 | 80.51 |
| జపాన్ ఎన్ (100) | ఎస్‌బీఐ | 63.97 | 66.37 |
| ఆస్ట్రేలియా డాలర్ | ఎస్‌బీఐ | 48.27 | 50.44 |
| సింగపూర్ డాలర్ | ఎస్‌బీఐ | 51.68 | 53.47 |
| సౌదీ రియాల్ | థామస్‌కుక్ | 18.22 | 19.82 |
| యూఏఈ దిర్హామ్ | థామస్‌కుక్ | 18.94 | 19.94 |
| చైనా యువాన్ | థామస్‌కుక్ | 9.55 | 10.95 |

(మంగళవారం రేట్లు)

# స్వతంత్ర డైరెక్టర్లు.. గుడ్‌బై!!




**పెరుగుతున్న రాజీనామాల సంఖ్య**

- ఈ పదవులకు పలువురు ప్రముఖుల దూరం
- కంపెనీల్లో వెలుగుచూస్తున్న స్కామ్‌లతో పరువుప్రతిష్టలు పోతాయని భయం
- ప్రమోటర్ల నిర్ణయాలకు బలవుతామనే సంశయం
- ఎన్ఎస్ఈ ఇన్ఫోబేస్ డాట్‌కామ్ వెల్లడి

**దేశీ కార్పొరేట్ రంగంలో తాజాగా వెలుగుచూస్తున్న కుంభకోణాలు, అవకతవకలు... బోర్డు రూమ్ సంక్షోభానికి దారితీస్తున్నాయి. స్కామ్‌ల పాపం తమ మెడకు ఎక్కడ చుట్టుకుంటుందోనన్న భయంతో కంపెనీల నుంచి వైదొలగుతున్న ఇండిపెండెంట్ డైరెక్టర్ల సంఖ్య అంతకంతకూ పెరుగుతోంది. గత ఆర్థిక సంవత్సరం తొలి 6 నెలల్లో మొత్తం 126 మంది ఇండిపెండెంట్ డైరెక్టర్లు రాజీనామా చేశారు. ఈ ఆర్థిక సంవత్సరం ఇదే కాలానికి ఆ సంఖ్య రెట్టింపై 291కి పెరగడం తాజా పరిస్థితికి నిదర్శనం. ఈ వివరాలను ఎన్ఎస్ఈఇన్ఫోబేస్ డాట్‌కామ్ వెల్లడించింది. నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్(ఎన్ఎస్ఈ), ప్రైమ్ డేటాబేస్ కలసి ఈ సంస్థను ఏర్పాటు చేశాయి. తాజా నివేదికలో స్వతంత్ర డైరెక్టర్ల విషయమై కీలకాంశాలు వెలుగుచూశాయి.**

సాధారణంగా ఒక కంపెనీ డైరెక్టర్ల బోర్డ్‌లో మూడో వంతు ఇండిపెండెంట్(స్వతంత్ర) డైరెక్టర్లుంటారు. కంపెనీలను వదిలిపోతున్న ఇండిపెండెంట్ డైరెక్టర్లలో సగం మంది వారి పదవీకాలం పూర్తవ్వడంతో వైదొలుగుతున్నారు. ఆరోగ్య, వ్యక్తిగత లేదా ఇతర వృత్తులు, వ్యాపకాల్లో స్థిరపడటం వంటి కారణాలతో చాలా మంది తమ పదవులకు రాజీనామా చేస్తున్నారు. ఈ ఆర్థిక సంవత్సరం తొలి ఆరు నెలల కాలంలో 291 మంది ఇండిపెండెంట్ డైరెక్టర్లు రాజీనామా చేశారు. దీంట్లో 146 మంది తమ పదవీ కాలం పూర్తవ్వడంతో రాజీనామా చేయగా, మళ్లీ ఆ పదవిలో కొనసాగడం ఇష్టం లేదంటూ 36 మంది వైదొలిగారు. ఇతర వృత్తుల్లో స్థిరపడేందుకు రాజీనామా చేసిన వారి సంఖ్య 26గా ఉంది. సెబీ, కంపెనీల చట్టం ప్రకారం తగిన అర్హతలు లేకపోవడంతో 17 మంది రాజీనామా చేశారు. వ్యక్తిగత, ఆరోగ్య సమస్యలు, ఆసక్తి లేదంటూ రాజీనామా చేసిన వాళ్ల సంఖ్య 40. యాజమాన్యం మారడంతో ఆరుగురు రాజీనామా చేశారు. కాగా, జెట్ ఎయిర్‌వేస్ కంపెనీలో ఇబ్బందులు తలెత్తగానే పలువురు ఇండిపెండెంట్ డైరెక్టర్లు రాజీనామా చేశారు. చెల్లింపుల్లో విఫలం కావడంతో ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లీజింగ్ అండ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ కంపెనీ నుంచి కూడా ఇండిపెండెట్ డైరెక్టర్లు వైదొలిగారు.

**ఇష్టపడని పదవి..**

గతంలో ఇతర కంపెనీలకు ఎగ్జిక్యూటివ్‌లుగా పనిచేసిన వాళ్లు, ప్రభుత్వంలో ఉన్నత స్థాయి పదవులు నిర్వహించినవాళ్లు ఇండిపెండెంట్ డైరెక్టర్లుగా రావడానికి ఇష్టపడటం లేదు. కంపెనీల్లో అవకతవకలు ఉంటాయేమోనన్న అనుమానాలతో ఈ పదవులను వారు తిరస్కరిస్తున్నారు. కంపెనీ ప్రమోటర్లు, యాజమాన్యం తీసుకునే నిర్ణయాలకు బలికావలసి వస్తుందనే భయాలతో పలువురు ఈ పదవులను నిరాకరిస్తున్నారు. ఇండిపెండెంట్ డైరెక్టర్‌గా చేరితే, ఒకవేళ కంపెనీ లోటుపాట్లు వెల్లడైన పక్షంలో, అప్పటివరకూ తాము సంపాదించుకున్న పేరు, నమ్మకం అన్నీ కోల్పోవలసి వస్తుందని, న్యాయ వివాదాలు ఎదుర్కోవలసి వస్తుందని, అందుకే ఈ పదవులకు దూరంగా ఉంటున్నామని పలువురు పేర్కొన్నారు. ఇదిలాఉంటే... భారత్‌లో పలు కంపెనీలు కుటుంబాల ఆధ్వర్యంలోనే నడుస్తున్నాయి. దీంతో ఇండిపెండెంట్ డైరెక్టర్లు ప్రమోటర్ల దయ మీదనే ఆధారపడక తప్పటం లేదు. దీనికి వ్యతిరేకంగా గళం విప్పితే.. ప్రత్యేక తీర్మానం ద్వారా వీరిని సాగనంపే అవకాశాలున్నాయి. ఒకవేళ కంపెనీ అవకతవకల విషయమై తెలిసి కూడా స్పందించకపోతే, వీరి ఆస్తులను కూడా కంపెనీల వ్యవహారాల శాఖ స్తంభింపజేసే అవకాశాలున్నాయి. దీంతో ఇప్పుడు ఇండిపెండెంట్ డైరెక్టర్ల పదవి అడకత్తెరలో పోకచెక్కలా మారిందని విశ్లేషకులంటున్నారు. వంద శాతం పూర్తిగా నమ్మకం కుదిరితేనే ఈ పదవికి ముందుకొస్తున్నారని చెబుతున్నారు.



### ప్రశ్నించే అధికారం ఉండాలి...

ప్రమోటర్లు, వాటాదారుల ఆధిపత్యం ఉన్న కంపెనీల్లో 'నిజమైన' ఇండిపెండెంట్ డైరెక్టర్లు ఎవరూ ఉండరు. ఇండిపెండెంట్ డైరెక్టర్ హోదాను పునఃపరిశీలించాలి. భారత కుటుంబ వ్యాపారాల్లో మెజార్టీ వాటా ప్రమోటర్ గ్రూప్‌దే. ఇలాంటి కంపెనీల్లో డైరెక్టర్ల స్వతంత్రత చాలా కష్టసాధ్యమైన విషయం. మైనారిటీ వాటాదారుల ప్రయోజనాల పరిరక్షణ ఇండిపెండెంట్ డైరెక్టర్ల బాధ్యత అయినప్పటికీ, ప్రమోటర్ గ్రూప్ చర్యలను, నిర్ణయాలను ప్రశ్నించే అధికారం వారికి ఉండాలి.

*– ప్రణవ్ హల్దియా, ఎమ్‌డీ, ప్రైమ్ డేటాబేస్ గ్రూప్*

### ఇండిపెండెంట్ డైరెక్టర్ విధులేంటి?

- ఒక ఇండిపెండెంట్ డైరెక్టర్...తన బాధ్యతలు నిర్వర్తించేటప్పుడు నిర్మాణాత్మకంగా వ్యవహరించాలి. కంపెనీ, వాటాదారులు ముఖ్యంగా మైనారిటీ వాటాదారుల ప్రయోజనాల పరిరక్షణ కోసం బాధ్యతాయుతంగా మెలగాలి.
- తన హోదాను స్వలాభం కోసం దుర్వినియోగం చేయకూడదు. అలాగే తన స్వలాభం కోసం కంపెనీకి నష్టం వచ్చేలా ప్రవర్తించకూడదు. కంపెనీలో కార్పొరేట్ గవర్నెన్స్ సవ్యంగా సాగేలా తగిన తోడ్పాటునందించాల్సి ఉంటుంది.
- కంపెనీ కార్యకలాపాలకు సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ ఉండాలి.
- ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లలాగా కంపెనీ రోజువారీ కార్యకలాపాలను ఇండిపెండెంట్ డైరెక్టర్లు చూడాల్సిన పని ఉండదు. వారికి అధికారాలు కూడా పరిమితంగానే ఉన్నాయి.
- డైరెక్టర్ల సమావేశాలకే కాకుండా బోర్డ్ నియమించే కమిటీల్లో సభ్యుడిగా ఉంటూ, ఈ కమిటీ సమావేశాలకు కూడా హాజరు కావలసి ఉంటుంది. కంపెనీలో ఏమైనా అవకతవకలు చోటు చేసుకుంటే వాటిని వెలుగులోకి తేవలసి ఉంటుంది.
- కంపెనీకి సంబంధించిన రహస్యాలను (టెక్నాలజీ, భవిష్యత్తు నిర్ణయాలు, ఇతర కంపెనీలతో కుదుర్చుకోబోయే ఒప్పందాలు తదితర అంశాలను) లీక్ చేయకూడదు. ఇక ప్రత్యేక తీర్మానం ద్వారానే ఇండిపెండెంట్ డైరెక్టర్లను తొలగించే వీలుంది.



### సత్యం స్కామ్ నుంచి...

సత్యం కంప్యూటర్స్ స్కామ్ వెలుగులోకి వచ్చిన తర్వాత కంపెనీలో ఇండిపెండెంట్ డైరెక్టర్ల పాత్ర కీలకమైందని ప్రభుత్వం గుర్తించింది. అప్పటి వరకూ ఇండిపెండెంట్ డైరెక్టర్లకు పెద్దగా ప్రాధాన్యత ఉండేది కాదు. ఉత్సవ విగ్రహాలేనని చెప్పవచ్చు. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకొని 2013 నాటి కంపెనీల చట్టంలో ఇండిపెండెంట్ డైరెక్టర్లకు సంబంధించిన నిబంధనల విషయమై పలు మార్పులు, చేర్పులు చేసింది. మరోవైపు ఇండిపెండెంట్ డైరెక్టర్లు సభ్యులుగా ఉన్న రిస్క్ మేనేజ్‌మెంట్ కమిటీ తరచుగా సమావేశాలు జరుపుతూ, కంపెనీ స్థితిగతులపై చర్చించాల్సి ఉంటుంది. కానీ ఐఎల్‌అండ్‌ఎఫ్ఎస్ కంపెనీలో నాలుగేళ్ల కాలంలో ఇలాంటి ఒక్క సమావేశం కూడా జరగలేదంటే కంపెనీల్లో కార్పొరేట్ గవర్నెన్స్ ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది. ఇక లిస్టైన కంపెనీల్లో మొత్తం డైరెక్టర్లలో మూడు నుంచి ఐదో వంతు వరకూ ఇండిపెండెంట్ డైరెక్టర్లుండాలి. టాప్1000 కంపెనీల్లో కనీసం ఒక మహిళ ఇండిపెండెంట్ డైరెక్టర్ ఉండితీరాలి.




## రిలయన్స్ జియోకు ట్రిబ్యునల్‌లో విజయం

**టవర్ల డీమెర్జర్‌ను వ్యతిరేకిస్తూ దాఖలైన పిటిషన్ కొట్టివేత**




**న్యూఢిల్లీ:** రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ తన ఆప్టికల్ ఫైబర్, టవర్ వ్యాపారాలను వేరు చేయడాన్ని (డీమెర్జర్) వ్యతిరేకిస్తూ ఆదాయపన్ను శాఖ దాఖలు చేసిన పిటిషన్‌ను జాతీయ కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్ఏటీ) కొట్టివేసింది. జియో డిజిటల్ ఫైబర్ ప్రైవేటు లిమిటెడ్, రిలయన్స్ జియో ఇన్ఫ్రాటెల్ ప్రైవేటు లిమిటెడ్ పేరుతో రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ తన ఫైబర్, టవర్ వ్యాపారాలను వేరు చేయాలని నిర్ణయించుకుంది. ఇందుకు జాతీయ కంపెనీ లా ట్రిబ్యునల్ అహ్మదాబాద్ బెంచ్ అనుమతి మంజూరు చేసింది. దీనిపై ఆదాయపన్ను శాఖ అభ్యంతరం వ్యక్తం చేసింది. ''డీమెర్జర్ స్కీమ్ ప్రకారం రిలయన్స్ జియో ఇన్ఫోకామ్ రెడీమబుల్ ప్రిఫరెన్స్ షేర్లను రుణాలుగా మార్చాల్సి ఉంటుంది. ఈక్విటీని డెట్‌గా మార్చడం అన్నది కంపెనీ లా సూత్రాలకు వ్యతిరేకం. అంతేకాదు బదిలీ కంపెనీ (జియో ఇన్ఫోకామ్) లాభదాయక లేదా నికర ఆదాయం తగ్గిపోతుంది. ఇది ఆదాయపన్ను విభాగానికి ఆదాయ నష్టాన్ని కలిగిస్తుంది'' అని ఆదాయపన్ను శాఖ వాదించింది.

**కోడిగుడ్లు** (హోల్‌సేల్ -నెక్ /100కు రూ.లలో) 26-12-2019

| | |
|---|---|
| విశాఖ | 475-00 |
| చిత్తూరు | 468-00 |
| వరంగల్ | 443-00 |
| విజయవాడ | 460-00 |
| గోదావరి | 460-00 |
| 25-12-2019 ఫామ్ ధర... | |
| హైదరాబాద్ | 440-00 |

## సౌర విద్యుత్‌పై ఎన్టీపీసీ దృష్టి

- రూ. 50,000 కోట్ల పెట్టుబడి
- 2022 నాటికి 10 గిగావాట్ల సామర్థ్యం పెంపు లక్ష్యం...




**న్యూఢిల్లీ:** ప్రభుత్వ రంగ విద్యుదుత్పత్తి సంస్థ ఎన్టీపీసీ 2022 నాటికి మరో 10 గిగావాట్ల మేర సౌర విద్యుత్ సామర్థ్యాన్ని పెంచుకోవాలని యోచిస్తోంది. దీనికోసం రూ. 50,000 కోట్లు ఇన్వెస్ట్ చేయనుంది. గ్రీన్ బాండ్స్ ద్వారా ఇందుకు కావాల్సిన నిధులను సమకూర్చుకోనున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ప్రస్తుతం సౌర విద్యుత్ సహా ఎన్‌టీపీసీ పునరుత్పాదక విద్యుత్ సామర్థ్యం 920 మె.వా.గా ఉంది. 2032 నాటికి 130 గి.వా. కంపెనీగా ఎదగాలని ఎన్‌టీపీసీ దీర్ఘకాలిక ప్రణాళిక రూపొందించుకుంది. ఇందులో 30 శాతం వాటా పునరుత్పాదక విద్యుత్‌దే ఉండనుంది.

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం ఆఖరు నాటికి 2,300 మె.వా. సౌర విద్యుత్ ప్రాజెక్టుకు సంబంధించి టెండర్ ప్రక్రియ పూర్తవుతుందని సంబంధిత వర్గాలు తెలిపాయి. ఆ తర్వాత 2020–21, 2021–22 మధ్య ఏటా 4 గి.వా. మేర విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని సమకూర్చుకోనున్నట్లు వివరించాయి. 2022కల్లా పర్యావరణహిత విద్యుదుత్పత్తి సామర్థ్యాన్ని 175 గి.వా.కు పెంచుకోవాలని కేంద్రం నిర్దేశించుకున్న నేపథ్యంలో ఎన్‌టీపీసీ ప్రణాళికలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

### మార్చికల్లా అన్ని గ్రామాలకూ ఉచిత వైఫై: రవిశంకర్ ప్రసాద్

**రేవారి (హర్యానా):** భారత్‌నెట్ ప్రాజెక్టు పరిధిలోని అన్ని గ్రామాలకూ వచ్చే మార్చి వరకు వైఫై ఉచితంగా అందిస్తున్నామని కేంద్ర మంత్రి రవిశంకర్ ప్రసాద్ బుధవారం హర్యానాలోని రేవారికి వచ్చిన సందర్భంగా చెప్పారు. ''భారత్ నెట్ ఆప్టికల్ ఫైబర్ నెట్‌వర్క్‌ను ఇప్పటికే 1.3 లక్షల గ్రామ పంచాతీయలకు అనుసంధానించాం. 2.5 లక్షల గ్రామ పంచాయతీలను చేరుకోవాలన్నది లక్ష్యం. భారత్‌నెట్ సేవలను ప్రోత్సహించేందుకుగాను ప్రాజెక్టు పరిధిలోని అన్ని గ్రామాల్లోనూ 2020 మార్చి వరకు ఉచితంగా వైఫై సేవలను అందిస్తున్నాం. భారత్ నెట్‌వర్క్‌కు అనుసంధానమైన మొత్తం గ్రామాల్లో ప్రస్తుతానికి 48,000 గ్రామాల్లో వైఫై సేవలు అందుబాటులో ఉన్నాయి'' అని మంత్రి వెల్లడించారు.



## జీఎస్‌టీ ఫిర్యాదుల పరిష్కారానికి యంత్రాంగం




**న్యూఢిల్లీ:** వస్తు సేవల పన్ను (జీఎస్‌టీ) చెల్లింపుదారులకు జీఎస్‌టీ కౌన్సిల్ ఒక ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగాన్ని ఏర్పాటు చేయనుంది. ఈ నెల 18న జరిగిన జీఎస్‌టీ కౌన్సిల్ 38వ సమావేశంలో ఈ నిర్ణయం తీసుకున్నారు. జీఎస్‌టీకి సంబంధించి, అలాగే, పన్ను చెల్లింపుదారుల సాధారణ ఫిర్యాదుల పరిష్కారం కోసం నిర్మాణాత్మక పరిష్కార యంత్రాంగాన్ని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉందని కౌన్సిల్ భావించినట్టు బుధవారం విడుదలైన ప్రభుత్వ అధికారిక ప్రకటన తెలియజేసింది. రాష్ట్రాల స్థాయిలో, జోనల్ స్థాయిలో ఫిర్యాదుల పరిష్కార కమిటీలను ఏర్పాటు చేస్తారు. కేంద్ర, రాష్ట్రాల పన్ను అధికారులు, వాణిజ్య, పారిశ్రామిక రంగాల ప్రతినిధులు, జీఎస్‌టీ ఇతర భాగస్వాములకు కమిటీలో చోటు కల్పిస్తారు. రెండేళ్ల కాలానికి కమిటీలను ఏర్పాటు చేస్తామని, సభ్యుల పదవీ కాలం కూడా అదే విధంగా ఉంటుందని ప్రభుత్వం తన ప్రకటనలో వివరించింది. పన్ను చెల్లింపుదారులు ఎదుర్కొంటున్న అన్ని రకాల అంశాలకు పరిష్కారం చూపించడం ఈ కమిటీ విధుల్లో భాగం. ప్రతీ త్రైమాసికానికి ఒక సారి, అవసరానికి అనుగుణంగాను కమిటీ సమావేశం అవుతుంది. ఫిర్యాదుల నమోదు, నిర్ణీత కాల వ్యవధిలోపు వాటిని పరిష్కరించే విధంగా జీఎస్‌టీఎన్ ఒక పోర్టల్‌ను కూడా ఏర్పాటు చేస్తుందని ప్రభుత్వ ప్రకటన తెలియజేసింది.

## సింగపూర్‌ను దాటేసిన హైదరాబాద్

### క్యూ3లో ఆఫీసు అద్దెల్లో 23 శాతం వృద్ధి



**హైదరాబాద్, బిజినెస్ బ్యూరో:** దక్షిణాది నగరాలైన హైదరాబాద్, బెంగళూరు, చెన్నైలు సింగపూర్, హాంగ్‌కాంగ్‌లను దాటేశాయి. జులై – సెప్టెంబర్ (క్యూ3) మధ్య కాలంలో ఆఫీస్ స్పేస్ లావాదేవీల్లో ఈ మూడు నగరాల్లో 23 శాతం వృద్ధి నమోదైందని నైట్ ఫ్రాంక్ ఇండియా ఆసియా పసిఫిక్ క్యూ3-2019 ఆఫీస్ రెంటల్ ఇండెక్స్ నివేదిక తెలిపింది

**బెంగళూరు తర్వాతే మెల్‌బోర్న్, బ్యాంకాక్..**

2019 క్యూ3లో ఆఫీస్ రెంట్స్ వృద్ధిలో బెంగళూరు మొదటి స్థానంలో నిలవగా.. రెండో స్థానంలో మెల్‌బోర్న్, మూడో స్థానంలో బ్యాంకాక్ నగరాలు నిలిచాయి. గతేడాదితో పోలిస్తే బెంగళూరులో అద్దెలు 17.6 శాతం వృద్ధి చెందగా.. మెల్‌బోర్న్‌లో 15.5 శాతం, బ్యాంకాక్‌లో 9.4 శాతం వృద్ధి నమోదైంది. నెల వారీ అద్దెలు చూస్తే.. ఖరీదైన అద్దెలున్న నగరాల్లో హాంగ్‌కాంగ్ ప్రథమ స్థానంలో నిలిచింది. ఇక్కడ నెల అద్దె చ.మీ.కు రూ.206.6 డాలర్లు. టోక్యోలో 11.9 డాలర్లు, సింగపూర్‌లో 80.5 డాలర్లుగా ఉంది. మన దేశంలో ఖరీదైన ఆఫీస్ అద్దె నగరాల్లో ప్రథమ స్థానంలో ఎన్‌సీఆర్ (ఆసియా పసిఫిక్ రీజియన్‌లో 5వ స్థానం), ముంబై (7వ స్థానం) నిలిచాయి. ఎన్‌సీఆర్‌లో నెలకు రూ.51.8 డాలర్లు, ముంబైలో 46.2 డాలర్లుగా ఉంది. బెంగళూరులో 20.5 డాలర్లుగా ఉంది.

**2020లో 50 మిలియన్ చ.అ.**

ఈ ఏడాది దేశంలోని 8 ప్రధాన నగరాల్లో 46.5 మిలియన్ చ.అ. నికర ఆఫీసు స్థల లావాదేవీలు జరిగాయి. ఇందులో హైదరాబాద్, బెంగళూరు వాటా 70 శాతంగా ఉంది. విభాగాల వారీగా చూస్తే ఐటీ, ఐటీఈఎస్ రంగాల వాటా 42 శాతంగా ఉంది. 2020లో 50 మిలియన్ చ.అ.ల ఆఫీసు స్థల లావాదేవీలు జరుగుతాయని నివేదిక అంచనా వేసింది. ఈ ఏడాది మన దేశంలో ఆఫీస్ స్పేస్ లావాదేవీలు అత్యధికంగా జరిగిన నగరం బెంగళూరే. ఇక్కడ 2019లో 15 మిలియన్ చ.అ. లావాదేవీలు జరిగాయి. గతేడాదితో పోలిస్తే 8 శాతం వృద్ధి. ఐటీ, ఐటీఈఎస్ రంగాల వాటా 39 శాతంగా ఉంది. ఇంజనీరింగ్, తయారీ రంగాల వాటా 16 శాతంగా ఉంది. 2019లో కొత్తగా 10.9 మిలియన్ చ.అ. స్పేస్ జత అయింది.

**హైదరాబాద్‌లో 10.5 మిలియన్ చ.అ.**

గత కొన్నేళ్లుగా హైదరాబాద్ కమర్షియల్ స్పేస్ లావాదేవీల్లో గణనీయమైన వృద్ధి కనిపిస్తుంది. మౌలిక వసతుల అభివృద్ధి, స్థానిక ప్రభుత్వ ప్రోత్సాహకాలు, రాయితీల వంటి కారణాలతో పాటూ అందుబాటులో స్థలాలు, తక్కువ అద్దెలు, నైపుణ్యమున్న ఉద్యోగులు తదితర కారణాలతో ఐటీ కంపెనీలు విస్తరిస్తున్నాయి. దీంతో స్థానికంగా ఆఫీస్ అద్దెలు వృద్ధి చెందుతున్నాయని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి. ఈ ఏడాది నగరంలో 10.5 మిలియన్ చ.అ. నికర ఆఫీసు స్థల లావాదేవీలు జరిగాయి. ఇందులో టెక్నాలజీ కంపెనీల వాటా 51 శాతం ఉంది. ఫ్లెక్సిబుల్ వర్క్‌ప్లేస్ వాటా నాలుగింతలు వృద్ధి చెంది 32 శాతం వద్ద స్థిరపడింది. 2020లో హైదరాబాద్‌లో 13 మిలియన్ చ.అ. లావాదేవీలు జరుగుతాయని అంచనా.

## గ్యాస్ వివాదాలపై నిపుణుల కమిటీ

**సత్వర పరిష్కార మార్గాలపై కేంద్రం దృష్టి**

**న్యూఢిల్లీ:** చమురు, గ్యాస్ రంగాల్లో పెట్టుబడులపై వివాదాలు ప్రతికూల ప్రభావం చూపిస్తున్న నేపథ్యంలో ఈ అంశంపై కేంద్రం దృష్టి సారించింది. సుదీర్ఘ న్యాయపోరు సమస్యలు లేకుండా నిర్దిష్ట కాలవ్యవధిలోగా ఇంధనాల అన్వేషణ, ఉత్పత్తి సంబంధ వివాదాల సత్వర పరిష్కారం కోసం ప్రత్యేకంగా నిపుణుల కమిటీని నియమించింది. ఇందులో చమురు శాఖ మాజీ కార్యదర్శి జీసీ చతుర్వేది, ఆయిల్ ఇండియా మాజీ సీఎండీ బికాష్ సి బోరా, హిందాల్కో ఇండస్ట్రీస్ ఎండీ సతీష్ పాయ్ సభ్యులుగా ఉంటారని కేంద్ర ప్రభుత్వం ఒక నోటిఫికేషన్‌లో వెల్లడించింది. కమిటీ కాల వ్యవధి మూడేళ్ల పాటు ఉంటుంది. వివాదాలను కనిష్టంగా మూడు నెలల్లో పరిష్కరించే అవకాశం ఉంటుంది. మధ్యవర్తిత్వం ద్వారా భాగస్వాముల మధ్య లేదా కాంట్రాక్టరు.. ప్రభుత్వం మధ్య తలెత్తే వివాదాలను పరిష్కరించడంపై ఈ కమిటీ దృష్టి పెడుతుంది. ఇందుకోసం థర్డ్ పార్టీ సర్వీసులను కూడా తీసుకోవచ్చు. ఆర్బిట్రేషన్ కోసం నిపుణుల కమిటీని ఆశ్రయించిన తర్వాత.. మళ్లీ ప్రత్యేకంగా కోర్టుకు వెళ్లడానికి కుదరదు. అయితే, పరస్పర అంగీకారంతో సమస్య పరిష్కార ప్రక్రియ వ్యవధిని పెంచుకోవచ్చు. నిర్దిష్టంగా చట్టపరమైన అంశాలు ఉంటే తప్ప ఆయా సంస్థల ఉద్యోగులు, ఉన్నతాధికారులే.. కమిటీ ముందు వాదనలు వినిపించవచ్చు. అడ్వొకేట్లు, కన్సల్టెంట్ల పాత్రేమీ ఇందులో ఉండదు.







బుధవారం క్రిస్మస్ సందర్భంగా మెదక్ సీఎస్ఐ చర్చిలో దైవ సందేశమిస్తున్న బిషప్ సాల్మన్‌రాజ్. చర్చి ముందు భక్తుల రద్దీ



ప్రసంగిస్తున్న మంత్రి హరీశ్‌రావు. చిత్రంలో పద్మాదేవేందర్ రెడ్డి

# ఘనంగా క్రిస్మస్ వేడుకలు

## జనసంద్రమైన మెదక్ సీఎస్ఐ చర్చి

- భారీగా తరలివచ్చిన క్రైస్తవులు.. పరస్పర శుభాకాంక్షలు
- దేవుడి ఆశీస్సులతో రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్న కేసీఆర్: హరీశ్‌రావు

**సాక్షి, మెదక్ :** క్రిస్మస్ పర్వదినాన్ని పురస్కరించుకుని ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ సీఎస్ఐ చర్చికి భారీ ఎత్తున భక్త జనం తరలివచ్చారు. ఎప్పుడూ నిర్మానుష్యంగా ఉండే రహదారులు బుధవారం వాహనాలు, భక్తుల రద్దీతో కిటకిటలాడాయి. మంగళవారం అర్ధరాత్రి నుంచే భక్తుల రాక ప్రారంభమైంది. ఉదయం 4.30 గంటలకు జరిగిన మొదటి ఆరాధనలో సీఎస్ఐ చర్చి బిషప్ సాల్మన్‌రాజ్ దైవ సందేశం ఇచ్చారు. చర్చిలో జరిగిన క్రిస్మస్ వేడుకలకు క్రైస్తవులతోపాటు హిందువులు, ముస్లింలు కూడా రావా.. మతసామరస్యం వెల్లివిరిసింది. క్రిస్మస్ సందర్భంగా చర్చి ప్రాంగణం జాతరను తలపించింది. తినుబండారాలు, చిన్నపిల్లల ఆటవస్తువులు, ఐస్‌క్రీం షాపులతోపాటు పలు రకాల సామగ్రి దుకాణాలు వెలిశాయి. పోలీసులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా పటిష్ట బందోబస్తు నిర్వహించారు. అధికారులతోసహా మొత్తం 450 మంది సిబ్బంది బందోబస్తులో పాల్గొన్నారు. అయితే.. పట్టణంలో కేటాయించిన మూడు పార్కింగ్ స్థలాలు కిక్కిరిసి పోగా.. రహదారుల వెంటే వాహనాలను పార్కింగ్ చేయడంతో పలు చోట్ల ట్రాఫిక్ సమస్య నెలకొంది. పోలీసులు ఎప్పటికప్పుడూ ట్రాఫిక్‌ను క్లియర్ చేశారు. ఈ వేడుకలకు ఆర్థిక మంత్రి హరీశ్‌రావుతో పాటు మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి తదితరులు హాజరయ్యారు.

**దేవుడి ఆశీస్సులతో..**

ఏసయ్య జీవితాంతం ప్రజల కోసమే బతికారని మంత్రి హరీశ్‌రావు అన్నారు. ఏసయ్య దయ వల్ల మనమందరం సుఖ సంతోషాలతో జీవించాలన్నారు. దయ, కరుణ, ప్రేమ గుణాలను ప్రతీ మనిషి కలిగి ఉండాలన్నారు. సీఎం కేసీఆర్ సైతం దేవుడి ఆశీస్సులతో రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తున్నారని పేర్కొన్నారు. అంతకు ముందు ఎమ్మెల్యే పద్మాదేవేందర్ రెడ్డి క్రిస్మస్ కేక్‌ను కట్ చేసి సంబరాల్లో పాల్గొన్నారు. ప్రపంచంలోనే ప్రఖ్యాతి గాంచిన చర్చి పరిసరాల్లో జీవించడం పూర్వజన్మసుకృతమన్నారు.



యాదాద్రిలో ఆలయాన్ని మూసివేస్తున్న అర్చకులు

# నేటి ఉదయం దైవ దర్శనాలుండవు

- సూర్య గ్రహణంతో ఆలయాల మూసివేత
- శుద్ధి అనంతరం ప్రత్యేక దర్శనాలు

**సాక్షి, హైదరాబాద్:** సూర్య గ్రహణం కారణంగా నేటి ఉదయం రాష్ట్రంలోని అన్ని ఆలయాలు మూసివేయనున్నారు. ఉదయం 8.07 గంటలకు గ్రహణ స్పర్శ కాలం ప్రారంభం అవుతుండగా, మోక్ష కాలం ఉదయం 11.20 నిమిషాలకు ఉంది. మొత్తం మూడు గంటలకుపైగా గ్రహణ కాలం ఉంటుంది. ఆలయాల శుద్ధి అనంతరం మధ్యాహ్నం ఒంటిగంట తర్వాత దైవ దర్శనాలకు వీలుగా ఆలయాల తలుపులు తెరుచుకోనున్నాయి. కొన్ని దేవాలయాలను మధ్యాహ్నం 3 గంటలకు తెరవనున్నారు. అన్ని దేవాలయాల్లో సాయంత్రం ప్రత్యేక పూజలు నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశారు. కాగా, యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయాన్ని బుధవారం రాత్రి మూసివేశారు. సూర్యగ్రహణం సందర్భంగా గురువారం ఉదయం జరగాల్సిన అభిషేకం, అర్చన, నిత్య హోమం, నిత్య కల్యాణం, బ్రహ్మోత్సవ సేవలను రద్దు చేశారు.



పట్టుబడిన గట్కాను పరిశీలిస్తున్న టాస్క్‌ఫోర్స్ బృందం

# 75 లక్షల విలువైన గుట్కాల పట్టివేత

**సాక్షి ప్రతినిధి, ఖమ్మం:** నగరంలోని గుట్కా స్థావరాలపై టాస్క్‌ఫోర్స్, త్రీటౌన్ పోలీసులు బుధవారం సంయుక్తంగా దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ. 75 లక్షల విలువైన గుట్కా నిల్వలను స్వాధీనం చేసుకున్నారు. ఖమ్మం నగరానికి చెందిన పసుమర్తి భాస్కర్.. ప్రకాశ్‌నగర్‌లోని వరదయ్య గోడౌన్‌లో నిషేధిత గుట్కా, తంబాకు ప్యాకెట్లను నిల్వ ఉంచినట్లు పోలీసులకు సమాచారం అందింది. కర్ణాటకలోని బీదర్ నుంచి బొలేరో వాహనంలో గుట్కా వస్తుందనే ముందస్తు సమాచారం మేరకు నిఘా పెట్టారు. గోడౌన్‌లో సరుకును దించగానే పోలీసులు దాడి చేసి స్వాధీనం చేసుకున్నారు. మొత్తం 150 బస్తాలు, తంబాకు ప్యాకెట్లు కూడా ఉన్నాయని టాస్క్‌ఫోర్స్ ఏసీపీ వెంకట్‌రావు తెలిపారు. పట్టుబడిన గుట్కా ప్యాకెట్లలో గోవా, జీవన్ గుట్కా, మైత్రి తంబాకు, మీరాజ్ తంబాకు, అంబర్ ప్యాకెట్లు ఉన్నాయి. దాడుల్లో టాస్క్‌ఫోర్స్ సీఐ వెంకటస్వామి, ఎస్ఐ రాము, త్రీటౌన్ ఎస్ఐలు సతీశ్‌కుమార్, శ్రీకాంత్, కానిస్టేబుల్ హమీద్ పాల్గొన్నారు.




బుధవారం కరీంనగర్‌లో మాట్లాడుతున్న పొన్నం. చిత్రంలో జీవన్‌రెడ్డి తదితరులు

# దేశానికి కాంగ్రెస్సే శ్రీరామరక్ష

## మత విద్వేషాలను రెచ్చగొడుతున్న బీజేపీ: పొన్నం

- పౌరసత్వ సవరణ చట్టంపై సీఎం తన వైఖరి వెల్లడించాలి: జీవన్‌రెడ్డి
- 28న హైదరాబాద్ సభకు తరలిరావాలని పిలుపు

**కరీంనగర్:** బీజేపీ మతపరమైన విద్వేషాలను రెచ్చగొట్టి లబ్ధిపొందాలనుకుంటోందని, అన్ని మతాలు, వర్గాలకు సమానంగా న్యాయం చేసింది కాంగ్రెస్ పార్టీయేనని పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ పొన్నం ప్రభాకర్ అన్నారు. బుధవారం కరీంనగర్‌లో డీసీసీ అధ్యక్షుడు కటుకం మృత్యుంజయం ఆధ్వర్యంలో పౌరసత్వ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తూ భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం జరిగిన ధర్నాలో పొన్నం మాట్లాడారు. కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు ప్రజలు పౌరసత్వ సవరణ చట్టాన్ని వ్యతిరేకిస్తున్నారని తెలిపారు. వివిధ రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఆ చట్టాన్ని తమ రాష్ట్రాల్లో ఆమోదించేది లేదని స్పష్టం చేస్తున్నా ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్ షా మొండిగా వ్యవహరించడం దుర్మార్గమని పేర్కొన్నారు. ప్రజల దృష్టి మళ్లించేందుకే బీజేపీ అనవసరంగా అల్లర్లకు ఆజ్యం పోస్తోందని ధ్వజమెత్తారు. కాంగ్రెస్ పార్టీయే దేశానికి శ్రీరామరక్ష అని, అన్ని వర్గాల మతాల ప్రజలను అక్కున చేర్చుకుని ప్రపంచంలోనే భారతదేశ ఔన్నత్యాన్ని చాటి చెప్పిందని ఎమ్మెల్సీ టి.జీవన్ రెడ్డి అన్నారు. ఈ నెల 28వ తేదీన కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లో జరిగే సభకు ప్రజలు పెద్దఎత్తున పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. పౌరసత్వ సవరణ చట్టంపై కేసీఆర్ తన వైఖరి స్పష్టం చేయాలని ఆయన డిమాండ్ చేశారు.

# గజ్వేల్ టీచర్‌కు ఎన్ఐసీటీ పురస్కారం

**గజ్వేల్ రూరల్:** విద్యార్థులకు డిజిటల్ పద్ధతిలో పాఠ్యాంశాలను బోధించేందుకు చేపడుతున్న కార్యక్రమంలో ఓ ఉపాధ్యాయుడు చేసిన కృషిని గుర్తించిన విద్యాశాఖ, ఎన్ఐసీటీ జాతీయ పురస్కారంతో సత్కరించింది. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న నాగరాజు విద్యార్థులకు డిజిటల్ పద్ధతిలో పాఠ్యాంశాలను బోధించే అంశంపై పరిశోధన చేస్తున్నారు. ఈ క్రమంలో డిజిటల్ పాఠాల రూపకల్పనలో 2015లో యూనిసెఫ్ సహకారంతో తెలంగాణ విద్యాశాఖ రూపొందించిన కార్యక్రమంలో శిక్షణ పొందడంతో పాటు.. స్టేట్ రిసోర్స్ పర్సన్‌గా 200 మందికి మాస్టర్ ట్రైనర్లుగా శిక్షణ ఇచ్చారు. అలాగే యూనిసెఫ్ తరఫున వలంటరీగా వెళ్ళి ఏపీలో సైతం మరో 120 మందికి మాస్టర్ ట్రైనర్లుగా శిక్షణ ఇచ్చారు. అంతేగాకుండా సాంకేతిక పరమైన వివిధ కార్యక్రమాల్లో స్టేట్ రిసోర్స్ పర్సన్‌గా పాల్గొన్నారు. సైన్స్, గణితం, సాంఘికశాస్త్రం సబ్జెక్టులలో డిజిటల్ పద్ధతిలో విద్యార్థులకు బోధించేందుకు ప్రణాళికలను రూపొందిస్తున్నారు. కాగా, ఈనెల 23న ఢిల్లీలో జరిగిన కార్యక్రమంలో 'నేషనల్ ఐసీటీ అవార్డ్ ఫర్ టీచర్'కు రాష్ట్రం తరఫున ఇద్దరిని ఎంపిక చేయగా.. అందులో నాగరాజు కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ సహాయ మంత్రి సంజయ్ ధోత్రే చేతుల మీదుగా ఈ అవార్డు అందుకున్నారు. పాఠశాల ఉపాధ్యాయ బృందం ఆయనకు అభినందనలు తెలిపింది.



కేంద్ర మంత్రి సంజయ్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న నాగరాజు

# లారీ-ఆటో ఢీ.. నలుగురి దుర్మరణం

## మృతులంతా ఒకే కుటుంబసభ్యులు

**జడ్చర్ల:** మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల మండలంలోని నసరుల్లాబాద్ శివారులో బుధవారం లారీ–ఆటో ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న నలుగురు దుర్మరణం చెందారు. ఈ ప్రమాదంలో ఓ చిన్నారి తీవ్ర గాయాలతో బయటపడింది. జడ్చర్ల సీఐ వీరస్వామి కథనం ప్రకారం.. జడ్చర్ల మండలంలోని నసరుల్లాబాద్‌కి చెందిన నరేశ్ (20) అన్నాసాగర్‌లో ఉంటున్న అక్క, బావ, మేన కోడళ్లను తీసుకుని ఆటోలో తమ గ్రామానికి బయల్దేరాడు. ఈ సమయంలో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో ఆటో నడుపుతున్న నరేశ్‌తో పాటు బావ శంకర్ (35), అక్క జ్యోతి (22), అక్క కూతురు మేఘవర్షిణి (2) దుర్మరణం చెందారు. ప్రమాదం నుంచి మరో చిన్నారి ఆయావతి (5) తీవ్ర గాయాలతో బయటపడింది. మరో రెండు నిమిషాల్లో గ్రామానికి చేరుకుంటారన్న సమయంలో.. ఎదురుగా వచ్చిన లారీ, ఆటోను ఢీకొట్టడంతో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదంలో శంకర్.. అతడి చిన్న కూతురు మేఘవర్షిణి అక్కడికక్కడే దుర్మరణం చెందారు. తీవ్రంగా గాయపడిన జ్యోతి, నరేశ్, ఆయావతిలను 108లో బాదేపల్లి ప్రభుత్వ ఆస్పత్రికి తరలిస్తుండగా... మార్గమధ్యలో జ్యోతి మృతి చెందింది. నరేశ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ చనిపోయాడు. ఆయావతిని మెరుగైన చికిత్స కోసం మహబూబ్‌నగర్ ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.




లారీ ఢీకొనడంతో నుజ్జునుజ్జయిన ఆటో



శంకర్, జ్యోతి.. నరేశ్ చిన్నారి మేఘవర్షిణి (సర్కిల్‌లో ఉన్నవారు)




ప్రతాప్‌సింగ్, మయూరి సింగ్ (ఫైల్)

# ఐస్లాండ్‌లో పేలిన అగ్నిపర్వతం

- బోథ్ మండలానికి చెందిన ఒకరు మృతి
- 9న ఘటన.. ఆలస్యంగా సమాచారం

**బోథ్:** అమెరికాలోని ఐస్లాండ్‌లో అగ్నిపర్వతం పేలి ఆదిలాబాద్ జిల్లా బోథ్ మండలం గుర్రాలతండాకు చెందిన మయూరి సింగ్ మృతి చెందారు. ఆమె భర్త ప్రతాప్‌సింగ్ తీవ్రంగా గాయపడ్డారు. ఈ నెల 9వ తేదీన ఈ ఘటన జరగగా.. ఇక్కడి బంధువులకు ఆలస్యంగా విషయం తెలిసింది. సింగ్ బంధువుల కథనం ప్రకారం.. గుర్రాలతండాకు చెందిన ప్రతాప్‌సింగ్ ఇరవై ఏళ్ల క్రితం అమెరికా వలస వెళ్లాడు. అక్కడ పలు వ్యాపారాలు చేస్తున్నాడు. ఈనెల 9న ఐస్లాండ్ చూసేందుకు భార్యాభర్తలిద్దరూ వెళ్లారు. అక్కడ ఉన్న వాతావరణాన్ని చూస్తున్న క్రమంలో అక్కడే ఉన్న అగ్నిపర్వతం ఒక్కసారిగా బద్దలైంది. ఈ ఘటనలో మయూరిసింగ్ అక్కడికక్కడే మృతి చెందారు.

# మొరాయించిన తెలంగాణ ఎక్స్‌ప్రెస్

## రెండు గంటల పాటు ఆలస్యంగా నడిచిన రైలు

**కాజీపేట రూరల్:** హైదరాబాద్ నుంచి కొత్త ఢిల్లీ వెళ్లాల్సిన తెలంగాణ సూపర్‌ఫాస్ట్ ఎక్స్‌ప్రెస్ రైలు బుధవారం మార్గమధ్యలో పలు ప్రాంతాల్లో మొరాయించింది. బుధవారం ఉదయం బయలు దేరిన తెలంగాణ ఎక్స్‌ప్రెస్ భువనగిరి రైల్వే స్టేషన్‌కు చేరుకున్నాక బ్రేక్ బోల్టు స్టార్ రిలీజింగ్ పైపు విరగగా అక్కడ 20 నిమిషాల పాటు ఆపి తాత్కాలిక మరమ్మతు చేసి, కాజీపేట పంపించారు. కాజీపేటలో మెకానిక్ సిబ్బంది కూడా 10 నిమిషాల పాటు శ్రమించి మరమ్మతు పూర్తి చేశారు. ఇక రామగుండం వెళ్లే సరికి మళ్లీ ఆగిపోయింది. దీంతో కాజీపేట నుంచి మెకానిక్ సిబ్బంది కొత్త బోల్టు స్టార్ పైప్ తీసుకెళ్లారు. అక్కడి సిబ్బందితో కలసి గంట పాటు శ్రమించి బోల్డు స్టార్‌ను తొలగించి కొత్తది అమర్చారు. ఇలా సాంకేతిక సమస్య కారణంగా తెలంగాణ ఎక్స్‌ప్రెస్ రెండు గంటల పాటు ఆలస్యంగా వెళ్లినట్లు రైల్వే అధికారులు వెల్లడించారు.

# అనుమానాస్పదంగా తల్లీకూతుళ్ల మృతి

## భర్తే హంతకుడని ఆరోపిస్తున్న మృతురాలి బంధువులు

**కొండాపూర్(సంగారెడ్డి):** సంగారెడ్డి జిల్లాలో రెండు రోజుల క్రితం అదృశ్యమైన తల్లీకూతుళ్లు ఓ చేనులో శవమై కనిపించారు. కొండాపూర్ ఎస్సై రాజు కథనం ప్రకారం.. ఈ నెల 23వ తేదీ సోమవారం ఇంట్లో నుంచి వెళ్లిన జయశీల (30), దుర్గమ్మ(4) బుధవారం పత్తి చేనులో శవమై కనిపించారు. కొండాపూర్ మండలం సైదాపూర్ గ్రామానికి చెందిన బాలయ్యకు ఇద్దరు భార్యలు. జయశీల రెండో భార్య. బాలయ్య తన మొదటి భార్య వద్దనే ఉండగా జయశీల తన కూతురు దుర్గతో కలసి అదే గ్రామంలో ఓ అద్దె ఇంట్లో నివాసం ఉంటోంది. అయితే సోమవారం ఇంట్లో నుంచి వెళ్లిన తల్లీకూతుళ్లు అనుమానాస్పద స్థితిలో మృతిచెందారు. పంచనామా అనంతరం పోస్టుమార్టం నిమిత్తం తల్లీకూతుళ్ల మృతదేహాలను సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి తండ్రి లచ్చయ్య ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు.

**పోలీసులతో వాగ్వాదం..**

తల్లీకూతుళ్లు శవాలుగా మారడంతో గ్రామంలో విషాదం నెలకొంది. విషయం తెలియడంతో గ్రామస్తులు ఘటన స్థలానికి చేరుకున్నారు. శవాలను తరలిస్తున్న సమయంలో గందరగోళం నెలకొంది. తల్లీకూతుళ్లను బాలయ్యనే హత్య చేశాడని, బాలయ్యను తమకు అప్పజెప్తేనే శవాలను ఇక్కడి నుంచి పంపిస్తామని బంధువులు చెప్పారు. పోలీసులతో వాగ్వావాదానికి దిగారు. సీఐ శివలింగం జోక్యం చేసుకొని నిందితులకు శిక్ష పడేలా చూస్తామని హామీ ఇవ్వడంతో గొడవ సద్దుమణిగింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



# 'ఖాకీ' వనంలో...

## కీచక పర్వం!

- ఆర్నెల్లుగా మహిళా కానిస్టేబుల్‌ను వేధిస్తున్న ఎస్సై
- సీఐ మందలించినా మారని తీరు
- వేటు వేసిన జిల్లా ఎస్పీ
- జగిత్యాల జిల్లాలో ఘటన

**కోరుట్ల:** కంచె చేను మేసిన చందంగా.. ఓ కీచక ఎస్ఐ తన పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న మహిళా కానిస్టేబుల్‌ను లైంగికంగా వేధింపులకు గురి చేస్తున్న విషయం వెలుగులోకి వచ్చింది. సీఐ మందలించినా.. ఎస్సై తీరులో మార్పు రాకపోవడం.. చివరకు ఈ వ్యవహారం ఎస్పీ దృష్టికి వెళ్లడంతో అతనిపై వేటు వేసినట్లు సమాచారం. విశ్వసనీయ సమాచారం మేరకు.. జగిత్యాల జిల్లా ఓ పోలీస్ సబ్ డివిజన్ కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న మహిళా కానిస్టేబుల్‌ను అదే ఠాణాకు చెందిన ఎస్సై ఆర్నెల్లుగా వేధిస్తున్నట్లు తెలిసింది. తరచూ వాట్సాప్‌లో మెసేజ్‌లు పెడుతూ.. వీడియో కాల్ చేయాలని ఆ ఎస్సై వేధింపులకు గురి చేసేవాడు. విషయం బయట తెలిస్తే పరువు పోతుందేమోనన్న ఆందోళనతో ఆమె ఎవరికీ చెప్పుకోలేక తనలో తాను కుమిలిపోయింది. అయితే.. రోజురోజుకు వేధింపులు ఎక్కువ కావడం.. ఎస్సై తీరుతో విసిగిపోయిన ఆమె తన సన్నిహితులు.. అలాగే అదే సబ్‌డివిజన్‌కు చెందిన ఓ సీఐతో మొర పెట్టుకున్నట్లు సమాచారం. ఈ విషయంపై ఆయన ఎస్సైని మందలించినా మార్పు రాలేదు. చివరకు ఈ వ్యవహారం జిల్లా ఎస్పీ దృష్టికి వెళ్లగా.. తక్షణం అతడిని బదిలీ చేసి వీఆర్‌కు అటాచ్ చేసినట్లు సమాచారం. పోలీసు అధికారులు మాత్రం పాలనాపరమైన అవసరాల కోసమే ఎస్సైని బదిలీ చేసినట్లు చెబుతున్నారు.

## 'చలి'ంచిన మానవత్వం

- నొప్పులతో బాధ పడుతున్న గర్భిణి
- తెల్లవారుజామున సైకిల్‌పై తీసుకెళుతున్న భర్త
- తన వాహనంలో ఆస్పత్రికి తరలించిన ఎస్సై సాయన్న

**నిజాంసాగర్ (జుక్కల్):** ఓ వైపు భార్యకు పురిటినొప్పులు.. బయటనేమో ఎముకలు కొరికే చలి.. ఏమి చేయాలో దిక్కుతోచక.. దేవుడిపై భారం వేసి.. తెల్లవారుజామున భార్యను సైకిల్‌పై ఎక్కించుకొని బయలుదేరాడో భర్త. మార్గమధ్యలో.. పెట్రోలింగ్‌లో ఉన్న ఓ ఎస్సై వీరి దీనస్థితి గమనించి చలించిపోయారు. వెంటనే తన వాహనంలో ఆస్పత్రికి తరలించి మానవత్వాన్ని చాటుకున్నారు. ఈ ఘటన బుధవారం తెల్లవారుజామున కామారెడ్డి జిల్లా నిజాంసాగర్ మండలం పరిధిలో చోటుచేసుకుంది. బ్రాహ్మణపల్లికి చెందిన రజితకు తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో నొప్పులు ప్రారంభమయ్యాయి. ఎలాగైనా ఆమెను ఆస్పత్రికి తరలించాలని భర్త పవన్‌కుమార్ నిర్ణయించాడు. తెల్లవారుజామున మూడు గంటల ప్రాంతంలో ఎముకలు కొరికే చలిలో సైకిల్‌పై ఎక్కించుకొని ఆస్పత్రికి బయలుదేరాడు. అదే సమయంలో పెట్రోలింగ్ చేస్తున్న ఎస్సై సాయన్న.. వారిని గమనించి ఎక్కడికి వెళ్తున్నారని ప్రశ్నించారు. పవన్ విషయం తెలపడంతో చలించిపోయిన ఎస్సై.. వారిని తన వాహనంలో ఎక్కించుకొని 30 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఎల్లారెడ్డిలోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. అయితే.. రజితకు నెలలు నిండకపోవడం.. అప్పటికే తల్లి గర్భంలో శిశువు మృతి చెందడంతో ఆపరేషన్ చేసి బయటకు తీశారు.




గర్భిణిని ఆస్పత్రిలో చేర్పించిన పోలీసులు



ఉగ్రరూప నరసింహుడు.. భక్త ప్రహ్లాదుడు, హిరణ్యకశ్యపుడి విగ్రహాలు

# పంచలోహ విగ్రహాలతో ప్రహ్లాద చరిత్ర

**యాదగిరిగుట్ట:** యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణం పనుల్లో భక్తులకు మరింత కొత్తదనం కనిపించేలా వైటీడీఏ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. కొన్ని రోజులుగా శిల్పులు రూపొందిస్తున్న ప్రహ్లాద చరిత్ర ఘట్టాలన్నీ పూర్తయ్యాయి. ప్రధాన ఆలయంలోని గర్భాలయ ద్వారాలను ఇప్పటికే బిగించిన అధికారులు.. ముఖ ద్వారంపై ప్రహ్లాద చరిత్ర ఘట్టాలను అమర్చే పనులను ఇటీవల చేపట్టారు. స్వామివారి దర్శనానికి వచ్చే ప్రతి భక్తుడికి ప్రహ్లాదుడి చరిత్ర స్పష్టంగా అర్థమయ్యే విధంగా ఈ ఘట్టాలను రూపొందించారు. ఇప్పటికే ఏడు ఘట్టాలకు సంబంధించిన ప్యానళ్లను ప్రధాన ఆలయంలోకి చేర్చిన అధికారులు మరో మూడింటిని సిద్ధం చేస్తున్నారు. ఈ ఘట్టాలకు సంబంధించిన విగ్రహాలను పంచ లోహాలతో రూపొందించినట్లు శిల్పులు తెలిపారు.



పంచలోహ భక్త ప్రహ్లాద విగ్రహం



శాంతరూప నరసింహుడి విగ్రహం

# 70 మంది విద్యార్థులకు అస్వస్థత

- చర్మ సమస్యలతో ఇబ్బంది పడుతున్న పిల్లలు
- సిద్దిపేట జిల్లాలో జ్యోతీబాపూలే విద్యార్థుల వ్యథ


**సిద్దిపేట రూరల్:** సిద్దిపేట జిల్లాలో మహాత్మా జ్యోతీబాపూలే బాలుర గురుకుల పాఠశాలలో 70 మంది విద్యార్థులు చర్మ సంబంధమైన సమస్యతో అస్వస్థతకు గురయ్యారు. ముఖాలపై ఎర్రటి పొక్కులతో చర్మం పొలుసుబారడంతో విద్యార్థులు భయాందోళనకు గురవుతున్నారు. కాగా, 70 మంది పిల్లలు అస్వస్థతకు గురైనప్పటికీ సంబంధిత అధికారులు అటువైపు చూడకపోవడంపై విమర్శలు వస్తున్నాయి. మినుగురు పురుగులు కుట్టడం వల్లే విద్యార్థులు అస్వస్థతకు గురై ఉంటారని వైద్యులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. వివరాలిలా ఉన్నాయి.. నారాయణరావుపేట జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలకు సొంత భవనాన్ని నిర్మిస్తున్న నేపథ్యంలో స్కూల్‌ను తాత్కాలికంగా సిద్దిపేట శివారులోని ఎల్లంకి కళాశాల ఆవరణలోకి మార్చారు. 5వ తరగతి నుంచి 9వ తరగతివరకు మొత్తంగా 327 మంది విద్యార్థులు విద్యను అభ్యసిస్తూ హాస్టల్లో ఉంటున్నారు. పాఠశాలలో పైఅంతస్తులోని డార్మిటరీ హాల్‌లో విద్యార్థులు నిద్రించేందుకు ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో గత కొన్ని రోజులుగా కొందరు విద్యార్థుల మొఖాలపై ఎర్రటి పొక్కులు ఏర్పడ్డాయి. బుధవారం పాఠశాలలో మొత్తంగా 70 మందికి పైగా పొలుసు బారిన చర్మంతో అస్వస్థతకు గురయ్యారు. విషయం తెలుసుకున్న కుటుంబీకులు తమ పిల్లల పరిస్థితిపై గురుకుల పాఠశాలలోని వైద్యాధికారి ద్వారా ఆరా తీశారు. మినుగురు పురుగులు కుట్టడం వల్లే చర్మం పొలుసుబారి ఉంటుందని వైద్యులు అనుమానం వ్యక్తం చేశారు. వైద్యులు చికిత్స చేసినప్పటికీ ముఖాలపై చర్మం పొలుసుబారడం తగ్గకపోవడంతో పిల్లల అస్వస్థతకు గల కారణంపై సందేహాలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధానంగా వసతి గృహం చుట్టూ పారిశుధ్యం లోపించడం, మినుగురు పురుగుల ప్రభావం, ఆహార నాణ్యతాలోపం తదితర అంశాల్లో ఏదో ఒకటి విద్యార్థులపై ప్రభావం చూపడం వల్లే ఒక్కసారిగా 70 మంది అస్వస్థతకు గురై ఉంటారని ఆరోపణలు వస్తున్నాయి.



**వెలుగులతో స్వాగతిస్తూ..**
క్రిస్మస్, నూతన సంవత్సర వేడుకలకోసం రష్యా ముస్తాబైంది. సెయింట్ పీటర్స్‌బర్గ్‌లోని పొంటాంకా నదిపై నిర్మించిన లొమొనోసోవ్ వంతెనను బుధవారం క్రిస్మస్ సందర్భంగా ఇలా విద్యుత్ దీపాలతో అలంకరించారు.

# గోల్డ్‌స్టోన్‌కు గట్టిదెబ్బ

- హైదర్‌నగర్ భూములపై హక్కులు లేవు
- జాగీర్ భూములేనని తేల్చిన ధర్మాసనం
- ప్రతివాదులకే భూములపై హక్కులు
- కీలక తీర్పు వెలువరించిన హైకోర్టు




**సాక్షి, హైదరాబాద్:** పెను సంచలనం సృష్టించిన వేల కోట్ల రూపాయల విలువైన హైదర్‌నగర్ గ్రామంలోని 196 ఎకరాల భూముల స్కాం కేసులో గోల్డ్‌స్టోన్ ఎక్స్‌పోర్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థతోపాటు ఇతరులకు హైకోర్టులో గట్టి ఎదురుదెబ్బ తగిలింది. భూములపై తమకు హక్కులు ఉన్నాయంటూ గోల్డ్‌స్టోన్ ఎక్స్‌పోర్ట్స్‌తోపాటు మరో 16 మంది దాఖలు చేసిన అప్పీల్ పిటిషన్లు, పలు అనుబంధ పిటిషన్లు అన్నింటినీ కొట్టేస్తూ ఇటీవల కీలక తీర్పు వెలువరించింది. ఈ మేరకు హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ ఎం.ఎస్.రామచంద్రరావు, జస్టిస్ కె.లక్ష్మణ్‌తో కూడిన ధర్మాసనం 152 పేజీల తీర్పు వెలువరించింది. దీంతో 60 ఏళ్లుగా వివిధ కోర్టుల్లో పెండింగ్‌లో ఉన్న హైదర్‌నగర్‌కు చెందిన అత్యంత విలువైన భూముల వివాదానికి తెరపడింది. హైదర్ నగర్‌లోని సర్వే నంబర్ 172 సహా అప్పీల్ పిటిషన్లలో పేర్కొన్న భూములు జాగీర్ భూములేనని స్పష్టం చేసింది. నిజాం కాలంలో 1948 సంవత్సరానికి పూర్వమే వాటిని ఈనాం ఇచ్చారని పేర్కొంది. సర్వే నంబర్ 172తో సహా ఈ భూములపై పిటిషనర్లు ఖుర్షీద్ జా పైగా.. మాతృక ఆస్తి నుంచి ప్రాథమిక డిక్రీ ద్వారా భూములపై హక్కులు పొందినట్లుగా గోల్డ్‌స్టోన్ కంపెనీ ఇతరులు రుజువు చేసుకోలేకపోయారని తేల్చింది. ఖుర్షీద్ జా పైగాకు చెందిన భూముల్లో కొన్నింటిని రుకియా బేగం, వారిస్ అలీ, ఘనీ షరీఫ్, బొడ్డు వీరస్వామి ఇతరులు 1948 సంవత్సరానికి ముందే నిజాం కాలంలోనే సాగు చేసుకున్నారని, భూముల్ని సాగు చేసినట్లుగా పట్టాలు కూడా ఉన్నాయని స్పష్టం చేసింది. వారి నుంచి కొనుగోలు చేసిన వారికే భూములపై హక్కులు ఉంటాయని.. ఖాసిం నవాజ్ జంగ్, సైరస్ ఇన్వెస్ట్‌మెంట్ల నుంచి కొనుగోలు చేసిన వారికి ఏ హక్కులు ఉండవని స్పష్టం చేసింది. నిజాం స్టేట్ భారత్‌లో విలీనం కాకముందే రైతులకు భూములపై హక్కులు సంక్రమించాయని, హైదరాబాద్ జాగీర్ అబాలిషన్ రెగ్యులేషన్, 1358 ఫసలీ (1947) రాక ముందే వారికి సాగు నిమిత్తం పట్టాలు కూడా ఉన్నందున ఇవి ప్రభుత్వ భూములు కావని హైకోర్టు పేర్కొంది.

**60 ఏళ్ల వివాదానికి తెర...**

నిజాం పాలనలో సైన్యంలో యువతను చేర్పించినందుకు ఖుర్షీద్ జాకు నిజాం హైదర్‌నగర్ గ్రామంలోని 1,210 ఎకరాలను (సర్వే నంబర్ 145, 163, 172) 1929 సంవత్సరానికి ముందే ఈనాం ఇచ్చారు. ఆ భూములకు పైగా హక్కులు కల్పించారు. దీంతో అప్పటి నుంచి వీటిని ఖుర్షీద్ జాహీ పైగా భూములని పిలవడం మొదలైంది. 1929లో ఖుర్షీద్ కన్నుమూయడంతో ఆయన కుమార్తె దిల్దారున్నీసా బేగం ఈ భూముల కోసం న్యాయ పోరాటం ప్రారంభించారు. ఈ కేసు అటు రెవెన్యూ వర్గాలు, ఇటు న్యాయవర్గాల్లో సీఎస్ 14గా పేరుగాంచింది. ఇది 1958లో హైకోర్టుకు చేరింది. జిల్లా, హైకోర్టు, సుప్రీంకోర్టులకు ఈ వివాదం చేరింది. అయితే కొంతమంది తప్పుడు పత్రాలతో డిక్రీ పొంది భూముల్లో కొంత మేరకు క్రయవిక్రయాలు చేశారు. 2004లో హైకోర్టు రిట్లను డిస్మిస్ చేయడంతో పిటిషనర్లు ధర్మాసనం ఎదుట అప్పీల్ చేశారు. సింగిల్ జడ్జి తీర్పును ధర్మాసనం కొట్టేస్తూ ఇచ్చిన తీర్పును సుప్రీంకోర్టు తప్పుపట్టింది. తిరిగి హైకోర్టు విచారణ చేయాలని సుప్రీంకోర్టు ఆదేశించింది. దీంతో న్యాయమూర్తి జస్టిస్ ఎం.ఎస్.రామచంద్రరావు నేతృత్వంలోని ధర్మాసనం తుది తీర్పు వెలువరించడంతో 60 సంవత్సరాలుగా వివాద భూములపై స్పష్టత వచ్చింది.

**ఆ డిక్రీ చెల్లదు...**

ఈ భూముల విషయంలో కోర్టును తప్పుదారి పట్టించి 1963, జూన్ 28న కింది కోర్టు నుంచి పొందిన డిక్రీ చెల్లదని తేల్చింది. 1996 బెయిలీఫ్ నివేదిక ఆధారంగా సర్వే నంబర్ 172లోని భూమిని ప్రతివాదుల నుంచి స్వాధీనం చేసుకోవడం చెల్లదని, ఆ భూమిని తక్షణమే ప్రతివాదులకు అప్పగించాలని ఆదేశించింది. అంతే కాకుండా అప్పీల్ పిటిషనర్లు (ఓఎస్‌ఏ 54, 56, 57, 58) ప్రతివాదులకు రూ.10 వేలు చొప్పున పరిహారం చెల్లించాలని పేర్కొంది. హైదర్ నగర్ భూములపై 1984, జనవరి 20న, 1995, డిసెంబర్ 28న కోర్టుకు తప్పుడు సమాచారం ఇవ్వడం ద్వారా పిటిషనర్లు పొందిన ఉత్తర్వులు, తద్వారా భూమిపై హక్కు ఉందనే వాదన చెల్లుబాటు కాదని తేల్చి చెప్పింది. సీఎస్ 14/1958 కేసులో రంగారెడ్డి జిల్లా కోర్టు ఇచ్చిన డిక్రీ చెల్లదని వెల్లడించింది. హైదర్‌నగర్‌లోని సర్వే నంబర్ 172లో 98 ఎకరాల 10 కుంటల భూమి విషయంలో 1998లో తుది డిక్రీ ఉత్తర్వులను ధర్మాసనం కొట్టేసింది. ఇదే భూ వివాదంపై రంగారెడ్డి జిల్లా కోర్టు 1996లో జారీ చేసిన ఉత్తర్వులు, ఎగ్జిక్యూటివ్ వారెంట్లు, బెయిలీఫ్ కూడా చట్ట వ్యతిరేకమని హైకోర్టు తీర్పు చెప్పింది. 2004లో హైకోర్టు సింగిల్ జడ్జి జస్టిస్ ఎల్.నర్సింహారెడ్డి ఇచ్చిన తీర్పును ధర్మాసనం సమర్థించింది.

## విదేశీ ఉపగ్రహ మార్కెట్‌పై

# ఇస్రో దృష్టి

**ఇప్పటి వరకు 33 దేశాలకు చెందిన 319 ఉపగ్రహాలు నింగిలోకి..**

**ఐదేళ్లలో రూ.1,245 కోట్ల ఆదాయం గడించిన ఇస్రో**

**సాక్షి, అమరావతి:** ఉపగ్రహ ప్రయోగాలకు ప్రపంచ దేశాలు ఇప్పుడు భారత్ వైపు చూస్తున్నాయి. ఈ ప్రయోగాలకు ఆంధ్రప్రదేశ్‌లోని శ్రీహరికోట వేదిక కావడం గమనార్హం. అతి తక్కువ వ్యయంతో ఒకేసారి పలు ఉపగ్రహాలను నింగిలోకి పంపే సామర్థ్యాన్ని భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ(ఇస్రో) కలిగి ఉండటంతో విదేశాలు ఇక్కడికి క్యూ కడుతున్నాయి. 1999లో తొలిసారిగా జర్మనీకి చెందిన డీఎల్ఆర్–టబ్‌సాట్ రిమోట్ సెన్సింగ్ మైక్రో శాటిలైట్‌ను విజయవంతంగా కక్ష్యలోకి ప్రవేశపెట్టిన తర్వాత నుంచి ఇస్రో ఇక వెనుతిరిగి చూసుకోలేదు. ఇప్పటి వరకు 33 దేశాలకు చెందిన 319 ఉపగ్రహాలను ఇస్రో నింగిలోకి పంపింది.

**ఇస్రో స్వయం ప్రతిపత్తి...**

విదేశీ ఉపగ్రహాలను అంతరిక్షంలోకి పంపడం ద్వారా ఇస్రో2018–19లో రికార్డు స్థాయిలో రూ.324.19 కోట్ల ఆదాయం ఆర్జించింది. 2017–18లో రూ.232.56 కోట్ల ఆదాయాన్ని సంపాదించింది. గడిచిన ఐదేళ్లలో రూ.1,245.17 కోట్ల నికర ఆదాయాన్ని సమకూర్చుకుంది. ఇస్రో తన ప్రయోగాలకు సొంతంగానే నిధులను సమకూర్చుకునే స్థితికి చేరుకుంటోంది. విదేశీ ఉపగ్రహ ప్రయోగాల కోసం బెంగళూరు కేంద్రంగా ఆంట్రిక్స్ అనే సంస్థను ఏర్పాటు చేసింది. 1992లో ఏర్పాటైన ఈ సంస్థ గడిచిన మూడేళ్లలో 239 ఒప్పందాల ద్వారా రూ.6,280 కోట్ల నిర్వహణ ఆదాయాన్ని సముపార్జించింది. విదేశీ ఉపగ్రహాలను నింగిలోకి పంపడంలో పీఎస్ఎల్‌వీ కీలకపాత్ర పోషిస్తోంది. ఇంతవరకు పీఎస్ఎల్‌వీ 52.7 టన్నుల శాటిలైట్లను నింగిలోకి తీసుకెళ్లింది. గత నెలలోనే పీఎస్ఎల్‌వీ–ఎక్స్‌ఎల్ అమెరికాకు చెందిన 13 నానో శాటిలైట్లను విజయవంతంగా ఆర్బిట్‌లోకి ప్రవేశపెట్టింది. వచ్చే మార్చిలోగా ఆరు సార్లు ఉపగ్రహాలను నింగిలోకి పంపే విధంగా ప్రణాళికలు సిద్ధం చేసినట్లు ఇస్రో చైర్మన్ కె.శివన్ తెలిపారు.

రానున్న పదేళ్లలో అంతర్జాతీయ శాటిలైట్ మార్కెట్ వేగంగా విస్తరించనుందని బీఐఎస్ రీసెర్చ్ సంస్థ అంచనా వేసింది. 2030 నాటికి ప్రపంచవ్యాప్తంగా 17,000కుపైగా మినీ శాటిలైట్లను ప్రయోగిస్తారని చెబుతోంది. ప్రస్తుతం రూ.3,591 కోట్లుగా ఉన్న శాటిలైట్ లాంచింగ్ మార్కెట్ విలువ 2030 నాటికి రూ.20,300 కోట్లకు చేరుతుందని బీఐఎస్ లెక్కగట్టింది. ప్రస్తుతం ఈ మార్కెట్‌లో ఇస్రో వాటా కేవలం 2 శాతమే. ఈ వ్యాపార అవకాశాలను ఒడిసి పట్టుకోవడానికి ఆంట్రిక్స్‌కు అనుబంధంగా న్యూస్పేస్ ఇండియా లిమిటెడ్ (ఎన్‌ఎస్ఐఎల్) పేరిట 2019లో మరో సంస్థను ఇస్రో ఏర్పాటు చేసింది. ఈ సంస్థ విదేశాలకు చెందిన ఉపగ్రహ ప్రయోగాలు, శాటిలైట్ అభివృద్ధి వ్యాపారంపై దృష్టి సారిస్తుంది.

**పదేళ్లలో రూ.20,300 కోట్లు**




# హరిత ప్రణాళికలు

- అటవీ, పీఆర్ శాఖలు, గ్రామకమిటీల సమన్వయంతో చర్యలు

**సాక్షి, హైదరాబాద్:** గ్రామాల్లో పచ్చదనం పెంపొందించేందుకు ప్రతీ గ్రామానికి హరిత కార్యాచరణ ప్రణాళిక (విలేజ్‌లెవల్ గ్రీన్‌ప్లాన్)లు సిద్ధమయ్యాయి. వచ్చేనెల 2 నుంచి పదిరోజుల పాటు రెండో విడత పచ్చదనం, పరిశుభ్రత కార్యక్రమం చేపట్టనున్న నేపథ్యంలో శాఖాపరంగా చేపట్టాల్సిన చర్యలపై అటవీశాఖ దృష్టి నిలిపింది. మరోవైపు ఒక్కో గ్రామంలో అందుబాటులో ఉన్న ఖాళీ స్థలాలు, రాబోయే సంవత్సరాల్లో ఎన్ని మొక్కలు నాటాలి, వాటిని బతికించేందుకు ఎలాంటి కార్యాచరణ చేపట్టాలన్న అంశాలపై గ్రామస్థాయిలో నిర్ణయాలు తీసుకుంటున్నారు. దీంతోపాటు గ్రామస్తులు కోరిన మొక్కలనే సరఫరా చేసేందుకు కూడా ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తున్నారు. అందుబాటులో ఉన్నంతవరకు అవసరమైన మొక్కలను అటవీ శాఖ సరఫరా చేస్తోంది. నర్సరీల్లో మిగిలిన స్టాక్‌ను వచ్చే ఏడాది కోసం పెద్దగా పెరిగిన మొక్కలను సరఫరా చేసేందుకు వీలుగా పెంచాలని అటవీ శాఖ నిర్ణయించింది. ఇప్పటివరకు అటవీ శాఖ అధీనంలో ఉన్న నర్సరీలను గ్రామీణాభివృద్ధి శాఖకు అప్పగించారు.

**సంయుక్త సహకారం**

రాష్ట్రంలో పచ్చదనం పెంపుదలకు అటవీ, పంచాయతీరాజ్ శాఖలు, గ్రామ కమిటీల సంయుక్త సహకారం, సమన్వయంతో వివిధ రూపాల్లో కార్యక్రమాలు చేపడుతున్నారు. గ్రామాల్లో పచ్చదనం, పరిశుభ్రత సాధన లక్ష్యంగా గత సెప్టెంబర్ 6 నుంచి అక్టోబర్ 5 వరకు చేపట్టిన 30 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 7.32 కోట్ల మొక్కలను నాటినట్టుగా అటవీశాఖ లెక్కలను బట్టి తెలుస్తోంది. రాష్ట్రంలోని మొత్తం 12,751 గ్రామ పంచాయతీలకు గాను దాదాపుగా అన్నింట్లో గ్రామస్థాయి గ్రీన్‌ప్లాన్లు రూపొందించారు. అత్యధిక గ్రామాల్లో ఒక్కో నర్సరీ ఏర్పాటుకు స్థలం గుర్తింపు, మొక్కల పెంపకం పనులు మొదలయ్యాయి. 30 రోజుల కార్యక్రమంలో 24,244 కి.మీ మేర గ్రామానికి దారితీసే రోడ్డు, గ్రామానికి– మరో గ్రామానికి మధ్య అవెన్యూ ప్లాంటేషన్‌ను చేపట్టారు. వీటిలో 80.88 లక్షల మొక్కలను నాటడంతో పాటు రక్షణ చర్యలు చేపట్టారు. గ్రామాల్లో గుర్తించిన ఖాళీ ప్రదేశాలు, వివిధ సంస్థలకు చెందిన సామూహిక ప్రాంతాల్లో 40,522 ఎకరాల్లో బ్లాక్ ప్లాంటేషన్‌లో భాగంగా 2.26 కోట్ల మొక్కలు నాటారు. ఇక ఇంటింటికి ఆరు మొక్కల సరఫరాలో భాగంగా 2.26 కోట్ల మొక్కలు పంపిణీ చేశారు. కోతులకు అటవీ ప్రాంతాల్లోనే ఆహార లభ్యత కోసం మంకీ ఫుడ్ కోర్టులను ఏర్పాటు చేస్తున్నారు. మొదటి దశలో కామారెడ్డి, పెద్దపల్లి, జగిత్యాల జిల్లాల్లో మంకీ ఫుడ్ కోర్టులు ఏర్పాటయ్యాయి.

# హైదరాబాద్–బెంగళూరుకు తగ్గిన ఆర్టీసీ చార్జీలు

**ఆది, శుక్రవారాల్లో మార్పు ఉండదు**




**సాక్షి, హైదరాబాద్:** హైదరాబాద్ నుంచి బెంగళూరుకు రాకపోకలు సాగించే గరుడ ప్లస్ ఏసీ బస్సుల్లో చార్జీలను బుధవారం నుంచి తగ్గించినట్లు టీఎస్ఆర్టీసీ రంగారెడ్డి రీజనల్ మేనేజర్ బి.వరప్రసాద్ ఓ ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఉన్న టికెట్ ధర రూ. 1,300 నుంచి రూ. 950కి తగ్గించామని ఆయన పేర్కొన్నారు. ఈమేరకు హైదరాబాద్–బెంగళూరుకు సోమవారం నుంచి శనివారం వరకు చార్జీ రూ. 950 ఉంటుందని, ఆదివారం మాత్రం రూ. 1,300 ఉంటుందని చెప్పారు. అలాగే బెంగళూరు–హైదరాబాద్‌కు శనివారం నుంచి గురువారం వరకు రూ. 950 చొప్పున చార్జీ ఉంటుందని.. శుక్రవారం మాత్రం రూ. 1,300 చార్జీ వసూలు చేస్తామని వివరించారు. ప్రయాణికులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

MARUTI SUZUKI NEXA

CREATE NEW EXPERIENCES WITH THE BEST OFFERS OF THE YEAR.
Avail great year-end offers before the stock runs out.




LIMITED PERIOD OFFERS ONLY
VALID TILL 31st DECEMBER 2019

| BRAND | BALENO (P) | BALENO (D) | IGNIS | S-CROSS | CIAZ (P) | CIAZ (D) |
|---|---|---|---|---|---|---|
| CONSUMER OFFER* | ₹25 000 | ₹25 000+5 YEAR WARRANTY | ₹30 000 | ₹50 000+5 YEAR WARRANTY | ₹25 000 | ₹40 000+5 YEAR WARRANTY |
| EXCHANGE OFFER | ₹15 000 | ₹15 000 | ₹25 000 | ₹40 000 | ₹40 000 | ₹40 000 |
| CORPORATE OFFER | ₹5 000 | ₹10 000 | ₹10 000 | ₹10 000 | ₹10 000 | ₹10 000 |
| TOTAL SAVINGS# | ₹45 000 | ₹67 400 | ₹65 000 | ₹1 22 900 | ₹75 000 | ₹1 12 700 |

Contact us at 1800-200-[6392] 1800-102-[NEXA] www.nexaexperience.com NOW YOU CAN ALSO BOOK ONLINE
WARANGAL: NEXA WARANGAL EAST (ADARSHA AUTO WORLD PVT. LTD. PH: 9133398806),
KARIMNAGAR: NEXA RAMPUR (ADARSHA AUTO WORLD PVT. LTD. PH: 8897096633),
NIZAMABAD: NEXA NIZAMABAD EAST (VARUN MOTORS PH: 9160991616),
NALGONDA: NEXA NALGONDA NORTH (PAVAN MOTORS PVT LTD PH: 9100051403).
connect: A REVOLUTIONARY WAY TO CONNECT TO YOUR CAR • Vehicle Tracking • Emergency Alert • Driving Behaviour Analysis • Live Vehicle Status • Vehicle Alerts
Offered separately as Genuine NEXA Accessory
*Offer may vary from variant to variant. #Total savings include Consumer Offer + Exchange Offer + Highest Corporate Offer and a 5-year warranty (2-year standard warranty + 3-year extended warranty) on all NEXA Diesel cars.

# 11 నెలలు.. రూ. 100 కోట్లు

- ట్రాఫిక్ చలాన్లను లైట్ తీసుకుంటున్న జనం
- నవంబర్ వరకు రూ.107 కోట్లు దాటిన జరిమానాలు
- 29 లక్షల ఓవర్ స్పీడ్ కేసులకు రూ.82 కోట్ల చలానాలు



ఉల్లంఘనలకు విధించిన చలానాలు ఇలా..

**సాక్షి, హైదరాబాద్:** జరిమానాలకు జనం ఏమాత్రం జడవడం లేదు. ట్రాఫిక్ పోలీసులు కేవలం 11 నెలల్లో రూ.100 కోట్లకు పైగా చలానాలు విధించారంటే ఉల్లంఘనులు ఏస్థాయిలో చెలరేగుతున్నారో అర్థం చేసుకోవచ్చు. పెరుగుతున్న వాహనాలు, మితిమీరిన వేగం రోడ్డు ప్రమాదాలకు కారణమవుతున్నాయని పోలీసులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నవంబర్ వరకు ఒక్క ఓవర్‌స్పీడ్‌లోనే అత్యధికంగా 29 లక్షల కేసుల్లో రూ.82 కోట్ల చలానాలు విధించడం వాహనదారుల మితిమీరిన వేగానికి నిదర్శనం. ప్రతిరోజూ 58 రోడ్డు ప్రమాదాలు జరుగుతుండగా 16 మంది మరణిస్తున్నారు. 60 మంది క్షతగాత్రులవుతున్నారు. ప్రతి నిమిషానికీ 6 ఓవర్‌స్పీడ్ కేసులు నమోదవడం వాహనదారుల దూకుడును సూచిస్తోంది. వాస్తవానికి రోడ్డు ప్రమాదాలు అధికంగా జరుగుతున్న ప్రాంతాలను పరిశీలిస్తే.. జాతీయ రహదారులు అధికంగా ఉన్న ప్రాంతాల్లోనే జరుగుతుండటం గమనార్హం. అధికలోడు, మితిమీరిన వేగం, ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన, పెరుగుతున్న వాహనాల సంఖ్య కారణంగా రోడ్డు ప్రమాదాలు, చలానాలు అధికంగా నమోదయ్యేందుకు కారణమవుతున్నాయని రోడ్ సేఫ్టీ అధికారులు చెబుతున్నారు.

**రోడ్డు ప్రమాద మరణాలు**

| | | |
|---|---|---|
| నవంబర్ 30 వరకు జరిగిన ప్రమాదాలు: 19,538 | ఇప్పటి దాకా మరణించినవారు: 5,539 మంది | రోజుకు మరణిస్తున్న వారి సగటు: 16.5 (దాదాపుగా) |
| రోజుకు జరుగుతున్న ప్రమాదాలు: 58.32 (సరాసరి) | ఒక రోజుకు గాయపడుతున్నవారు: 60 మంది (సుమారు) | ఓవర్‌స్పీడ్ కేసులు నిమిషానికి: 6 కేసులు |

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited,Sakshi Press, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, T.G., and Printed at Jagati Publications Limited, Survey No 1612, Arjalabai Village & Mandal, Nalgonda Dist – 508 001, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. 08682 248277, 248311, Fax No. 08682 247911. RNI Regn No. TELTEL/2008/23792, Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.